# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

ఏప్రిల్ - 2015

సంపుటి- 41 సంచిక : 04



## సంపాదక వర్గం

**కె.జోజయ్య,** ప్రధాన సంపాదకులు
**పి.బాబురెడ్డి**
**ఐ.వెంకటేశ్వరరావు**
**సిహెచ్.సుభాష్‌చంద్రబోస్**
**ఎన్.కుమార్ రాజా**
**టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు**
**సిహెచ్.శ్రీహరి**


ఈ సంచికలో...


| | |
|---|---|
| ఆర్‌కె కొత్తపలుకు | -04 |
| శాసనమండలి ఎన్నికలు | -05 |
| విద్యను విస్మరించిన బడ్జెట్ | -07 |
| సామాజిక న్యాయానికి ప్రజాతంత్ర.... | -09 |
| అవయవదానం | -11 |
| ఆధార్‌జపం (కథ) | -13 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -15 |
| ఏవిఎస్ వర్ధంతి సభలు | -16 |
| ప్రశ్నోత్తరాలు | -19 |
| అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు | -20 |
| నిరసనలు - ధర్నాలు | -27 |
| క్లస్టర్ స్కూల్స్‌పై కార్యక్రమాలు | -29 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | -31 |



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ 1000-00 |
| 5 సం॥ చందా | : | ₹ 550-00 |
| సం॥ చందా | : | ₹ 120-00 |
| విడిప్రతి | : | ₹ 10-00 |

SBI Online
A/c No. 30206957939



**ఐక్య ఉపాధ్యాయ**
యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002

Ph.No. : 0866-2573763
Website : www.aputf.org.
E-mail : ikyopadhyaya@gmail.com


# అయిదేళ్ళ అధ్వానం

అయిదేళ్ళ క్రితం (2009) విద్యాహక్కు చట్టం వచ్చినప్పుడు అది ఎంత అరకొరగా వున్నా, ఆర్థిక వనరులపై ఎన్ని అనుమానాలున్నా, చిత్తశుద్ధిపై చింతాకంత నమ్మకం లేకున్నా గుడ్డిలో మెల్ల అని స్వాగతించాము. కాగితం మీదనైనా మన బాలలందరికీ ఓ హక్కు లభించిందని సంబరపడ్డాము.

తీరా ఇప్పుడు అయిదేళ్ళ తర్వాత దీని అమలు తీరుతెన్నులపై 'ఆర్‌టిఇ ఫోరమ్' చేసిన అధ్యయనం చూచాక, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనేగాదు దేశమంతటా 'ఒకే అందం ఒకే చందం' అని తెలిశాక సిగ్గుతో తలవంచుకోవల్సివస్తోంది' పిల్లల హక్కుల దగ్గరికొచ్చేప్పటికి ప్రపంచానిదంతా ఒకదారి, భారత దేశానిదొకదారి" అన్న మైరన్‌వైనర్ మాటలు ఇప్పటికీ ముమ్మాటికీ వాస్తవాలని మనం బుజువు చేసి ఆయనకు "ఘనమైన నివాళి" అర్పించామన్పిస్తోంది.

గుమ్మంముందు అందుబాటులో బడివుండాలని చట్టం చెబితే ఈ అయిదేళ్ళలో కేవలం 12 రాష్ట్రాల్లో 80వేల పాఠశాలలు మూతబడటమేమిటి? అందులో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోనే 9503 వుండటమేమిటి? 60లక్షలమంది అర్థాంతరంగా బడి మానెయ్యడమేమిటి? దాదాపు 6 లక్షల టీచర్ల పోస్టులు ఖాళీగా వుండటమేమిటి? పాతిక భాగం టీచర్లకు శిక్షణ లేకపోవడమేమిటి? ఇక విద్యాహక్కు చట్టం పేర్కొన్న మౌలిక వసతులూ 95.2% పాఠశాలల్లో దుర్భిణీవేసి వెతికినా కానరాకపోవడమేమిటి?

దీనికి బాధ్యత మొదట కేంద్రానిదీ, తర్వాత రాష్ట్రాలదీ. చట్టం తెచ్చిన కేంద్రం నిధుల దగ్గరకొచ్చేప్పటికి విదిలింపులతో సరిపెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం అందులోనూ 25% కోతవిధించి తమ జ్ఞాన సమాజ సంకల్పశుద్ధిని వేనోళ్ళా చాటుకొంది. ఉన్న అరకొర చట్టాన్ని సైతం సవరించి మరిన్ని తూట్లుపొడవాలను కొంటోంది.

ఇక రాష్ట్రాలు ఒక్క కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌లు మినహా అన్నీ చదువుల్ని చట్టుబండలు చేసినవే. కనీసం 20% బడ్జెట్‌లో నిధుల్ని కేటాయించినవి ఒక్కటీలేవు. వచ్చిన నిధుల్ని విచ్చిలవిడిగా వెచ్చించడంలోనూ ఒకదాని అన్న మరొకటి. మన రాష్ట్రానికైతే ఒకే తరహా మంత్రం "కార్పొరేట్ విద్య"

విద్యాహక్కు చట్టం చెబుతున్న పాఠమేమిటి? మొహమాటానికో, మభ్య పెట్టడానికో మాత్రమే పాలకులు చట్టాలు తెస్తారు. గొప్ప ప్రగతిశీలురమన్న ఫోజులు పెడతారు. ఇవి అమలు కావాలంటే బలమైన ప్రజాఉద్యమాలు వుండాలి. తీవ్రమైన ఒత్తిడివుండాలి. అలాంటి సామాజిక శక్తులూ, సంస్కృతీవున్న చోట ఎంత అరకొర చట్టమైనా శక్తివంతంగా అమలవుతుంది. అసలా చట్టాలు లేకున్నా లక్ష్యం తనంతటతాను నెరవేరుతుంది.

మరి అలాంటి శక్తుల్ని ఎక్కడ వెతుక్కొందాం? అలాంటి సంస్కృతిని ఎవరి నుంచి నేర్చుకొందాం? ఇవే మనముందున్న ప్రశ్నలు!

■ ఆర్కే

## కొత్తపలుకు



# సూర్యారావు మాస్టారు చెప్పిన పాఠం!

పాఠశాలల తరగతి గదులే భావి సమాజానికి దిశానిర్దేశం చేస్తాయి. మొత్తంమీద సమాజం ఎటుపోతున్నదో, ఏమైపోతున్నదో అని ఆక్రోశించేవారికి సూర్యారావు గెలుపు మాత్రం ఊరట కలిగించే అంశమే! ఉపాధ్యాయులలో వచ్చిన ఈ మార్పు మధ్య తరగతి పేద వర్గాల ప్రజలలో కూడా వస్తే రాజకీయ వ్యవస్థ బాగుపడుతుంది. ధనప్రభావం రాజకీయాలలో పోవాలంటే ఉభయగోదావరి జిల్లాల టీచర్లలో వలె అన్ని వర్గాల ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలనీ, వస్తుందనీ ఆశిద్దాం.

రాజకీయాలలో విలువలు లుప్తమవుతున్నాయనీ, ధనవంతులకే రాజకీయాలు పరిమితమవుతున్నాయనీ ఆవేదన చెందుతున్న వారికి ఉపశమనం కలిగించే పరిణామం ఇది. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి రాము సూర్యారావు మాస్టారు ఎన్నికయ్యారన్న వార్త తెలిసి చాలామంది ఆనందించారు. ఆయనతో పోటీపడిన తెలుగుదేశం పార్టీ బలపరచిన చైతన్య రాజు, రెబల్ అభ్యర్థి ప్రగతి కృష్ణారావులు గెలుపుకోసం కోట్లు గుమ్మరించారు. చైతన్యరాజు, కృష్ణారావు యిచ్చిన బహుమతులను అందుకున్న ఉపాధ్యాయులు కూడా రాము సూర్యారావు మాస్టారుకు ఓటు వేసి గెలిపించారు. ఈ పరిణామం నుంచి రాజకీయపార్టీలు కూడా నేర్చుకోవలసింది ఎంతో ఉంది. ప్రజలు కూడా చెడిపోయారు. డబ్బు పంచనిదే ఓట్లు వేయడానికి ఇష్టపడటం లేదు. ఆ కారణంగానే ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయగలిగే వారికే టికెట్లు ఇవ్వవలసి వస్తున్నది అన్నది రాజకీయ పార్టీల వాదనగా ఉంటోంది. ప్రజలను అలా చెడగొట్టింది కూడా రాజకీయ పార్టీలే కనుక ప్రజలను నిందించి లాభం లేదు. సూర్యారావు మాస్టారు వద్ద డబ్బు లేదు, పేద పిల్లలకు చదువులు చెప్పించడానికై ఆయన సొంత ఆస్తిని కూడా కరగదీశారు. జీతంతోపాటు పదవీవిరమణ తర్వాత వచ్చిన సొమ్మును కూడా ఆయన సేవాకార్యక్రమాలకే వెచ్చించారు. సూర్యారావు వలె సమాజ సేవ చేస్తున్నవారు కొద్దిమందే ఉన్నారు. అయితే వారికి అటు సమాజం నుంచిగానీ, ఇటు రాజకీయ పార్టీల నుంచిగానీ తగిన గుర్తింపు లభించడం లేదు. ఫలితంగా డబ్బు సంపాదనే ఆదర్శంగా యువతరం పరుగులు తీస్తోంది. ఈ నేపథ్యంలో సూర్యారావు గెలుపు మనకు ఎన్నో సంకేతాలను ఇస్తున్నది. సూర్యారావు మాస్టారు వంటి సేవా గుణం ఉన్న వారిని ప్రధాన రాజకీయ పక్షమైన తెలుగుదేశం పార్టీ ఎందుకు గుర్తించలేకపోయిందన్నది మొదటి ప్రశ్న.

డబ్బులేనిదే రాజకీయాలు చేయలేమన్న అభిప్రాయానికి రాజకీయ పార్టీలు వచ్చాయి కనుక వారికి సూర్యారావులు కనిపించడం లేదు. ఇంతకీ ఉభయగోదావరి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏమి జరిగిందో ఇప్పుడు పరిశీలిద్దాం, చైతన్యరాజును తెలుగుదేశం పార్టీ తన అభ్యర్థిగా ప్రకటించింది. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఆర్థికంగా ఆదుకున్న తనకు టికెట్ నిరాకరించారన్న ఆగ్రహంతో ప్రగతి కృష్ణారావు రెబల్ అభ్యర్థిగా పోటీకి దిగారు. ఇద్దరు అభ్యర్థులూ పోటీపడి కోట్లాది రూపాయలు పంచిపెట్టారు. ఉపాధ్యాయ నియోజకవర్గాలకు పోటీచేసే సిపిఎం తగిన అభ్యర్థి కోసం జరిపిన అన్వేషణలో సూర్యారావు మాస్టారు కనిపించారు. దీంతో యుటియఫ్ తరపున ఆయనను అభ్యర్థిగా దింపారు. టీచర్‌గా పనిచేసి జీవితాన్ని – ఆస్తిని పేదల కోసం త్యాగం చేసిన సూర్యారావు వైపు టీచర్లు ఆకర్షితులయ్యారు. తెలుగు దేశం అభ్యర్థితోపాటు రెబల్ అభ్యర్థి యిచ్చిన నగదును, కానుకలను స్వీకరించిన టీచర్లూ తమ ఓటును మాత్రం సూర్యారావుకే వేశారు. ఇక్కడ ఇంకో విచిత్రం జరిగింది. చైతన్యరాజు, కృష్ణారావు నుంచి డబ్బు లేదా కానుకలు స్వీకరించిన వారిలో పలువురు సూర్యారావు మాస్టారు ఎన్నికల ప్రచారం కోసం అయిదు వందల రూపాయల వంతున విరాళం కూడా ఇచ్చారు. ఇందుకు వారిని అభినందించకుండా ఉండలేం! అయితే ఎన్నికల్లో డబ్బు తీసుకోవడం కూడా అనైతికం కదా? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. నిజమే... ఓటు వేయకపోయినా, వేసినా డబ్బు తీసుకోవడం అనైతికతే అవుతుంది. అయితే డబ్బు తీసుకుని అనర్హులను అందలం ఎక్కించే కంటే డబ్బు తీసుకున్నా కూడా అర్హులకే ఓటే వేయడం ప్రస్తుత పరిస్థితులలో శుభసంకేతంగా చెప్పవచ్చు.

అంతేకాదు, తమ ఈ చర్యద్వారా రాజకీయపార్టీలకు హెచ్చరికతో కూడిన సంకేతాన్ని కూడా సదరు ఓటర్లు ఇచ్చారు. డబ్బున్న వారికి టికెట్లు ఇచ్చినంత మాత్రాన గెలిపించబోం అన్నది హెచ్చరిక కాగా, సూర్యారావు మాస్టారు వంటి వారిని గుర్తించి టికెట్ ఇస్తే ఆదరించి గెలిపించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్న సంకేతం కూడా ఇందులో ఉంది. ఈ సంకేతాన్ని రాజకీయ పార్టీలు స్వీకరిస్తాయా? లేదా? అన్నది ముమ్ముందు తెలుస్తుంది. డబ్బు పంచితే ప్రజలు ఓట్లు వేస్తారన్న భ్రమల నుంచి రాజకీయ పార్టీలు బయటపడటానికి ఈ ఫలితం ఒక సదవకాశం. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేలల్లో జీతాలు తీసుకుంటూ ఎన్నికల్లో వెయ్యి రూపాయలకో, రెండువేల రూపాయలకో కక్కుర్తిపడి ఓట్లు అమ్ముకోవడంపై ఇటీవలి కాలంలో విమర్శలు పెరిగాయి. గత ఎన్నికలలో డబ్బునే నమ్ముకుని గెలుపొందిన చైతన్యరాజు ఈ పర్యాయం కూడా అదే ఫార్ములాను అమలుచేశారు. అయితే కథ అడ్డంతిరిగింది. ఈసారి కూడా చైతన్యరాజు ఇచ్చే కానుకలకు కక్కుర్తిపడి గెలిపిస్తే తాము డబ్బుకు అమ్ముడుపోతున్నామన్న చెడ్డపేరు వస్తుందన్న అభిప్రాయానికి మెజార్టీ టీచర్లు వచ్చారు. అందుకే ఎడమ చేత్తో కానుకలు స్వీకరించి కుడి చేత్తో ఓటును మాత్రం సూర్యారావుకు వేశారు.

సూర్యారావు మాస్టారు వంటి సేవాతత్పరుడిని గెలిపించినందుకు టీచర్లను అభినందించవలసిందే గానీ.... భావిభారత సమాజానికి దిక్సూచిగా ఉండవలసిన టీచర్లు ఓటు వేయడానికి డబ్బు లేదా కానుకలు స్వీకరించడం అనైతికమే అవుతుంది. మిగతా వృత్తులలో ఉన్న వారితో పోల్చితే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు ఆదర్శంగా ఉండాలని సమాజం ఆశిస్తుంది. ఉపాధ్యాయులు ఒకప్పుడు ఆదర్శంగానే జీవించారు. ఆ కారణంగానే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు తమకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన మాస్టార్లను ఇప్పటికీ గుర్తు చేసుకుంటూ ఉన్నారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సూర్యా

**(తరువాయి 8వ పేజీలో)**

# శాసనమండలి ఎన్నికలు

## కొన్ని పాఠాలూ ! కొన్ని గుణపాఠాలూ !!



వి.బాలసుబ్రహ్మణ్యం
పిడిఎఫ్ ఎమ్మెల్సీ

శాసనమండలి ఎన్నికలు ముగిశాయి. సాంకేతికంగా గెలుపూ, ఓటమీ వెల్లడైనాయి. వెల్లడికాని నిజాలు, నేర్చుకోవల్సిన పాఠాలు - గుణపాఠాలు మిగిలాయి. ఇందులో ఎవరేపాత్ర పోషించారన్నదీ సమాజానికి తెలియాలి. ఈ ప్రయత్నం చేద్దాం.

**అసలేం జరిగింది?**

అన్నిటికంటే కీలకమైంది అధికారపార్టీ ఈ ఎన్నికల్లోకి దుర్మార్గంగా జొరబడ్డం. రాజకీయమయం చెయ్యడం. టీచర్ల ఎన్నికల్ని ఏమొహ మాటం లేకుండా సకల కాలుష్యాల సంగమంగా మార్చడం. గతంలోనూ ఈ ధోరణులున్నా ఇంత బరితెగింపును మనమెప్పుడూ ఎరగం.

ఎందుకిలా జరిగింది? ఇప్పటి రాజకీయాలే ఇంత. అవి ఏ వర్గాన్నీ వదిలిపెట్టవు. ఏ రంగాన్నీ స్వతంత్రంగా బతకనీవు. ప్రతిదీ తమ పరిష్వంగంలోకి వచ్చి తీరాలి. ప్రతిదాన్నీ తాము శాసించి తీరాలి. వాడికో ఉనికి, గుర్తింపు, విలువలూ ఇలాంటివేవీ వుండకూడదు. ఇంతటి ఏకశిలా సదృశ ఆధిపత్య రాజకీయాలు ప్రస్తుతం నడుస్తున్నవి.

ఈ నేపథ్యంలోనే 'తెలుగుదేశం' టీచర్లలోనూ తమస్థానం తమకుండి తీరాలని నిర్ణయించుకొంది. విద్యారంగంపైనా, ఉపాధ్యాయ ఉద్యమాల పైనా తమపట్టు తాను బిగించాలని పూనుకొంది. ఇప్పటి దాకా టీచర్లు వాళ్ళ ఉద్యమాలకు మొదట నిబద్ధులు. బయట ఎన్ని రాజకీయాలున్నా సంఘాల దగ్గర రాజీపడే వాళ్ళుగాదు. తమ వ్యక్తిత్వాన్ని, ప్రయోజనాల్ని తమ ఉద్యమాల్లో వాళ్ళు ప్రదర్శించుకోనే వారు. వాటిని ప్రాణప్రదంగా కాపాడుకొనేవారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇదే చైతన్యం వాళ్ళని నడిపించేది. 'మీ ఎన్నికలప్పుడు మేము మీ వాళ్ళం కావచ్చు. ఇవి మా ఎన్నికలు. మా దగ్గరకు రాకండి" అని నయానా భయానా కూడా తెగేసి చెప్పేవాళ్ళు. ఇప్పుడూ చెప్తున్నారు. ఈ ఒరవడిని నీరుగార్చాలని నిరంతరం యత్నించే శక్తులు కూడా కొన్ని తమలోనే వున్నా టీచర్ల సమిష్టి లక్షణం మాత్రం స్వతంత్ర పంథాగానే వుండేది. మొన్న మొన్నటి దాకా ప్రధాన ఉపాధ్యాయసంఘాలు సైతం దీన్ని జీవలక్షణంగా భావించాయి. తెలుగుదేశం ఈ లక్షణాన్ని నిర్మూలించాలని నిర్ణయించు కొంది. తెగించి రంగంలోకి దిగింది.

**ఏం చేశారు? ఏం సాధించారు?**

ఇలా దిగాక ఇక ఏ విలువలూ, ఏ న్యాయాలూ, ఏ నియమాలూ వుండవు. వెండిగ్లాసులు ఇంటింటా మిలమిలలాడాయి. ఆరేసి పదేసి అయిదొందల నోట్ల కవర్లు ముంగిట, పూలకుండీల్లోనూ తెల్లారేసరికల్లా సాక్షాత్కరించాయి. తాయిలాలు తీసుకోని వాళ్ళ లెక్కతయారైంది. వారికి అధినాయకుల నుంచి ఫోన్లు వెళ్ళాయి. దళారుల పంటపడింది. ఎక్కడికక్కడే పంపకాలకు కొత్తకొత్త వ్యవస్థలు పుట్టుకొచ్చాయి. మన కంటిని మన వేలితోనే పొడిచేందుకు మననుంచే కొందర్ని సృష్టించారు. కొందరు పరుగెత్తుకొచ్చారు. కొందరు తాము పైకి నీతిపన్నాలు వల్లిస్తూ లోనుంచి కథ నడిపించారు. ఇక బెదిరింపులు, అనునయిం పులు, కుల సమీకరణలు, అధికార మీటింగులు, సరేసరి. దీనికోసం అధినాయకత్వం నుంచి అట్టడుగు ఛోటా నాయకత్వందాకా రంగంలోకి దిగింది. పవిత్రమైన పాఠశాలల్లోకే దూరి సగటు టీచరుపై చెయ్యాల్సిన దాష్టీకాలన్నీ చేశారు. ఇంత చేసినా ఒకచోట హమ్మయ్య! గెలిపించుకొన్నాం' అన్పిం చుకున్నారు. మరొక చోట "డామిట్ కథ అడ్డం తిరిగిం దంటూ" గిరీశంలా గింగిరాలు తిరిగారు.

విచిత్రమేమంటే వీరంతా మైకు దొరికితేచాలు "గురుబ్రహ్మ గురుర్విష్ణుః" అంటూ వల్లించేవారే! తమ చిన్ననాటి గురువుల వల్లే ఇంత వారమయ్యామని అడపాదడపా శాలువాలు గప్పి పాదాభివందనాలు చేస్తున్నవారే. విద్యారంగం తమకు ప్రాణప్రదమని, ఉపాధ్యాయులు జాతినిర్మాతలని ప్రవచిస్తున్నవారే. ఉన్నట్లుండి తమ రాజకీయ పెత్తనం ముందుకొచ్చేప్పటికి ఇవన్నీ దూదిపింజల్లా ఎగిరిపోయాయి. జొల్లు మాటలుగా తేలిపొయ్యాయి. ముసుగు విసిరి పారేసి కోట్లాది సొమ్ము కుమ్మరించి టీచర్ని అంగటి సరుకుగా మార్చారు. అతని ఆత్మగౌరవాన్ని, సమాజంలో స్థానాన్ని, పిల్లల కళ్ళలో రేపటి వెలుగులు వెతుక్కొనే నిష్కళంక స్వభావాన్ని నిర్దాక్షిణ్యంగా నిలువునా పాతిపెట్టేందుకు తెగబడ్డారు. ఇప్పుడీ పాత్ర ఒక పార్టీ పోషించింది. రేపు మరో పార్టీ ఇదే అవతారమెత్తుతుంది!

**మనమేం మారాలి?**

ఇప్పటిదాకా మనం అన్ని రాజకీయ పార్టీల్లోనూ వున్నాం. సాధారణ ఎన్నికల్లో ఎవరికి తోచిన వారికి సహకరించాం. మన ఉద్యమాల్ని లక్ష్మణరేఖతో కాపాడుకొంటూ వచ్చాం. అమెరికా అధ్యక్షుడిలా 'మాకు మిత్రులు, శత్రువులు తప్ప తటస్థులెవ్వరూ వుండరని మొదటిసారి పాలకపార్టీ ప్రకటించింది. "ద్వంద్వ ప్రమాణాల్ని" సహించమని హెచ్చరించింది. 'మా వాళ్ళెవ్వరో మా బరిలోకి వచ్చి నిలబడి హాజరు వెయ్యించుకోండి. హాజరు తప్పితే శిక్షలు తప్పవని" బెత్తం ఝళిపిం చింది. ఇప్పుడిక తేల్చుకోవల్సింది మనం! అపోహల్ని తొలగించు కొని, అమాయకత్వాన్ని వదిలించుకొని 'అవును మా హక్కులు మాకు ముఖ్యం. మా స్కూళ్ళూ పిల్లలూ మాకు ముఖ్యం. మా ఉద్యమాలు మాకు ముఖ్యం. మీ రాజకీయాలు మీవైతే ఇవన్నీ మా రాజకీయాలు" అని తెగేసి ప్రకటించగల్గడం ఇప్పుడు మనం నేర్చుకోవల్సి వుంది.

**వీరోచితంగా పోరాడాం :**

ఈ ప్రతిక్రియా ఈ ఎన్నికల్లో స్పష్టంగానే వ్యక్తమైంది. ఎంతగా వ్యక్తమైందంటే ఒకచోట ముప్పై కోట్లు కుమ్మరించినా, ఎక్కడికక్కడ ఎన్ని మోహరింపులు జరిగినా, ఎన్ని ఒత్తిళ్ళు తెచ్చినా పాలకపార్టీ విప్‌గారే చిత్తయ్యారు. మరొకచోట అష్టమంత్రులూ రోజుల తరబడి ఆపసోపాలు పడితే తప్ప బయట పడలేకపోయారు. సూర్యారావు మాష్టారి విజయం సమాజం మొత్తాన్నే ఉలిక్కిపడేలా చేసింది. ఇటీవలి ఎన్నికల చరిత్రలో ఇంత బక్కప్రాణి మహాపర్వతంలాంటి కార్పోరేట్

కుబేరుణ్ణి మట్టిగరిపించడం ఇదే మొదటిసారి. తెలుగుదేశం సైతం తాము తప్పు చేశామని ఒప్పుకోక తప్పనిస్థితి వచ్చింది.

ఇక ఏ సంఘం ఎంత తోడొస్తే అంత తోడుపెట్టుకొని కలుపుకోగల్గిన వాళ్ళనందర్నీ కలుపుకొంటూ, సగటు టీచరు చైతన్యాన్ని పెంచుకొంటూ ప్రధానంగా యుటియఫ్, అక్కడక్కడా కలిసొచ్చిన శక్తులూ చేసిన పోరాటం మాత్రం అద్భుతం అమోఘం. సెలవులు పెట్టడం, జేబులు చిల్లు చేసుకోడమేగాదు ఎన్ని ఒత్తిళ్ళొచ్చినా ప్రతిఘటించడం ఎక్కడిక్కడ సంఘటితమై సైన్యంలా దాదాపు అయిదారు నెలలు ఈ మహా యుద్ధాన్ని నడిపించడం 'సభూతో' అన్పించింది. వీరి నిబద్ధతే, వీరి సమరశీలతే భవిష్యత్ ఉపాధ్యాయ ఉద్యమ బావుటాలు. ఇక సాధారణ టీచరు నిలబడిన తీరు, బాధపడ్డ తీరు రెండూ మనం మనంగా వున్నామన్న భరోసానిచ్చాయి.

మన అభ్యర్థులిద్దరూ ఒక్క రూపాయ కూడా జేబునుంచి పెట్టలేదు. పెట్టగల స్తోమతా వారికిలేవు. సూర్యారావు వంటి వారిని మనంగాక మరెవ్వరు పోటీలోకి దించగలరు? ఎనిమిదేళ్ళు పదవిలో వున్నా ఎవ్వరూ వేలెత్తి చూపలేనట్టు లక్ష్మణరావుతప్ప మరెవ్వరుండగలరు? రాజకీయంగా ఎంత దాడిచేసినా లోలోపలయినా ఇలా చెయ్యాల్సింది గాదని మహా మహా మంత్రులే అనుకోక తప్పని పరిస్థితిని లక్ష్మణరావు కల్పించగలిగాడా లేదా? ఇప్పుడాయన ఓడినందుకు ఎందరికి ఆనందంగా వుంది? ఎవరికి ఆనందంగా వుంది? ఇలా చూస్తే ఇంత కంటే గెలుపు ఏముంటుంది? అసలిప్పుడు ప్రలోభాలకు లోను కావద్దనీ, రాజకీయాల్ని మన రంగంలోకి రానివ్వవద్దనీ, ఉపాధ్యాయుడి స్థాయి ఏమాత్రం తగ్గరాదనీ ఇంతటి ఎన్నికల్లోనూ టీచరు చైతన్యాన్ని అడుగడుగునా పెంచిందెవరు? సగటు టీచరు బలహీనతల్నిగాదు, చైతన్యాన్ని, నిజాయితీని నమ్ముకొని ఎన్నికలు నడిపిందెవరు? ఎన్నికలంటే పదవులూ కిరీటాలూ కాదని ఎన్నికల్నీ ఉద్యమంలో భాగంగా మార్చి ఆసాంతం ఎక్కడా తడబడకుండా నిలబడిందెవరు?

**ఎలా జరిగివుంటే బావుండేది?**

ఈ ఎన్నికల్లో కొట్టొచ్చినట్టు వినబడ్డ వాదం పాలక పార్టీనే అన్నీ వార్చివడ్డిస్తుందని. దాంతో మంచిగా వుంటేసరి పోతుందని. సంఘాలు చెయ్యాల్సింది ఈ దౌత్యం మాత్రమేనని. ఇది వాస్తవమా? చరిత్రనింత దారుణంగా వక్రీకరించడం ధర్మమా? ప్రభుత్వ పాలసీలు అంత ప్రజానుకూలంగా వున్నాయా? మనకు మనంగా నిలబడి పోరాడి ఒత్తిడి చేస్తేగదా ఈ స్థితికి మనం వచ్చింది?

కాకుంటే ఈ పోరులో మరింతమంది కలిసొచ్చివుంటే బావుండేది. సూర్యారావులూ, లక్ష్మణరావులూ మరికొంతమంది బరిలో దిగి అలాంటి వారి మధ్యనే పోటీ జరిగివుంటే ఇంకా బావుండేది. 'టీచర్లు అందరిలాంటి వారుగాదు వాళ్ళ ఎన్నికల్లో మనం వేలు పెట్టకూడద'ని ప్రధాన సంఘాలైనా పార్టీలకు పాఠం చెప్పగల్గితే మరీ బావుండేది. క్రమంగా సంఘాల బ్యానర్లు మాత్రం మిగిలి, అభ్యర్థుల మద్దతుదార్ల లెక్కకు మాత్రం పనికొచ్చి కింది కార్యకర్తలూ, అభిమానులూ ఎవరిదారి వారు చూచుకొనే స్థితినుంచి తప్పించుకోగల్గివుంటే ఇంకా బావుండేది. చూస్తూ చూస్తూ వుండగానే చివరి పదిరోజులూ యుటియఫ్, తెలుగు దేశంల మధ్య పోటీగా మారి మధ్యలో అందరూ అదృశ్యంగాకుంటే ఎంతో బావుండేది.

అసలీ టీచర్ల ఎన్నికల్లోకి కార్పొరేట్ విద్యాధిపతులే ఎందు కొస్తున్నారు? మొత్తం విద్యారంగాన్నే కబళించడానికా? తాము పిల్లల నుండి విచ్చలవిడిగా దోచుకొన్న సొమ్మును ఇక్కడే వెదజల్లి విజయదర్పం ప్రదర్శించడానికా? ప్రభుత్వ టీచర్ల చేతనే తమ విధానాన్ని, విలువల్ని దోపిడీని ఆమోదముద్ర వేయించుకొనేందుకా? ఈ చర్చ ఇంకా లోతుగా సాగాల్సింది.

దురదృష్టవశాత్తు ఈ ఎన్నికల్లో విద్యారంగంలో వస్తున్న మార్పుల పట్ల, వీటి వెనకగల విధానాలపట్ల, తోసుకొస్తున్న ప్రమాదాలపట్ల జరగాల్సినంత చర్చజరగలేదు. నైతికతకూ, ఆత్మ గౌరవానికీ యిచ్చిన ప్రాధాన్యతను మనము పాలసీలకివ్వలేకపోయాము. అసలు సమస్య మనరంగం ఊబిలోకి దిగిపోడం. దీన్ని పనిగట్టుకొని ఛిన్నాభిన్నం చెయ్యడం. కార్పొరేట్లకప్పచెప్పడం. దీనిచుట్టూ ఈ ఎన్నికలు జరగాల్సింది. జరగలేదు.

ఏదిఏమైనా మనం టీచర్లం. రోజూ తరగతి గదిలో నీతి పాఠాలు చెప్పాల్సిన వాళ్ళం. మనల్ని కూడా కొనాలనుకోవడం ఎంత దుర్మార్గం? మనమూ అమ్ముడుపోతామన్పించడం ఎంత విషాదం? పంపకాలు చేసినవారికి పదవులా? మనకు మాత్రం నిందలా? సమాజం మనల్ని దూరంగా నెట్టేశాక ఇక ఏ ఉద్యమాలు మాత్రం మనల్ని కాపాడుతాయి? ఇలా మనల్ని పలచబరిచి, సమాజంలో నిరాదరణకు గురిచేసి, ఒంటరి చేసి విలవిలాడించాలన్నదేగదూ పాలకుల పన్నాగం! దీన్ని మనమెందుకు పసిగట్టలేకపోతున్నాం. ఇంత పేలవంగా ఎందుకు మారిపోతున్నాం?

**మన భవిష్యత్తు :**

మనకేమీ ఈ ఎన్నికలు సర్వస్వంగాదు. ఎమ్మెల్సీలతో అన్నీ వచ్చి ఒళ్ళో వాలిపోనూపోవు. ఎన్నికలు మన ఉద్యమంలో ఓ భాగం. ఎమ్మెల్సీలు మన ఉద్యమానికి తోడుగా వుంటారు అంతే. కనీసం పెద్ద మనుషులుగా వున్నాచాలు. అంతకంటే మనకేమీ ఆశల్లేవు, భ్రమల్లేవు.

దీన్నుంచి మనం నేర్చుకోవాల్సిన పాఠాలేమిటి? గుణపాఠా లేమిటి? ఒకటి మన ఉద్యమ నిర్మాణాన్ని, సమరశీలతని, పోరాటాల్ని మరింత పదునెక్కించడం. రెండవది మన స్కూళ్ళనీ, పిల్లల్నీ కాపాడుకొంటూ సమాజానికి సన్నిహితంకావడం. మూడవది మన విలువల్ని, ఆత్మగౌరవాన్నీ కాపాడుకొనే ఒక వికాసోద్యమం నడిపించడం. నాల్గవది వీలున్నంతమందిని కలుపుకోవడం, తోడొచ్చేవారిని పెంచుకోడం. కొంచెం కష్టంగా వుండొచ్చు. కానీ ఇంతకంటే దగ్గరిదారేదీ మనముందు లేదు.

## ముఖ్యగమనిక

**ఐక్యఉపాధ్యాయ** పత్రిక విజయవాడ కేంద్రంగా నడుప బడుతుంది. పత్రికకి పంపే వ్యాసాలు, ఉద్యమ వార్తలు, కథలు-కవితలు-గేయాలు, ప్రశ్నలు అన్ని రకాల వార్తలు **ఎడిటర్ ఐక్యఉపాధ్యాయ, యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ- 520002** అడ్రసుకు పంపాలి, లేదా
**E-Mails : ikyopadhyaya@gmail.com;**
**aputf2000@yahoo.com**కి పంపాలి.

పత్రిక చందాలుకూడ విజయవాడకి పంపవలెను. జనవరి నుండి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలి. పత్రికల సంఖ్య పెంచాలి. ప్రతి పాఠశాలకు పత్రిక వెళ్ళేలా చూడాలి. అడ్వర్‌టైజ్ మెంట్‌లు సేకరించి పంపాలి.

# విద్యను విస్మరించిన బడ్జెట్



**పి.బాబురెడ్డి**
రాష్ట్ర ప్రధానకార్యదర్శి

2015-16 ఆర్థిక సంవత్సరానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన వార్షిక బడ్జెట్‌లలో విద్యారంగం విస్మరించబడింది. విద్యకి ప్రాధాన్యత యిస్తున్నట్లే చెప్పు కుంటున్న పాలకులు బడ్జెట్ కేటాయింపులను భారీగా తగ్గించారు. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మొత్తం రూ.17,77,477 కోట్లు బడ్జెట్‌ను ప్రతిపాదించారు. అందులో విద్యారంగానికి కేటాయించింది రూ.69,074 కోట్లు అంటే మొత్తం బడ్జెట్‌లో 3.88% మాత్రమే. కేంద్ర బడ్జెట్‌లో విద్యకి 10% కేటాయించాలనే ఖేర్ కమిటీ సిఫారసులకు అందనంత దూరంలో ఈసారి కేటాయింపు వున్నది. గతేడాది రివైజ్డ్ ఎస్టిమేట్స్‌తో పోల్చిచూస్తే 17% తగ్గిపోయింది. కాగా విద్యాబడ్జెట్‌లో పాఠశాల విద్యకి రూ.42,219 కోట్లు, ఉన్నత విద్యకి రూ.26,855 కోట్లు చూపబడినవి. 2014-15 కేటాయింపులతో పోల్చిచూస్తే పాఠశాల విద్యకి బాగా తగ్గిపోయి ఉన్నత విద్యకి కొద్దిగా పెరిగింది. పాఠశాల విద్యకి దక్కిన నిధుల నుండి ఆర్‌టిఇ, ఆర్‌ఎంఎస్‌ఏ, మధ్యాహ్న భోజనం, మోడల్ స్కూల్స్, కంప్యూటర్ విద్య మొ॥ అన్ని అవసరాలు తీర్చుకోవాలి. ఒక్క ఆర్‌టిఇ అమలుకే యేడాదికి రూ.40వేల కోట్లు ఖర్చు చేయాలనే లక్ష్యం కాగితాలకే పరిమితమై పోయింది.

ఉన్నత విద్యారంగాభివృద్ధికి కొత్తగా కొన్ని ఐఐటి, ఐఐఎం సంస్థల ప్రతిపాదన, కొన్నింటి స్థాయిని పెంచటం వంటివి బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రధానమంత్రి “విద్యాలక్ష్మి కార్యక్రమం” ద్వారా స్కాలర్ షిప్‌లు అందించి ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కాని పునాదిరంగమైన పాఠశాల విద్యను చిన్న చూపు చూశారు. అదేమని అందరూ అడుగుతారనో ఏమోగాని బడ్జెట్ ప్రసంగంలోనే అరుణ్‌జైట్లీ వివరణ ఇచ్చారు. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం పన్నుల్లో 42% వాటా రాష్ట్రాలకు దక్కుతుందనీ, దానితో లభించే నిధులతో రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావసరాలు తీర్చు కోవాలని సలహా యిచ్చారు. ఆ విధంగా కేంద్రం విద్యారంగం బాధ్యత నుండి తప్పుకోవటానికి మార్గం సుగమం చేసుకున్నది.

2015-16 సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ మొత్తం రూ.1,13,049 కోట్లు అందులో విద్యారంగానికి రూ.18.596 కోట్లు కేటాయించింది. భారీ బడ్జెట్‌గా ప్రభుత్వం చెప్పిన గతయేడాది బడ్జెట్‌కంటే పెరిగింది స్వల్పమే. అది కూడ ఉన్నత విద్యలోనే. అరకొర నిధులతో పాఠశాల విద్య మరింత దిగజారే ప్రమాదం ఉంది. ఆర్‌ఎంఎస్‌ఏ పథకానికి గత సంవత్సరం 834.38 లక్షలు కేటాయించగా ఈ సంవత్సరం కేవలం 460.66 లక్షలు మాత్రమే ఇచ్చారు. పౌష్టికాహార భోజన పథకంలో గత సంవత్సరం 65 కోట్లు కేటాయించారు. ఈ సంవత్సరం 10 కోట్లు, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కేటాయింపు లేదు. మోడల్ స్కూల్స్ నిర్వహణ బాధ్యత నుండి కేంద్రం తప్పుకున్న పరిస్థితుల్లో రాష్ట్రం నుండి కేటాయింపులు లేకపోవడంవల్ల అవి మూతపడే పరిస్థితి ఏర్పడింది.

ఉన్నత విద్యారంగానికి కొంతమేరకు నిధులు పెరిగినప్పటికి ఇంటర్ విద్యకు గత సంవత్సరం 812 కోట్లు కేటాయించగా ఈ సంవత్సరం 585 కోట్లు మాత్రమే ఇచ్చారు. ప్రాథమిక విద్యారంగానికి కేటాయింపులు తగ్గడంతో ప్రాథమిక విద్య ఇంకా సంక్షోభంలోకి నెట్ట బడుతోంది. మరోవైపు క్లస్టర్ పాఠశాలల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తూ ఈ ప్రాథమిక పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తున్నట్లు కనబడుతోంది.

ఓబిబి పథకం కొరకు గత సంవత్సరం 5.98 లక్షలు కేటాయించగా ఈ సంవత్సరం 5.79 లక్షలకి తగ్గించారు. విద్యా పరిశోధన శిక్షణకు గత సంవత్సరం 3.21 లక్షల నుండి ఈ సంవత్సరం 2.56 లక్షలకి పరిమితం చేశారు. వ్యాయామ విద్య కళాశాలలకు గత సంవత్సరం 1.40 లక్షలు కేటాయించగా ఈ సంవత్సరం కేవలం 55 లక్షలకే కుదించారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ గతేడాది సవరించిన అంచనాల మేరకు రూ.1068 కోట్లు వెచ్చించి ఇప్పటికి రూ.311 కోట్లు కేటాయించారు. ఏ విభాగం చూచినా బడ్జెట్ కేటాయింపుల్లో భారీగా కోతలు పడ్డాయి.

అరకొర నిధులు కేటాయించి, ఇప్పటికే బలహీనపడుతున్న ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత క్షీణ దశకి నెడుతున్నారు. 2019 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను భారత దేశంలో మూడు రాష్ట్రాలలో ఒకటిగా తెస్తాం, 2024 నాటికి భారత దేశంలో మొదటి స్థానానికి తెస్తాం అని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. బడ్జెట్ కేటాయింపులు లేకుండా ఎలా సాధించ గలరో పాలకులే సెలవివ్వాలి. ☯

---

**కవితలు**

## వేగుచుక్క అప్పారి

– కుప్పిలి కామేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా

జోహారు జోహారు – జోహారు అప్పారి
అమరజీవి అప్పారికి – జోహార్లు అర్పిద్దాం
చిరునవ్వుల చిరంజీవి – చిద్విలాస చిరుద్యోగి
॥2॥ జోహారు

బతకలేని బడిపంతులు – బతుకుబాట పోరులోనే
బాగుపడును అని తలచి – ఊరుఊరు తిరిగినారు
ఉప్పెనలై కదిలినారు – ఐక్యఉపాధ్యాయ, సంఘం స్థాపించినారు
॥2॥ జోహారు

అధ్యయనమే ఆలోచన – అధ్యాపనమే లక్ష్యం
సామాజిక స్పృహయే – ధ్యేయంగా నడిచినారు
మక్కులకై కలబడుతూ – బాధ్యతలకై నిలిచినారు
॥2॥ జోహారు

మునుముందుకు కదిలినారు – ముందుతరం దూతలై
మన మదిలో నిలిచినారు – వెలుగులు ప్రసరించే
వేగుచుక్కయై నిలిచి – అతనాశయమిడవద్దు
యుటియఫ్ మరవొద్దు – ఐక్యఉపాధ్యాయ
రథ సారథులారా! “జీ.ఓ”లు జీతాలే
అతి ముఖ్యం కాదురా? జనం కొరకు నిలబడు
జాతి కొరకు కలబడు

# పశ్చిమ బెంగాల్‌లో ఉపాధ్యాయులపై దాడులు ఆపాలి!

## సంఘీభావ ర్యాలీ, సదస్సులు నిర్వహించండి-UTF

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ పరిపాలనలో ఉపాధ్యాయులు, ఉద్యోగులపైన దాడులు, దౌర్జన్యాలు నిరంతరం కొనసాగుతున్నాయి. పాలక తృణమూల్ కాంగ్రేస్ పార్టీ గూండాల అరాచకం, ఆగడాలు యధేచ్ఛగాజరుగుతున్నాయి. పాఠశాలలను ఆక్రమించుకుని టీఎంసి ఆఫీసులుగా వినియోగించుకుంటున్నారు. ఉపాధ్యాయులను బెదిరించి లొంగదీసు కుంటున్నారు. ఎదురు తిరిగిన వారిని హింసిస్తున్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్నారు. మహిళా టీచర్లపైన అత్యాచారాలు చేస్తున్నారు. ఇళ్లపై దాడులు చేసి కుటుంబ సభ్యులనూ వేధిస్తున్నారు. వందలాది కుటుంబాలు పారిపోయి ఎక్కడో తలదాచుకుంటున్నాయి. కొంత మంది ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల కార్యకర్తల ఆచూకి దొరకటం లేదు.

ప్రభుత్వ ప్రాయోజిత జోక్యం, అరాచకత్వంతో బెంగాల్ విద్యారంగం భయోత్పాతంతో వణికిపోతోంది. విశ్వవిద్యాలయాల్లో వైస్‌ఛాన్స్‌లర్లను తొలగించి తమకు యిష్టమైన వారిని నియమిస్తున్నారు. ఉపాధ్యాయ నియామకాలు నిలిపివేశారు. వేలాది పోస్టులు ఖాళీగా వుండటంతో విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతోంది. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కి అవకాశం కల్పించారు. విద్యా బోధనలో పాలక పార్టీ నాయకులనే ప్రతినిధులుగా నియమించారు. విద్యాయాల్లోని ప్రజాస్వామిక వాతావరణాన్ని చిదిమేశారు.

ఆ రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏబిటిఏ, ఏబిపిటిఏ సంఘాలను దెబ్బతీసి టిఎంసి అనుబంధ ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలను బలోపేతం చేసుకోవటమే దౌర్జన్యకాండ లక్ష్యం. విద్యారంగంలో సాగుతున్న వినాశకర చర్యలను, ఉపాధ్యాయులపై కొనసాగుతున్న దాడులను ఆపాలని విద్యావేత్తలు, సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులను మమత సర్కారు పెడచెవిన పెట్టింది. భారత పాఠశాల ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ ప్రతినిధిబృందం బెంగాల్‌లో పర్యటించి విద్యాలయాల్లో ఎకడమిక్ వాతావరణాన్ని నిలబెట్టాలని ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రశాంతంగా పని చేసేందుకు రక్షణ చర్యలు చేపట్టాలని చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పట్టించుకోలేదు. బెంగాల్ ప్రభుత్వ నిరంకుశ చర్యలతో ఉపాధ్యాయులు, ఉద్యోగుల ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదం వాటిల్లింది.

మమత సర్కారు దౌర్జన్య కాండను ఆపాలని, బెంగాల్ రాష్ట్ర ఉద్యోగ,ఉపాధ్యాయులకు దేశవ్యాప్త సంఘీభావాన్ని ప్రకటించాలని **స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ)** పిలుపునిచ్చింది. ఎస్‌టిఎఫ్‌ఐ అనుబంధ సంఘమైన **ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)** బెంగాల్‌లోని టిఎంసి ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆ రాష్ట్ర ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంఘీభావం తెలియజేస్తున్నది. **ఆయా జిల్లా, డివిజన్ కేంద్రాలలో యుటియఫ్ నిర్వహిస్తున్న ర్యాలీ, సదస్సులలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.**

## మస్తాన్‌బాబుకు నివాళి



ప్రపంచంలో దుర్భేద్య శిఖరాల మెడలు వంచిన ధీరుడు, సాహసమే ఊపిరిగా ఏడు ఖండాల్లోకి ఏడు ఎత్తైన పర్వతాలను పాదాక్రాంతం చేసుకొన్న సాహసి, ఎవరెస్ట్ ఎక్కిన తొలి తెలుగుబిడ్డ, మల్లి మస్తాన్‌బాబు (42) ఆండీస్ పర్వత శ్రేణుల్లో అమరుడయ్యాడు. నెల్లూరు జిల్లా సంగం (మం) గాంధీజన సంఘం గ్రామానికి చెందిన మస్తాన్‌బాబు ఐఐటి, ఐఐఎం ఉన్నత చదువులు చదివాడు. ఉజ్వల భవిష్యత్‌ను, ఉన్నత ఉద్యోగాన్ని ఆశయసాధన కోసం వదిలేశాడు. తన సాహసాల ద్వారా ఆంధ్రకీర్తిని నలుదిశలా వ్యాప్తిచెందించాడు. దేశం గర్వించదగ్గ పర్వతారోహకుడు మస్తాన్‌బాబుకు ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) సంతాపం తెలుపుతున్నది.

## "మేడే" దినోత్సవం జరపండి



అంతర్జాతీయ కార్మిక దినోత్సవం "మేడే"ను తాలూకా, డివిజన్, జిల్లా కేంద్రాలలో అన్ని కార్యాలయాలలో పతాకా విష్కరణలు, సభలు, ర్యాలీలు నిర్వహించవలసినదిగా రాష్ట్ర కమిటీ పిలుపునిస్తున్నది. కార్మిక చట్టాల సవరణతో ప్రజాస్వామిక హక్కులమీద జరుగుతున్న దాడిని చర్చించాలని కోరుతున్నది.

(4వ పేజీ తరువాయి)

## సూర్యారావు మాస్టారు చెప్పిన పాఠం!

రావువంటి వారు అరుదుగా కనిపిస్తున్నారు. ఫలితమే సమాజంలో విలువల పతనం. ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉంటే సమాజం కూడా ఆదర్శంగా ఉంటుంది. పాఠశాలల తరగతి గదులే భావి సమాజానికి దిశా నిర్దేశం చేస్తాయి. మొత్తం మీద సమాజం ఎటుపోతున్నదో, ఏమైపోతున్నదో అని ఆక్రోశించేవారికి సూర్యారావు గెలుపు మాత్రం ఊరట కలిగించే అంశమే! ఉపాధ్యాయులలో వచ్చిన ఈ మార్పు మధ్య తరగతి, పేద వర్గాల ప్రజలలో కూడా వస్తే రాజకీయ వ్యవస్థ బాగుపడుతుంది. సేవాభావం ఉన్న వారికే టికెట్ ఇచ్చే అవకాశం రాజకీయ పార్టీలకు లభిస్తుంది. ధనప్రభావం రాజకీయాలలో పోవాలంటే ఉభయ గోదావరి జిల్లాల టీచర్లలోవలె అన్నివర్గాల ప్రజల ఆలోచనా విధానంలో మార్పురావాలనీ, వస్తుందనీ ఆశిద్దాం.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి

# సామాజిక న్యాయానికి ప్రజాతంత్ర ఉద్యమాలే మార్గం



ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారతీయ హిందూ సమాజంలో మాత్రమే శతాబ్దాలుగా కొనసాగుతూ మానవ వికాసానికి, సామాజికాభివృద్ధికి ఆటంకంగా వున్న కులవ్యవస్థ నిర్మూలన కోసం అంబేద్కర్ తన జీవితపర్యంతం పోరాడాడు. ఇందుకోసం జాతీయోద్యమంలో మరియు రాజకీయశక్తులతో దాదాపు ఒంటరిగా అభిమన్యుడిలాగా యుద్ధం చేశాడు. సహజంగానే కొందరికి వివాదాస్పదుడుగాను, కొందరికి పూజ్యనీయుడుగాను అయ్యాడు.

అంబేద్కర్ నిర్మూలించ తలపెట్టిన కుల మహావటవృక్షం కూల్చి వేయబడలేదు. నేటికీ అనేకరూపాలల్లో మనిషికి మనిషికి మధ్య అడ్డుగోడగా, రాజకీయాలకు, దోపిడీకి సాధనంగా కొనసాగుతోంది. దీని వేళ్ళు భారతీయసమాజంలో అన్ని మూలలకు రక్తంలోకి, మస్తిష్కంలోకి, చూపులోకి, దృక్పథంలోకి విస్తరించి వున్నాయి. జనం సమీకరింపడకుండా, సంఘటితం కాకుండా తనకు తాను హద్దులలో నడుచుకొనేటట్లు కులవ్యవస్థ లోపలనుంచే నియంత్రిస్తుంది. ఘనీభవించిన కులాలతో నడిచిన స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థను దాటి సమాజం ఎంతో దూరం ప్రయాణించి ఆధునిక జీవితం గడుపుతున్నా ఇప్పటికీ "నువ్వేవరు?" అనే ప్రశ్నకు నేను భారతీయుడిని లేదా తెలుగువాడిని అనే జవాబు అర్థం లేనిది. కులం పేరు చెప్పేదాకా (ఏ కొద్దిమందినో మినహాయిస్తే) భారతీయ సగటు మనిషి ప్రశ్నల పరంపర ఆపడు. ఎంత చదువుకున్నా, ఉన్నత స్థానంలో వున్నా ఒక వ్యక్తి అస్థిత్వం కులం ద్వారా గుర్తించే దుర్మతి ఇంకా కొనసాగుతోంది. మనుషుల్ని ఒక సాంస్కృతిక సమూహంగా చూడకుండా ముక్కలు ముక్కలుగా చూసే భావజాలం అంటు వ్యాధిలాగా భారతీయ ఆలోచన స్రవంతిలో వ్యాప్తి చెందిఉంది. అంబేద్కర్ "ఒకేజాతిలోని ప్రజలను కులవ్యవస్థ సాంఘీకంగా విభజిస్తున్నది. హిందువుల్లో వున్న చైతన్యం ఒక్కటే. అది కుల చైతన్యం. జాతి చైతన్యం అనేది లేదు. హిందువులు కొన్ని కులాలు మాత్రమే కాదు ఏ కులానికి ఆ కులం తమ స్వంత ప్రయోజనాలు రక్షించుకోవడం కోసం తక్కిన కులాలతో నిరంతరం పోరాటం సలిపే విడివిడి గుంపులు" అంటాడు తన Annihilation of Caste గ్రంథంలో. అభ్యుదయ ఉద్యమాలు ఈ ధోరణికి మినహాయింపు కావచ్చు కానీ ఇదొక సామాజిక వాస్తవంగా కొనసాగుతోంది. "ఎవ్వరైనా హిందు మతంలో చేరదలిస్తే అతని స్థానమెక్కడ? ఏ కులంలో చేర్చుకోవడం? హిందుమతం విస్తరణకు అవకాశం లేకపోవడానికి కారణం కులవ్యవస్థే. ఏ కులంలో పుట్టినవాడు ఆ కులంలోనే బ్రతికి చావాల్సిందే. మన సామాజిక వ్యవస్థ కిటికీలు మాత్రమే ఉండి ద్వారాలు లేని బహుళ అంతస్తుల భవనం" అంటాడు అంబేద్కర్.



సిహెచ్.శ్రీహరి
ఐక్యఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు



**అంబేద్కర్ జీవితం - పోరాటం :** అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న ఇండోర్‌కు దగ్గరగావున్న చిన్న పట్టణంలో రాంజీ – భీమాబాయిలకు 14వ సంతానంగా జన్మించాడు. రెండవ యేటనే తల్లి మరణించింది. అదే సంవత్సరం ఆర్మి నుండి తండ్రి రిటైర్డ్ అయ్యాడు. కబీర్, తుకారాంల భక్తి ఉద్యమ ప్రభావం ఆ కుటుంబంపై వుండేది. దీంతోపాటు రాంజీ తన పిల్లలకు హిందూ పురాణాలు కూడా చెప్పేవాడు. రామాయణ, భారతాల్ని బాల్యంలో అంబేద్కర్ విమర్శనాత్మకంగా చూసేవాడు. కర్ణునిచావు బాల అంబేద్కర్‌కు తీవ్రవేదన కల్గించింది.

బ్రిటీష్ ప్రభుత్వం కల్పించిన కొత్తచట్టం వల్ల సతారా పట్టణంలో సవర్ణుల స్కూల్‌కు వెళ్ళే అవకాశం అంబేద్కర్‌కు వచ్చింది. కానీ గోతాము పట్ట తెచ్చుకొని విడిగా కూర్చోవల్సి వచ్చేది. అందరూ త్రాగే మంచినీరు త్రాగనిచ్చేవారు కాదు. క్షురకులు క్రాపు చేసేవారు కాదు. స్కూల్‌లో, స్కూల్ బయట తల్లిలేని బిడ్డ తీవ్ర వివక్షతను అనుభవించాడు. మెట్రిక్యులేషన్ పూర్తిచేశాడు ఆ రోజుల్లో. మహర్ పిల్లవాడు మెట్రిక్యులేషన్ పూర్తి చేయడం ఒక అద్భుతం. బరోడారాజు స్కాలర్‌షిప్‌తో గ్రాడ్యుయేషన్, కొలంబియా యూనివర్శిటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో ఉన్నత చదువులు చదివాడు. అందరికీ అంబేద్కర్ రాజ్యాంగ రచయిత, సామాజిక ఉద్యమకారుడుగానే పరిచితం. కానీ ఆయన గొప్ప ఎకనమిస్టు. ఇప్పటికీ కూడా ఎక్కువ చదువు చదివిన భారతీయ ఎకనమిస్టు అంబేద్కరే. అర్థశాస్త్రంలో తనకు అంబేద్కర్ తండ్రిలాంటివాడు అంటాడు అమర్త్యాసేన్. 2012లో 2 కోట్లమందిపై సిఎన్ఎన్ జరిపిన సర్వేలో "గొప్ప భారతీయుడు'గా అంబేద్కర్ నిలిచాడు.

తాను అనుభవించిన వివక్షత రూపుమాపడానికై అనేక గ్రంథాలు రాశాడు. అనేక పోరాటాలలో పాల్గొన్నాడు. అనేక వేదికల మీద మాట్లాడాడు. అట్టడుగువర్గాల అభ్యున్నతికి, మహిళా సాధికారతకు ఎనలేని కృషి చేశాడు. సాంఘిక సంస్కరణ అన్నిటికంటే ముఖ్యమైనది అని, జాతీయోద్యమం దీన్ని విస్మరిస్తున్నదని ఘర్షణ పడ్డాడు. విసిగివేసారి జీవిత చరమాంకంలో మతం మార్చుకొని బౌద్ధంలో చేరాడు.

**నేటి స్థితి - పరిష్కారం :** అంబేద్కర్ నాటి పరిస్థితులు చాలా మారాయి. అట్టడుగువర్గాల వారు ప్రధాని, ప్రధాన న్యాయమూర్తులు, పాలకులుగా వచ్చారు. అయినా కానీ స్వీపర్లలో 90%మంది అట్టడుగు వర్గాలవారే. షెడ్యూల్ కుల్లాలో 71.3%మంది పదవ తరగతిలోపు డ్రాప్‌అవుట్‌లు.

మత విశ్వాసాలు మనుషుల జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయో, 'దేవుడు' అనే నమ్మకం కన్నా, దేవుని మాటలు అని చెప్పే మాటలకు విలువనిస్తుండే జీవితాలు ఎలా ఉంటాయో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత యు.ఆర్.అనంతమూర్తి కన్నడ నవల తెలుపుతుంది. 1960 ప్రాంతాల కన్నడ మధ్వబ్రాహ్మణ సమాజాన్ని నేపథ్యంగా తీసుకొని రచయిత అనేక అంశాలను చర్చకు పెట్టాడు.




అనేక కట్టుబాట్లు, ఆంక్షలు ఉండే దుర్వాసపుర అగ్రహారంలో నారాయణప్ప మరణంతో నవల మొదలవుతుంది. ఇతను మాంసాహారి, మద్యపానలోలుడు, చంద్రి అనే ఉంపుడుకత్తెతో కాపురం చేస్తున్నాడు. అగ్రహార పరువు తీసిన అతని శవదహనానికి ఎవరూ ముందుకురారు. దహనం కానిదే స్నానం, పూజ, భోజనం ఏదీ ఉండదాయెను.

కాశీలో చదివిన ప్రాణేశాచార్య ఆ అగ్రహారంలో అందరూ గౌరవించే పండితుడు. ఇతను గత 20 యేళ్ళ నుండి రోగిష్టి భార్యకు సేవలుచేస్తూ, నిష్టతో, ఆంజనేయ భక్తునిగా జీవిస్తున్నాడు. నారాయణప్ప తీరును మార్చి అగ్రహారం పరువు నిలపాలని ప్రయత్నించి, అవమానానికి గురైనాడు. అగ్రహారీకులు శవసంస్కార అంతిమ నిర్ణయం కోసం ప్రాణేశాచార్య వద్దకు వస్తారు. ఎవరి కారణాలతో వారు శవదహనానికి సిద్ధంకాని పరిస్థితి. తన వంటిపైనున్న నగలన్నిటినీ ప్రాణేశాచార్య ముందుంచి, శవసంస్కారం చేసిన వారికిమ్మంటుంది చంద్రి. దీనితో పరిస్థితి మరింత క్లిష్టమవుతుంది.

ప్రాణేశాచార్య గ్రంధాలను తిరగ వేస్తాడు. పరిష్కారం తోచదు. అగ్రహారీకులు ఆకలి బాధకు గురవుతారు. చివరికి తాను నమ్మిన ఆంజనేయస్వామి కోవెలకు వెళ్ళి, ఆయననే పరిష్కారం కోరుతాడు. ఫలితం రాదు. నిరాశగా, నిస్త్రాణగా ఇంటికి బయలుదేరతాడు. ఏదైనా సమాధానం వస్తుందని ఇతన్ని అనుసరించి వచ్చిన చంద్రి ఎదురవుతుంది. ఆయన కాళ్ళమీద పడుతుంది. ఆమెను ఆశీర్వదించబోయిన ప్రాణేశాచార్య చేతులను భక్తితో తన హృదయానికి హత్తుకుంటుంది. కట్టుబాట్లు నిలవవు. ఇద్దరూ ఒకటవుతారు. చంద్రి ఊరొదిలిపోతుంది.

నారాయణప్ప సహాయం పొందిన చేపల వ్యాపారి రహస్యంగా శవదహనం చేస్తాడు. మాయమైన శవం దయ్యమైందనే ప్రచారం మొదలవుతుంది. ప్రాణేశాచార్య భార్య చనిపోతుంది. ఊరికి ప్లేగువ్యాధి సోకుతుంది.

మనిషిమరణం, చంద్రినగలు, ప్రాణేశాచార్య విశ్వాసాలు, అగ్రహారీకుల నయవంచనలు, ఆకలి, అవసరం, ప్లేగు రోగం ఆ అగ్రహారంలోని కట్టుబాట్లను ఎలా పటాపంచలు చేశాయో, నవల చదివిన తర్వాత అనేక ప్రశ్నలతో మనసు నిండిపోతుంది. ఏకబిగిన చదవగలిగేలా ఉన్న ఈ నవలను సుజాత పట్వారి "ఇది తెలుగు నవలే" అనేట్లుగా అనువదించారు.

– **కె.సాయిప్రసాద్,** గుంటూరు జిల్లా

---

ఓ వైపున కులాలూ వున్నాయి. కులం ఉన్నవాళ్ళు లేనివాళ్ళుగా అనే రెండు వర్గాలుగా నానాటికి విడివడి పోతున్నది. కులమేదైనా ఉన్నవాళ్ళు పాలకులుగా, లేనివాళ్ళు డ్రాప్ అవుట్లు, స్వీపర్లుగా మారుతున్నారు. 90వ దశకంలో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు ఈ వర్గ విభజనను తీవ్రతరం చేశాయి. రక్షిత మార్కెట్, సహజ వనరులు, అత్యవసర సేవలు ఏవైతే 50 సం॥లుగా ప్రజల డబ్బుతో అభివృద్ధి చేసుకొన్నామో వాటిల్ని ద్రవ్యపెట్టుబడి తన దత్తపుత్రులైన కార్పోరేట్‌లకు అప్పగించడంతో సంపద కొద్దిమంది చేతుల్లో విపరీతంగా పోగుపడింది. కేవలం 100మంది చేతుల్లో పెరిగిన సంపద 1/4వ భాగం వుంది. 80-90 కోట్లమంది రోజుకు రూ 20/-లు ఆదాయంలో బ్రతుకుతున్నారు. ఈ మారిన పరిస్థితుల్లో కూడా గతంలో చాతుర్వర్ణ వ్యవస్థలో కులవ్యవస్థ ఇమిడి పోయినట్లుగా నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలో కూడా కులవ్యవస్థ ఒదిగిపోయింది. అంతకంతకు పెరిగిపోతున్న అసమానతల్ని చూడనీయకుండా కులచైతన్యపు కళ్ళగంతల్ని కడుతోంది. పెరుగుతున్న ధరలు, పడిపోతున్న జీవన ప్రమాణాలు, కొండెక్కి కూర్చొన్న విద్య, వైద్యం, ధ్వంసం అవుతున్న వృత్తులు, పెరిగిపోతున్న నిరుద్యోగం.... ఇవన్నీ అందరి సమస్యలైనా ఎవరికి వారిని "విడివిడి గుంపులుగా" కులవ్యవస్థ ఉంచగలుగుతోంది.

కులప్రాతిపదికగా వున్న ఫలానా కులంవాడు ఫలానాపనే చేయాలనే శ్రమవిభజన నేడు లేదు. ఈ పునాది పోయినా కులం మిగిలివుంది. దీనికి మూడు కారణాలు (1) ఆర్థికంగా మెరుగ్గా వున్న కులాల్లో వ్యక్తులు కుల ప్రాతిపదికగా అధికార పదవుల వాటా కోసం కులాన్ని పెంచి పోషిస్తున్నారు. (2) అట్టడుగు వర్గాల వాళ్ళు రిజర్వేషన్ల ద్వారా ఒక స్థాయి, ప్రతిష్ట గల మంచి ఉద్యోగాలు పొందేందుకు కులం వుండాలనుకొంటున్నారు. (3) రాజకీయ పార్టీలు కుల సమీకరణ ద్వారా ఓట్ల పబ్బం గడుపుకోనేందుకు కులాన్ని కూడగడుతున్నాయి. అందరూ కులం ఉండాలనుకొంటే మరి అంబేద్కర్ కలలుగన్న "కుల నిర్మూలన" ఎలా సాధ్యం?

కులంలోని ప్రజల మధ్య ధనిక, పేద ఆధునిక వర్గాలు ఏర్పడ్డాయి. మొత్తంగా చూస్తే వర్గాల మధ్య కులం వుంది. కులంలో వర్గాలూ వున్నాయి. ఈ వైరుధ్యం పీడితుల్ని చైతన్యపరచి ఉమ్మడి పోరాటాల వైపు మళ్ళించడం ద్వారా పరిష్కరించబడడం ఒకటి. రెండోది భారత చరిత్రలో జాతీయోద్యమమే కాదు అభ్యుదయ శక్తులూ అంబేద్కర్ గొంతెత్తి నినదించిన "సాంఘీక సంస్కరణ" పట్ల ఉదాసీనత చూపాయి. దశా పరివర్తనలో సాంస్కృతిక పునరుజ్జీవనం కీలక భూమిక. అది భారత్‌లో జరగలేదు. ప్రజాతంత్ర ఉద్యమాలు ఈ పని చేయాలి. అప్పుడే కుల నిర్మూలన సాధ్యమౌతుంది.




ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ....

# అవయవదానం జీవనదానం



మృత్యువుతో అంతమౌతాడనుకున్న మనిషి ఆధునిక వైద్య పరిజ్ఞానంతో మరొకరిలో చిగురిస్తున్నాడు. ఒకరికి కంటిచూపు అవుతున్నాడు, మరొకరికి గుండెచప్పుడు అవుతున్నాడు, ఇంకొకరికి ఊపిరి అవుతున్నాడు. మరణానికి చేరువైన వ్యక్తినుండి అవయవాలు, కణజాలాలను సేకరించి 34మందికి దానం చేసే అవకాశం వుందని డాక్టర్లు నిరూపిస్తున్నారు. ఇప్పుడు కళ్ళు మూతపడవు మరొకరి కంటి వెలుగౌతాయి. గుండె ఆగిపోదు మరొకరి జీవనాడి అవుతుంది. ఊపిరితిత్తులు ముడుచుకుపోవు మరొకరి శ్వాసగా మారుతాయి. ఇది సైన్స్‌కు మానవత్వం జోడయితే జరిగే అద్భుతం. జీవితం మట్టిలోకి కాకుండా మనుషుల్లోకి ప్రవహించే మహాద్భుతం! మృత్యువా నన్ను కబళించలేవు. ఇదిగో 34 జీవితాలుగా పరివర్తన చెందానంటూ మానవజాతి చేసే ప్రకటన!!



**జి.సి.మధుసూదనరావు**
నెల్లూరు జిల్లా

ఇటీవల విజయవాడ సమీపంలోని రామవరప్పాడు గ్రామానికి చెందిన మణికంఠ అనే ఇరవైరెండు సంవత్సరాల యువకుడు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెత్‌కు గురి అయ్యాడు. ఆ యువకుని కుటుంబ సభ్యులు మానవత్వంతో మణికంఠ అవయవాలను దానం చేయడానికి సమ్మతించడంతో ఎన్నారై ఆసుపత్రి మరియు ఇతర డాక్టర్లు కలిసి మణికంఠ గుండెను, ఊపిరితిత్తులను చెన్నైకు, కాలేయం గ్లోబల్ (హైదరాబాద్) ఆసుపత్రికి, ఎన్నారై సిటి ఆసుపత్రిలో ఇద్దరికి మూత్రపిండాలు, గుంటూరు శంకర నేత్రాలయకు మణికంఠ కళ్ళు సేకరించి తరలించడం ద్వారా బాధితులు మణికంఠ అవయవాలతో శాశ్వతత్వం పొందే వీలు కలిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అవయవదానం అంటే ఏమిటి? అవయవదానం మంచిదా? ఎలా చేయాలి? బ్రెయిన్‌డెత్ అంటే ఏమిటి? లాంటి సందేహాలు ఎన్నో ప్రజల్లో రావడం ఆహ్వానించదగ్గ విషయం.

**అవయవదానంతో కొత్త జీవితం**

అవయవాలు దెబ్బతినడంతో లక్షలమంది మృత్యువుకు చేరువ వుతున్నారు. అవయవదానంతో వీరికి నూతన జీవితాన్ని ప్రసాదించ వచ్చు. కన్ను, ఊపిరితిత్తులు, గుండె, కాలేయం, క్లోమం, ఎముక మజ్జ, గుండెకవాటాలు, మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థ, కణజాలం (టిష్యూలు) వంటి 34 అవయవాలను వేరుచేసి ఇతరులకు అమర్చే అవకాశం ఉంది. 10 నుంచి 90 సంవత్సరాల వ్యక్తి వరకు అవయవ దానం చేయవచ్చు. మన దేశంలో అవయవదానం ఎంతో అవసరం వుంది. ఎందుకంటే దేశంలో యేటా రెండు లక్షలమంది వివిధ అవయవాలు చెడిపోవడంతో చనిపోతున్నారని నివేదికలు తెలుపుతు న్నాయి. దేశంలోని పదిలక్షల్లో కేవలం 0.2మంది మాత్రమే అవయవ దానికి ముందుకు రావడం జరుగుతోంది. దీనికి ప్రధాన కారణం మన సాంప్రదాయాలు, అవయవదానంపై అవగాహన లేకపోవడం, అపోహలు ఉండటమే.

**అవయదాన ప్రాధాన్యత**

అవయవదాన ప్రాధాన్యత దేశంలో పెరిగిపోతున్నది. ఎందుకంటే దేశంలో ప్రతి 10మందిలో ఒకరు తీవ్రమైన మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. దాదాపు లక్షన్నరమంది ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకుం టున్నారు. వీరిలో దాదాపు 25వేలమందికి మూత్రపిండాలు వెంటనే మార్పిడి చేయాల్సి వుంది. ప్రతి మనిషికి రెండు మూత్రపిండాలుంటాయి. అయితే ఒక మూత్రపిండంతోనైనా మనిషి ఆరోగ్యంగా జీవించవచ్చు. కాని కుటుంబ సభ్యులు, సమీప బంధువులు అలాంటి వారికి తమ మూత్ర పిండం దానం చేయవచ్చు. కాని భయంతో, అవగాహన లేకపోవడంతో తమ కుటుంబీకులను చేజేతులా మృత్యుకుహరంలోకి నెడుతున్నారు. ఇక దేశంలో ప్రతి 10మందిలో నలుగురు గుండెజబ్బుతో బాధపడుతున్నారు. దేశంలో 12 మిలియన్లమంది అంధులు ఉన్నారు. వీరిలో దాదాపు 2 మిలియన్ల మందికి 'కార్నియా' అమరికతో చూపు వచ్చే పరిస్థితి ఉంది. అయితే ఒక అంచనా ప్రకారం సంవత్సరానికి లక్ష కార్నియాలు అవసరమైతే కేవలం 20వేలమందికి మాత్రమే అందుతున్నాయి. కాలేయ మార్పిడిలోనూ ఇదే స్థితి.

**దేశంలో అవయవదాన పరిస్థితి**

దేశంలో ప్రతి 10లక్షలమందికి 35మంది అవయవదాతలు న్నారు. అమెరికాలో ఇది 26.3%కాగా, ఆస్ట్రేలియాలో 15%, 28 దేశాల ఐరోపా సమాఖ్యలో ఇది 18.2%గా వుంది. ప్రపంచ జనాభాలో ఆసియన్లు 60% ఉన్నా, ప్రపంచ అవయవదానాలలో ఆసియా వాటా కేవలం 4%. ఈ స్థితి మారాలి. అవయవదాతల సంఖ్య పెరగాలి.

ఎందుకంటే బ్రెయిన్‌డెడ్‌ల సంఖ్య ఆసియా దేశాల్లో ఎక్కువ. దేశంలోని వివిధ వైద్యశాలల్లో చనిపోతున్నవారిలో 2%మంది బ్రెయిన్‌డెడ్ వ్యక్తులుండగా వీరిలో 0.2% మంది మాత్రమే తమ శరీరాలను దానంచేసి మరణించికూడా మరికొందరికి జీవంపోశారు.

**బ్రెయిన్‌డెడ్ వారే అర్హులు**

మరణించిన వారు అవయవదానానికి అనర్హులు. బ్రెయిన్‌డెడ్ అయినవారు అర్హులు. బ్రెయిన్‌డెడ్ అంటే బ్రెయిన్ పనిచేయడం నిలిచి పోయినా గుండె, కాలేయం, మూత్రపిండాలు కొన్ని గంటలపాటు పనిచేస్తూనే ఉంటాయి. ఉదా : బ్రెయిన్‌డెడ్‌కు గురయిన వ్యక్తి గుండె 48 గంటలు పనిచేస్తూనే వుంటుంది. అందుచేతనే బ్రెయిన్‌డెడ్‌కు గురయిన వ్యక్తి కుటుంబీకులు మానవత్వంతో వెంటనే ఆలోచించి అవయవ దానాలకు సమ్మతించాలి.

**బ్రెయిన్‌డెడ్ అయినట్లు గుర్తించేది ఎవరు?**

ఒక వ్యక్తిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించడానికి గుర్తించబడిన నలుగురు వైద్యుల బృందం (అందులో ఒకరు తప్పనిసరిగా న్యూరాలజిస్ట్ ఉండాలి) అవసరమైన పరీక్షలన్నీ ఒకసారి చేసి మరో ఆరుగంటల తర్వాత మరొక్కసారి పరీక్షించి ఆ తరువాతనే బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటన చేయాలి. అప్పుడే అలా మృతిచెందిన వ్యక్తి అవయవాలను మరో వ్యక్తికి మార్చ వచ్చు. ఇదంతా నిర్దేశిత 48గంటల్లోనే పూర్తవ్వాల్సి ఉంటుంది. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తినుంచి తీసిన గుండెను 4 నుంచి 8 గంటలలో, లివర్‌ను 6 నుంచి 8 గంటల్లో, మూత్రపిండాలను 6 నుంచి 12 గంటలలోనే ఇతరులకు అమర్చాలి. లివర్ మార్పిడి ప్రక్రియ ఇందులో క్లిష్టమైనది. దేశంలో యేటా 13 లక్షల వరకూ మరణాలు రోడ్డు ప్రమాదాలవలన సంభవిస్తున్నాయి. ఈ సందర్భాలలో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను తీసి మరొకరికి అమరిస్తే యేటా లక్షలమందిని రక్షించే అవకాశం వుంది.

**ఫలితాలిస్తున్న 'జీవన్‌దాన్'**

మానవ అవయవాలను రెండు విధాలుగా సేకరిస్తారు. ఒకటి జీవించి ఉన్న వ్యక్తినుంచి అవయవాలు సేకరించగా, రెండోది బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించిన వ్యక్తి నుంచి అవయవాలు సేకరించడం లేదా అవయవాలను దానం చేయడానికి ముందుగానే ప్రకటించిన వ్యక్తి నుంచి సేకరించడం. ఈ బ్రెయిన్‌డెడ్ మరియు ముందుగానే ప్రకటించిన దాతనుంచి అవయవాలను సేకరించడాన్ని 'కాడావరిక్ డొనేషన్' అంటారు. ఈ ప్రక్రియను మన రాష్ట్రంలో 'జీవన్‌దాన్' అనే పేరుతో అమలు చేస్తున్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో జీవన్‌దాన్ కార్యాలయం పనిచేస్తోంది. ఇందులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 ఆసుపత్రులు నమోదు చేసుకున్నాయి. అవయవాలు అవసరమైన వ్యక్తులు తమ పేర్లు ఇక్కడ నమోదు చేసుకోవాలి. జీవన్‌దాన్‌లో నమోదు చేయించుకున్న వైద్య శాలల్లో కాడావర్ అవయవ మార్పిడికి పనికివచ్చే బ్రెయిన్‌డెత్ రోగులు వచ్చినట్లయితే జీవన్‌దాన్ సిబ్బంది, వైద్యులు వారిని గుర్తించి అవయవ దానం చేయమని విజ్ఞప్తి చేస్తారు. ఇందుకు సంబంధీకులు సమ్మతిస్తే బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించే వైద్య బృందం పరీక్షించి బ్రెయిన్‌డెడ్ అయినది లేనిది నిర్ధారిస్తుంది. జీవన్‌దాన్ రికార్డుల ప్రకారం మొత్తం 300 (గుండె-3, కాలేయం-60, మూత్ర పిండాలు-124, గుండె కవాటాలు -62, కళ్లు-47, ఊపిరితిత్తులు -3) అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. అక్రమ అవయవ మార్పిడి, అనధికార మార్పిడిచికిత్సలు, వైద్యాన్ని వ్యాపారీకరించడాన్ని నివారించడానికి కేంద్రం మానవ అవయవ మార్పిడి చట్టం-1994ను రూపొందించి అమలు చేస్తోంది. అవయవాల వ్యాపారాన్ని నిషేధించింది. నేడు జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (నోట్టో) పనిచేస్తుంది. ఢిల్లీలోని 24 అవయవ సేకరణ మార్పిడి కేంద్రాలతో దీనిని అనుసంధానం చేస్తున్నారు. ఢిల్లీలోని నోట్టోతోపాటు నాలుగు ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అవయవదాన మౌలిక వసతుల కల్పనకు 149 కోట్లు కేటాయిస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. అలాగే తమిళనాడు రాష్ట్రం అవయవదాన రిజిస్ట్రీ ఏర్పాటు చేసి దక్షిణ రాష్ట్రాలన్నింటికి ప్రాంతీయ అవయవ మార్పిడి సమన్వయికేంద్రం (రోటో)గా పని చేయడం అభినందనీయం. ఇప్పటి వరకు 2700 అవయవ మార్పిళ్ల ద్వారా దేశంలో అగ్రగామిగా తమిళనాడు నిలుస్తోంది. మృతదేహాల నుంచి అవయవాలను తీసి, అవసరమైన వారికి మార్పిడి చేయడానికి దేశంలోనే మొట్టమొదటి కెడేవర్‌ట్రాన్స్ ప్లాంటేషన్ అథారిటీ (సిటిఏ)ను ఏర్పాటు చేయబోతున్నది. ఇది అమలులోనికి వస్తే బ్రెయిన్‌డెడ్ వ్యక్తుల అవయవాలను తీసి అవసరమైన వారికి వెంటనే అమర్చడానికి సిటీఏ కింద డాక్టర్లకు అధికారం ఉంటుంది. అవయవదానం చేసిన వ్యక్తికి కాని వారి కుటుంబీకులకు గాని సదరు అవయవాలను ఎవరికి అమర్చినది అవయవదాన చట్టం కింద చెప్పరు. సేకరించిన అవయవాలను కొన్ని గంటలలోనే అవసరమైన వారికి అమర్చాలి కనుక అవయవాలను తీసుకెళ్తున్న వాహనానికి ఎక్కడ ట్రాఫిక్ సమస్యరాకుండా రహదారిని బ్లాక్‌చేసి సదరు వాహనాన్ని పంపడాన్ని 'గ్రీన్ కారిడార్' అంటారు. అవయవాలను కొన్ని ఫ్లూయిడ్స్‌లో భద్ర పరచి బ్లాక్‌కలర్ బాక్స్‌లో తరలిస్తారు.

**దళారులను నివారించాలి**

దేశంలో రోజురోజుకు అవయవాల మార్పిడి ఆపరేషన్‌లు పెరిగి పోతున్నాయి. దేశంలో ఏడాదికి 15000నుంచి 20000ల వరకు అవయవ మార్పిడి జరుగుతోందని మీడియాలో వార్తలు వస్తున్నాయి. అలాగే ప్రతి యేడాది 20,000మందికి కిడ్నీ, 1,00,000మందికి కాలేయం కావాల్సి ఉంటోంది. దీంతో దళారులు, కొన్ని వైద్యశాలలు అవయవదాన నిబంధనలను దుర్వినియోగపరుస్తూ అవయవదానాన్ని వ్యాపారంగా మార్చేస్తున్నాయి. ఇటువంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి. కొన్ని బీమాసంస్థలు నేడు అవయవదాత వైద్య ఖర్చులతో పాటు మొత్తం ఆసుపత్రి ఖర్చుల్లో 20 నుండి 40శాతం వరకు అవయవ గ్రహిత భరించేవిధంగా పాలసీ రూపొందించడం కీలకచర్య. ఎందు కంటే అవయవ మార్పిడి కార్యక్రమం ఖరీదైన వ్యవహారం కావడంతో ఈ ఖర్చు భరించలేని పేద బాధితులు అకాల మరణాలకు గురవు తున్నారు. అందుచే అవయవమార్పిడి వైద్యశాలలను, నిపుణులైన డాక్టర్లను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

**అవయవదానం అందరిలో కలగాలి**

అవయవదానం ఓ ఉద్యమంలా సాగాలి. మరణాన్ని సైతం జయించేది అవయవదానంతోనే అనే భావాన్ని ప్రజల్లో పెంచాలి. పాలకులు, ప్రముఖ నటులు, క్రీడాకారులు అవయదానం తమది, తమ కుటుంబీకులది చేయడానికి ముందుకు రావడం ద్వారా విస్తృత ప్రచారం జరుగుతుంది. అప్పుడు సామాన్య మానవుడు సైతం అవయవదానం చేయడానికి ముందుకు వస్తాడు. విద్యార్థుల్లో సెకండరీ విద్యనుంచే అవయదానం బోధించే విధంగా పాఠ్యాంశాల్లో చేర్చాలి. ఉపాధ్యాయులు అవయదాన ప్రాధాన్యత, రక్తదాన ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కలిగించాలి. విద్యార్థులను వీటిపై చైతన్యపరచాలి. మనిషి జీవించి ఉన్నప్పుడేకాదు, చనిపోయిన తరువాత కూడా సమాజానికి సేవలు అందించడానికి తోడ్పడే ఉత్తమ మార్గం అవయవదానమనే భావాన్ని ప్రజల్లో పాలకులు, ప్రసార సాధనాలు కలిగించిన నాడే అవయవ దానం నిరంతరం కొనసాగుతుంది.




# ఆధార్ జపం

ఆధార్‌తో లింక్ లేకుండా గ్యాస్ సరఫరా... రేపటి నుండి ఆధార్ లింక్ ఉన్నా లేకున్నా సంవత్సరానికి పన్నెండు సిలిండర్లు... గడగడా వాణిజ్య ప్రకటనలా చదువుకు పోతున్న న్యూస్ రీడర్ని టీవిలో చూస్తున్న నాకు ఒక ప్రక్క సంతోషం కలుగుతున్నా... ఎంతో శ్రమపడి, ఎన్నో అవాంతరాలు ఎదుర్కొని, అనేకసార్లు ఆఫీసుల చుట్టూ తిరిగి, రెండుమూడుసార్లు వేలిముద్రలు, ఫోటోలు ఇచ్చి ఇచ్చి విసిగివేసారి చిట్ట చివరికి ఆధార్ కార్డులు సాధించిన నాకు ఈ వార్త బాధనే కల్గిస్తోందని అర్థమయింది. ఇంటికి వచ్చిన అతిథులు ఆధార్ గురించి అడుగుతోంటే ఎడమొహం, పెడమొహంగా తిరిగిన నాకు ఈ వార్త ఖచ్చితంగా నచ్చలేదు. అంతలో కాఫీ కప్పుతో వచ్చి సోఫాలో కూర్చుంటున్న శ్రీవారు టీపాయ్ మీద రిమోట్ తీసుకొని ఛానల్ మారుస్తూ నా వంక చూసిన ఆ చూపు నాకు వెటకారంగా తోచింది. ఆయన అలా చూసారో! నేనే అలా అనుకున్నానో! నాకర్థం కాలేదు. ఎవరో ఛోటా ప్రతిపక్ష నాయకుడు తెగ దంచేస్తున్నాడు. మధ్య తరగతి ప్రజలలో స్వార్థపూరిత ఆలోచనలు రేకెత్తించి, పరమ లోభులుగా మార్చి మరొక వైపు అధిక ధరలతో వేలకు వేలు పరోక్షంగా దోచుకుంటున్న మార్కెట్ మాయలో పడికొట్టుకుపోతున్న ప్రజలు వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతారు. ఎందుకో ఆ లెక్చర్ నాలో కొంచెం ఆవేశం కల్గించింది. ఏదిఏమైనా ఆధార్ కోసం పడిన శ్రమ వృథా అయిన బాధ మనసును వెంటాడు తోంది. సంవత్సరంక్రితం నా మనసును అల్లకల్లోలం చేసిన సంఘటనలు ఒక్కొక్కటే గుర్తుకు వస్తున్నాయి.



వి.వి.ఎస్.కామేశ్వరరావు
చాగల్లు (మం), పశ్చిమగోదావరి

* * * * * *

ఉన్నంతలో గబగబా డ్రాయింగ్ రూమ్‌ని సర్దేసాను. ఫరవాలేదనిపించింది. రూమ్‌ని చూశాక! మరొకసారి తృప్తిగా చూసుకున్నాను. అప్పుడప్పుడూ ఇంటికి అతిథులు వస్తేనే బాగుంటుందనిపించింది. కాస్త బద్ధకం వదులుతుంది!" అనుకున్నాను మనసులో! వచ్చేది నా స్నేహితురాలు రాధ. ఇంత హడావుడి అవసరం లేదు. కాని డ్రాయింగ్ రూమ్ మరీ అధ్వాన్నంగా ఉండటంతో కాస్త శుభ్రం చేసి సర్దాలని అనిపించింది.

స్నానం చేసొచ్చి దీపం పెట్టి అష్టోత్తరం చదివి ముగించేసరికి కాలింగ్‌బెల్ మోగింది. ఎదురుగా రాధ! ఒక్కసారి కౌగిలించుకొన్నంత పనిచేసాం ఇద్దరం. హైదరాబాద్ నుండి వాళ్ళక్కని చూడ్డానికని రాజమండ్రి వచ్చింది. ఇంటర్ నుండి మేమిద్దరం కలిసిమెలసి ఉండేవాళ్ళం. కుశల ప్రశ్నలు తామర తంపరలా పుట్టుకొస్తున్నాయి. పరస్పర సమాధానాలతో సరిపెట్టుకుంటున్నాము. కాఫీ తాగాక కాస్త నెమ్మదించాం.

అంతే! ఏ ప్రస్తావనైతే రాకూడదనుకున్నానో అదే వచ్చింది. ఆ మాటా ఈ మాటల్లో "ఏంటి మీకింకా ఆధార్ కార్డులు రాలేదా!" అంటూ నాకేసి జాలిగా చూస్తూ అంది రాధ. అది జాలిగా చూసిందో లేదో కాని నాకు మాత్రం అలాగే అనిపించింది. నా గుండె దడదడా కొట్టుకుంది. నేను మాట్లాడకపోయేసరికి మాకు ఆధార్ రాలేదని కన్‌ఫర్మ్ అయింది. అంతే ఇక విజయగర్వంతో వాళ్ళ ఆధార్‌కార్డులు వచ్చిన విధానాన్ని చెప్పుకుపోతోంది. నాకు రాధ మాటలు వినపడడం లేదు. పెదాలు కదలడం కనబడుతున్నాయి. ఇష్టం లేని మాటలు మనసుకు వినబడవు! అంటే ఇదేనేమో!

'నాది, మా వారిది, మా అబ్బాయిది మూడు నెలల్లో డైరెక్టుగా పోస్టులో ఇంటికి వచ్చేసాయి!' అంటూ ఎంతో గర్వంగా చెబుతున్న రాధ మొహం చూసి నాకు ఒకింత ఈర్ష్య కల్గింది.

'పోస్టులో డైరెక్టుగా వాళ్ళింటికి రాక ప్రక్కింటికి వెళ్తాయా కార్డులు' అని మనసులో మెటికలు విరిచాను. ఇదేంటి ఎంతో ఇష్టమైన రాధ పట్ల నేను ఇలా ప్రవర్తిస్తున్నాను!...? ఇప్పటి వరకూ ఎంతో ప్రేమాభిమానాలు ఇచ్చిపుచ్చుకొన్న నాకు రాధపట్ల కలుగు తున్న భావాలకి ఆశ్చర్యంగా ఉంది. ఏదిఏమైనా రాధ ఆధార్ ప్రశ్న నా మనసును అతలాకుతలం చేసింది. గోరు చుట్టుమీద రోకలి పోటులా ఉంది. అసలే ఆధార్ రాలేదన్న బాధలో ఉన్న నా ఆలోచనలు ఒక్కసారి వెనక్కు వెళ్ళాయి.

* * * * * *

ఆధార్ కార్డుల కోసమని పదినెలల క్రితం సబ్ కలెక్టర్ ఆఫీసులో వున్న ఆధార్ సెంటర్‌లో ఫోటోలు, వేలి ముద్రలు, కనుపాప స్కానింగ్ చేయించుకొని రెండు నెలల తరువాత కార్డుల కోసం ఎదురు చూడడం ప్రారంభించాం. ఒక నెలలో వచ్చేస్తాయిలే! అని ఊరుకున్న మాకు మెల్లమెల్లగా టెన్షన్ పెరగసాగింది. కారణం పత్రికల్లో వచ్చే వార్తలు, టీవిలో వస్తున్న అధికార, అనధికారుల స్టేట్‌మెంట్లు. అన్నీ ఆధార్‌తోనే లింక్‌చేస్తాం! ఆధార్ లేకపోతే జీవితమే లేదన్న స్థాయిలో ఊదరకొడుతున్న మాటలు వినీవినీ నాలో అసహనం పెరిగిపోసాగింది. రోజూ ఉదయం నెట్ సెంటర్‌లో ఆధార్ స్టేటస్ చూడమని మావారికి హుకుం జారీ చేశాను. రోజూ ఆయన చూసి రావడం బిక్కమొహం పెట్టడం అలవాటయి పోయింది నాకు. ఎంతో అందగాడని మురిసిపోయే మావారి వదనం ఈ మధ్య నాకు చిరాకని పించడం నాకే ఆశ్చర్యంగా ఉంది. పనంతా ముగించుకొని పోస్టుమేన్ కోసం ఎదురుచూడడం నిత్యకృత్యమై పోయింది. వారంరోజుల క్రితం కలెక్టర్ స్టేట్‌మెంట్ చూసిన దగ్గర నుండి నాలో టెన్షన్ మరీ పెరిగి పోయింది. ఈ నెల పదిహేనులోగా గ్యాస్ నెంబర్, ఆధార్ నెంబరు బ్యాంక్‌లో ఎంటర్ చేయించుకోకపోతే గ్యాస్ సరఫరా నిలిచిపోతుందని దాని సారాంశం. ఏం చేయాలి? ఎవర్ని అడగాలి? అంతా అయోమయం. సంవత్సరంలోగా రాకపోతే మళ్ళీ ఫోటోలు తీయించు కోవాలనే

వాళ్ళు కొంతమంది. అక్కరలేదు పోస్టులో వచ్చేస్తాయి అనే వాళ్ళు కొంతమంది ఏది నమ్మాలో? నమ్మకూడదో తెలియని పరిస్థితి. పది రోజుల నుండి నిద్రకూడా సరిగా పట్టడం లేదు. అప్పుడప్పుడు పట్టినా ఆధారే కల్లోకి వస్తోంది. పసుపు, ఎరుపు రంగుల ఆధార్ అలలు నన్ను భూతంలా భయపెడుతున్నట్లు, నన్నుచూసి వెకిలిగా నవ్వుతున్నట్లు ఒకటే పీడకలలు. రాత్రిళ్ళు ఉలిక్కిపడి లేవడం, మా వారు మంచి నీళ్ళిచ్చి సముదాయించడం మామూలైపోయింది. ప్రతి విషయాన్నీ ఈజీగా తీసుకునే నేను ఇలా అయిపోవడం నాకే ఆశ్చర్యం, ఆందోళనా కల్గిస్తోంది. సైన్సు గ్రాడ్యుయేట్ అయిన నేను భగవంతుడనే ఓ గొప్పశక్తి ఈ చరాచర జగత్తును నడిపిస్తోందని నమ్ముతాను. కాని ఆధార్ కార్డులు రావాలని ఆ భగవంతుణ్ణి గణపతి రూపంగా భావించి గడువులోగా కార్డులు వస్తే ఉండ్రాళ్ళు పోస్తానని మొక్కుకున్నాను. ఓహ్! నా పరిస్థితి నాకే అర్థం కావడం లేదు. ఆదుకొనే నాథుడేడి?

ఆధార్....! ఆధార్....! ఆధార్....! జీవితమే నిరాధారమయినంత నిస్పృహ.

ఏదిఏమైనా ఆధారే ప్రపంచమన్నంత భావన ప్రజల్లోకి ఎలా వచ్చింది? ఆధార్ కార్డులేకపోతే బ్రతుకే వ్యర్థం అన్న ఫీలింగ్ ఎలా కలిగింది? 'ఆధార్లో ఏదో ఉంది!' అని తాత్వికంగా ఆలోచించడంతో 'ఆధార్' ప్రజల మనసుల్ని ఆక్రమించేసింది. అన్నీ మరచిపోయి 'ఆధార్' జపం చేయించింది. ఈ విషయంలో ప్రభుత్వం వందశాతం విజయం సాధించింది. 'పిచ్చిజనం' అనుకున్నాను. వెంటనే నాలిక్కరుచుకొని 'నేనూ ఒకదాన్నిగా' అనుకున్నాను. చివరికి ఇంటికి వచ్చిన బంధువులు, స్నేహితులు ఆధార్ గురించి ఎక్కడ ప్రశ్నిస్తారో అని వణికిపోతున్నాను.

* * * * * *

రాధతో అప్పటిదాకా ఆనందంగా చెప్పుకున్న కబుర్లు, ఆత్మీయత ఆధార్ ప్రస్తావనతో ఆవిరైపోయాయి. కాని రాధ ముందు చులకనవ కూడదన్న సంస్కారం నన్ను మౌనంగా మార్చేసింది.

"ఏంటి ఇప్పటిదాకా ఆనందంగా గలగలా మాట్లాడావు! ఏమైందే నీకు? ఒక్కసారిగా అలా బొమ్మలా అయిపోయావు! అంటూ నా భుజం మీద చేయివేసి నొక్కింది రాధ.

"అబ్బే ఏం లేదే! మా వారికి ఈ సంవత్సరం ట్రాన్సఫర్ అవుతుందంటే! ఎక్కడికి అవుతుందో, ఏంటో! అంటూ కాసిన మంచినీళ్ళు త్రాగాను.

'సామాన్లు సర్దడం తలుచుకుంటేనే భయంవేస్తోందే!" అంటూ టాపిక్ మార్చడానికి ప్రయత్నించాను.

ఎంత ప్రయత్నించినా రాధ వేసిన ప్రశ్న పదేపదే నాకు చెవుల్లో మారుమ్రోగడం మానలేదు. ఏదో అర్ధంకాని లోకంలో ఉన్నట్లుంది నాకు.

రాధ సెల్‌రింగ్ అవడంతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాను. రాధ సెల్‌లో మాట్లాడుతూ "అక్కరమ్మంటోదే బావగారు క్యాంప్ నుండి వచ్చారుట లంచ్‌కి ఇక్కడికే వచ్చేయ్ అంటోంది' అంటూ సెల్ ఆఫ్ చేసి బ్యాగులో పెట్టింది.

'వస్తానే' ఈసారి మీరు హైదరాబాద్ వచ్చినప్పుడు మా ఇంట్లో రెండు రోజులు ఉండాలే!' అంటూ బయలుదేరింది రాధ.

కప్‌బోర్డులో రాధకు పెడదామన్న చీరపై పడింది నా దృష్టి. కాని మెట్లు దిగుతున్న రాధకు టాటా చెప్పాను నిర్లిప్తంగా.

రాధ వెళ్ళిపోయిన కాసేపటికి నన్నుచూసి నాకే అసహ్యం వేసింది. 'ఏంటి ఇలా మారిపోయాను?' ఏమిటి కారణం? ఎవరు కారణం? ఆధార్ ఏమిటి! ఆ పేరుతో క్రియేట్ అయిన టెన్షన్ దీనికంతటికీ కారణమా? ఓహ్! అంటూ నీరసంగా కూలబడ్డాను సోఫాలో. కప్‌బోర్డులోని చీర మాత్రం నన్ను వెక్కిరిస్తున్నట్లు అనిపించింది. ☯

## ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల వివరాలు

| అభ్యర్థి పేరు | మొదటి రౌండ్ఓట్లు | చివరి(13వ) రౌండ్ఓట్లు |
|---|---|---|
| 1. కెవివివి సత్యనారాయణ (చైతన్యరాజు) | 5,699 | 7373 |
| 2. కాండ్రేగుల నరసింహం | 21 | 0 |
| 3. పి.కృష్ణారావు | 65 | 0 |
| 4. గెద్దం సంపదరావు | 0 | 0 |
| 5. మాకే దేవీప్రసాద్ | 4 | 0 |
| 6. పతివాడ కృష్ణారావు | 26 | 0 |
| 7. పరుచూరి కృష్ణారావు | 3,344 | 0 |
| 8. పాత్రుని కృష్ణారావు | 6 | 0 |
| 9. పిల్లి డేవిడ్ కుమార్ | 53 | 0 |
| 10. పేపకాయల రాజేంద్ర | 6 | 0 |
| 11. ప్రగడ కృష్ణారావు | 13 | 0 |
| 12. సుంకపల్లి మురళీధర్ | 5 | 0 |
| **13. రాము సూర్యారావు (ఆర్ఎస్ఆర్ మాస్టారు)** | **7,679** | **8,899** |
| 14. కెవివి సత్యనారాయణరాజు | 43 | 0 |
| 15. సుందర గంగాధర్ | 26 | 0 |
| 16. నోటా | 112 | - |
| మొత్తం పోలైన ఓట్లు | 17,487 | |
| చెల్లిన ఓట్లు | 16990 | |
| చెల్లని ఓట్లు | 385 | |

## కృష్ణా - గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల వివరాలు

| అభ్యర్థి పేరు | పోలైన ఓట్లు |
|---|---|
| 1. దాసరి మరియదాసు | 18 |
| 3. గంగోలు శామ్యూల్ | 7 |
| 2. గ్రంధి పార్థసారధి | 10 |
| 4. తాడి శంకుతల | 108 |
| 5. ఏఎస్ రామకృష్ణ | 7,146 |
| 6. కెఎస్ లక్ష్మణరావు | 5,383 |
| 7. నోటా | 47 |
| మొత్తం పోలైన ఓట్లు | 13,047 |
| చెల్లిన ఓట్లు | 12,672 |
| చెల్లని ఓట్లు | 328 |

### 2013లో బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలి

2013లో జరిగిన బదిలీలలో బదిలీకాబడి సబ్‌స్టిట్యూట్ (రిలీవరు) లేక రిలీవుకాని వారిని 23.04.2015న రిలీవ్ చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ కె.సంధ్యారాణి గారికి విజ్ఞప్తి చేయడమైనది. 2014లో సాధారణ ఎన్నికల వలన రిలీవ్ చేయలేదని, 2013, 2014లలో డిఎస్‌సి నిర్వహించనందున సబ్‌స్టిట్యూట్‌లేనివారందరు అక్కడే ఉండిపోయారని వివరించడమైనది. సుమారు 1900 మంది రిలీవ్ కావాల్సి ఉందని చెప్పగా దీనిపై వెంటనే తగు నిర్ణయం తీసుకొంటామని తెలియజేశారు.

### వేసవిలో బదిలీలు, శిక్షణ తరగతుల ప్రక్రియ పూర్తి చేయాలి

వేసవి సెలవులు ప్రారంభంలోనే ప్రమోషన్లు, రేషనలైజేషన్, శిక్షణా తరగతుల ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాసంవత్సరం ప్రారంభమైన తరువాత ఏ విధమైన విద్యేతర కార్యక్రమాలు నిర్వహించరాదని పాఠశాల విద్యడైరెక్టర్ గారికి ప్రాతినిధ్యం చేయడమైనది. అందుకు తగు సన్నాహాలు చేస్తున్నట్లు డైరెక్టర్ తెలియజేశారు. బదిలీ నిబంధనలు, రేషనలైజేషన్, మీడియం, క్లస్టర్ స్కూళ్ళు తదితర విషయాలపై ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలతో చర్చించాలని విజ్ఞప్తి చేశాము.

### ఎయిడెడ్ అరియర్సు చెల్లింపులకు కృషి

ఎయిడెడ్ బడ్జెట్ విడుదల కోసం అనేక ప్రాతినిధ్యాలు చేసి బడ్జెట్ రాబట్టుకోవడం ఒక ఎత్తయితే, ఆర్థికశాఖ ఆంక్షలవలన బిల్లులు తీసుకోలేని పరిస్థితి వచ్చింది. దీనిపై ఆర్థికశాఖ, డిటిఎలతో మాట్లాడి క్లియరెన్సు యిప్పించడమైనది. కొన్ని జిల్లాలలో బడ్జెట్ ఉన్నమేరకు పూర్వపు అరియర్సు తీసుకొనుటకు అనుమతి యిప్పించాలని మార్చి 30,31 తేదీలలో మన సంఘం తరఫున మరియు పిడియఫ్ ఎమ్మెల్సీలు వై.శ్రీనివాసులురెడ్డి, బి.నాగేశ్వరరావు ఆర్థిక శాఖతో మాట్లాడి క్లియరెన్సు యిప్పించడం జరిగింది. ఇంత ప్రయత్నం చేసినా కొన్ని జిల్లాల్లో సబ్‌ట్రెజరీలలో పనికాకపోవడంతో చెల్లింపులు జరగలేదు.

### మధ్యాహ్నభోజన పథకం బడ్జెట్ మంజూరు చేయాలి

మధ్యాహ్నభోజన పథకం బిల్లులు చెల్లింపుకు బడ్జెట్ వెంటనే విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులతో ప్రాతినిధ్యం చేయడమైనది. ఆగస్టు 2014 నుండి 9,10 తరగతుల బిల్లులు, 2014 డిసెంబర్ నుంచి ప్రాథమిక తరగతులకు సంబంధించి బిల్లులకు జిల్లాకు 20 కోట్ల చొప్పున బిల్లులు పెండింగులో వున్నాయని, నిర్వాహకులకు చెల్లించవలసిన బిల్లులు లక్షల్లో బకాయి ఉంటే భోజనాలు పెట్టడం ఎలా సాధ్యమని ప్రశ్నించడం జరిగింది. వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేయడమైనది.

### ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి స్పాట్ కేంద్రాలో నిరసన ప్రదర్శన జయప్రదం చేయండి - ప్యాప్టో

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 19న స్పాట్ కేంద్రాలలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించాలని ఏప్రిల్ 2న ఎస్‌టియు ఆఫీస్ హైదరాబాద్‌లో జరిగిన ప్యాప్టో సెక్రెటేరియేట్ నిర్ణయించింది. ఆ మేరకు ప్రభుత్వానికి నోటీసు యివ్వడమైనది. క్లస్టర్ స్కూళ్ళ ప్రతిపాదన విరమించుకోవాలని, సర్వీస్‌రూల్స్ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంలో ప్రాతినిధ్యం చేయుటకు ఒక రాజకీయ ప్రతినిధి, ఒక ఉన్నతాధికారిని నియమించాలని, పండిట్స్ పిఇటి అప్‌గ్రేడేషన్ చేయాలని, స్పెషల్ టీచర్ల సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్స్ యిప్పించా లని, వేసవిలో బదిలీల ప్రక్రియ పూర్తి చేయుటకు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి ఈ నిరసన కార్యక్రమం చేపట్టడమైనది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

### పిఆర్‌సిపై జివోలు వెంటనే ఇవ్వాలి - యుటియఫ్

పిఆర్‌సి నివేదికను కేబినెట్ ఆమోదించి అమలుకు వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేయడమైనది. ఏప్రిల్ 1న కేబినెట్‌లో ఈ ప్రస్తావన లేకపోవడం పట్ల ఉత్తర్వులు ఎప్పుడిస్తారోనని ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందని తెలుపడం జరిగింది. రాష్ట్ర జెఏసితో కుదిరిన ఒప్పందం మేరకు నూతన పిఆర్‌సితో ఏప్రిల్ జీతాలు మే 1న చెల్లించాల్సి ఉందన్నారు. కావున పిఆర్‌సి అమలుకు వెంటనే ఉత్తర్వులు యివ్వాలని జూన్ 2014 నుండి చెల్లించాల్సిన అరియర్సు ఏ రూపంలో చెల్లించేది స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరడమైనది.

**కథలు, కవితల పోటీలలో ప్రచురణకి ఎంపికైన కవిత**

## అబద్ధం అమ్మకి కొత్తకాదు!

– కాండూరి వెంకట సన్యాసిరావ్, విజయనగరం జిల్లా

ఇంకా
కళ్ళు తెరవనేలేదు
అమ్మ రుణం తీర్చుకునే అవకాశం!
మెడకొక్కనికి తగిలించబడ్డ చిరుగులపైట
ఉయ్యాలలో ఉద్యోగం.
ఉద్యోగంలోంచే ఆహారం, ఉయ్యాలే ఆహార్యం!
ఉన్నంతలో చాటు చూసుకుని పాలిచ్చే అమ్మ
కార్లు, రైళ్ళు చూపిస్తూ కావాలని ఎండన ఎండబెడుతుంది
కందుతున్నకొద్దీ రూపాయి అందుతుందని ఆశట!
ఎవరూ చూడనప్పుడు ముద్దిచ్చే తను
నలుగురిలో తెలీకుండా గిల్లి ఏడిపిస్తుంది
గుక్కపడితే బిడ్డకి గుక్కెడు పాలులేవ?
అబద్ధం?
చేతిలో నాణేల శబ్దం చెవికి సోకుతున్నట్టే ఉంటుంది
అమ్మ దీనాలాపన వినవచ్చి మనసు బరువెక్కుతుంది
కసిరికొట్టే వాళ్ళకన్నా, జాలి చూపులు నటిస్తూ
"శీతపు సంచుల"వైపు చూసేవాళ్ళంటే కోపం!
ఉద్యోగం దిగగానే గాలిధూళి ఛూచ్ అంటూ దిష్టి తియ్యడం
అమ్మ కడుపు పట్టుకు వేలాడే కంగారు పిల్లకి దిష్టి కూడానా?
బ్రతుకులెన్ని విధాలో? బ్రతుకు తెరువులెన్ని పోకడలో తెలీదు
కష్టపడడం ఇష్టపడని తను, మనసు చంపుకుని
సిగ్గు చిముడుకుని భుక్తాయాసపడడం కద్దు
కడుపు పండడం కన్నా కడుపు నిండడం కష్టం
ఈ మాయదారి లోకంలో అంటూంటుంది! అమ్మ
నిజమేనా? ఏమో? తనకి అబద్ధం కొత్తకాదు!

# ఏవిఎస్ వర్ధంతి సభలు



### విజయనగరం జిల్లా

జిల్లాలో బొబ్బిలి, సాలూరు, పార్వతీపురంలలో అప్పారి వెంకట స్వామి వర్ధంతి సభలు జరిగాయి. బొబ్బిలిలో రాష్ట్ర సహాధ్యక్షులు కె. విజయగౌరి, పార్వతీపురంలో అధ్యక్షులు ఎస్.మురళీమోహన్, సాలూరులో జిల్లా కార్యదర్శి జి.వెంకటనాయుడు పాల్గొన్నారు. ఏవిఎస్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం జరిగిన సభలలో ఏవిఎస్ ఆశించిన విద్యారంగం, కార్యకర్తల క్రమశిక్షణ, నిర్దిష్టత, నిర్మాణం వంటి అంశాలను బాధ్యతగా ఆచరించి, తన వారసులమని నిరూపించుకునే బాధ్యత మన కార్యకర్తల పై ఉందని పిలుపునిచ్చారు. సమాజంలో మార్పుల కోసం నిరంతరం కృషి చేస్తూ, అధ్యయనం చేయాలన్నారు.

ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను ప్రతిఘటించే పనికి యుటియఫ్ ప్రధానభూమిక పోషించాలని అన్నారు. ఉపాధ్యాయులకు మెరుగైన వేతన స్కేల్స్, డిఏలు, ఇంక్రిమెంట్లు, ఆటోమేటిక్ స్కీమ్స్‌ను సాధించడంలో అవిరళ కృషి చేశారని, 16 యేండ్ల ఉద్యోగ సర్వీసును వదులుకుని సంఘం కోసం కష్టపడి ఫలాలను అందించారని, వాటిని కాపాడుకోవటమే ఏవిఎస్‌కు నిజమైన నివాళి అని అన్నారు. ఈ మూడు ప్రాంతాలలో జరిగిన కార్యక్రమాలలో జిల్లా కార్యదర్శులు టి.రమేష్, జి.వెంకటనాయుడు, పి.మధుసూధనరావు, వై.స్వామి నాయుడు, వి.ప్రసన్నకుమార్, కె.రామకృష్ణ, పి.సత్యన్నా రాయణ, జి.గంగులు, కేశవ్, రాధాకృష్ణ, చంటిలు పాల్గొన్నారు.

### ప్రకాశం జిల్లా

ఇంకొల్లు మండల యుటియఫ్ శాఖ ఆధ్వర్యంలో “టీచర్స్ హోం” నందు మార్చి 30న మండలశాఖ అధ్యక్షులు జి.ప్రభాకర్ అధ్యక్షతన కీ॥శే॥ అప్పారి వెంకటస్వామి 14వ వర్ధంతి సభ జరిగింది. యుటియఫ్ సీనియర్ నాయకులు పివి సుబ్బరావు ఏవిఎస్ పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

యుటియఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఉప్పల చెంచయ్య ఏవిఎస్ జీవిత చరిత్ర, ఉపాధ్యాయ ఉద్యమానికి ఆయన చేసిన కృషి, ఆర్థిక క్రమశిక్షణ గురించి తెలిపారు. మండలశాఖ గౌరవాధ్యక్షులు బి. హనుమంతరావు ఐక్యఉపాధ్యాయ సంఘ నిర్మాణంలో, కార్యకర్తలను తయారు చేయటంలో, ఆయన అవలంభించిన విధానాన్ని వివరించారు. మండలశాఖ ప్రధానకార్యదర్శి దీవి రమేష్‌కుమార్ ఏవిఎస్ ఆశయాలను నెరవర్చడానికి ఇప్పటి సంఘ బాధ్యులు కృషి చేయాలని కోరారు.

యుటియఫ్ సీనియర్ సభ్యురాలు వి.ఉదయకుమారి మాట్లాడుతూ ఏవిఎస్ ఉద్యమ స్ఫూర్తిని పొంది, ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి టి.శ్రీనివాసరావు, కార్యదర్శులు కెజెఆర్ కుమారి, పి. సత్యనారాయణ, టి.సాంబశివరావు, సిహెచ్.నాగేశ్వరరావు, వి.విజయ లక్ష్మి, కె.పుష్పావతి, సిహెచ్ శివరామకృష్ణ ప్రసాద్, ఎ.సురేష్‌రెడ్డి, కె. శ్రీనివాసరావు, ఎన్.హనుమంత రావు తదితరులు పాల్గొని ఏవిఎస్‌కి నివాళులర్పించారు.

**బల్లికురవ :** ప్రకాశం జిల్లా యుటియఫ్ బల్లికురవ మండల శాఖ ఆధ్వర్యంలో అప్పారి వెంకట స్వామి వర్ధంతి సభను మార్చి 31న స్థానిక ఎంఆర్‌సినందు నిర్వహించడమైనది. సభకు యుటియఫ్ శాఖ అధ్యక్షులు కె.నిరంజన్‌రావు అధ్యక్షత వహించడం జరిగింది. జిల్లా కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకటస్వామి నేటి తరానికి ఆదర్శనీయులైన, అంకిత భావానికి, ఆర్థిక క్రమ శిక్షణకు పట్టుదలకు మారుపేరుగా అభివర్ణించారు. యుటియఫ్ శాఖ నిర్మాణంలో వీరి ప్రాధాన్యతను తెలియజేశారు. ఐక్యఉపాధ్యాయ పత్రిక నిర్వహణలో తనవైన శైలీని కనపరచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చంటి శ్రీనివాస రెడ్డి, గాలం వీరాంనేయులు, కొండానాయక్, పాలపర్తి రామాంజ నేయులు, మండలపు వీరాంజనేయులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

### నెల్లూరు జిల్లా

యుటియఫ్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి అప్పారి వెంకటస్వామి 15వ వర్ధంతిసభ యుటియఫ్ జిల్లా కార్యాలయములో జరిగింది. ఈ సభలో పాల్గొన్న యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని పేదలకు దూరం చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. 7000మందితో ప్రారంభమైన సంఘం ఈ రోజు లక్ష పైచిలుకు సభ్యత్వం కలిగి ఉందంటే యుటియఫ్ కార్యకర్తలే కారణం బలమైన కార్యకర్తలను తయారు చేయడంలో ఆయన చూపిన బాటనే మనం అనుసరిస్తున్నామని తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ చెన్నుపాటి వారసులుగా ఏవిఎస్ యుటియఫ్‌ను నిర్మించారని వారి ఆశయాలను కొనసాగించడంలో మనం ముందుండాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధానకార్యదర్శి పరంధామయ్య మాట్లాడుతూ సమిష్టి నిర్ణయాలతో యుటియఫ్ ఉద్యమం కొనసాగడం వల్లే నేటికి బలమైన సంఘంగా కొనసాగుతుందని తెలిపారు. వ్యక్తిగత ధోరణలు మన సంఘం మీద పడకుండా జాగ్రత్తపడుతూ ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటూ ఉండాలని తెలిపారు. ఈ సభకు అధ్యక్షత వహించిన మస్తానయ్య మాట్లాడుతూ యుటియఫ్‌కు వెంకటస్వామి వేసిన పునాదీ ఈ రోజు మనం రాష్ట్రంలో 6 మంది పిడిఎఫ్ ఎమ్మెల్సీలను గెలిపించుకోగలిగామన్నారు. ఈ సభలో జిల్లా ఉపాధ్యక్షులు రమాదేవి, కార్యదర్శులు తులసిరాంబాబు, సుబ్బారావు, జివి భాస్కర్, స్వర్ణలత, కె.వెంక్రటావు, వీరేంద్రనాథ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

**కావలి :** నెల్లూరు జిల్లా యుటియఫ్ కావలి ప్రాంతీయ మండల శాఖ ఆధ్వర్యంలో అమరజీవి అప్పారి వెంకటస్వామి 14వ వర్ధంతి సభ ఏప్రిల్ 1న పెన్షనర్స్ భవనం కావలినందు జిల్లా గౌరవాధ్యక్షులు పి.జానకిరాం అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి పాల్గొని మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి 16 సంవత్సరముల సర్వీసును వదులుకొని 25 సంవత్సరాలు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి సంఘం అభివృద్ధికి, ఉపాధ్యాయ సంక్షేమానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. కార్యకర్తలను ప్రోత్సహించడంలో నాయకులను తయారు చేయడంలోను అప్పారి ప్రత్యేక శ్రద్ధ

కనపరచేవారు. సమిష్టి నిర్ణయాలు, వ్యక్తిగత బాధ్యత అనే ప్రజాస్వామిక సమాజాన్ని అమలు చేసేవారు. నిర్మాణం పట్ల ప్రత్యేక దృష్టి వహించేవారు. కార్యకర్తలకు తరచు శిక్షణా తరగతులు నిర్వహించి స్థాయి పెంచేవారు. ఈ రోజు ఎమ్మెల్సీ ఎన్నికలలో రాజకీయ పార్టీలను దీటుగా ఎదుర్కొని రాష్ట్రంలో ఆరుగురు ఎమ్మెల్సీలను కలిగివుండే అతిపెద్ద సంఘంగా గుర్తింపు కలగడానికి వారి కృషి ఎంతో ఉందన్నారు. వారి ఆశయాలను మనం కొనసాగిం చాలని పిలుపు నిచ్చారు.

జిల్లా అధ్యక్షులు ఎం.మస్తానయ్య మాట్లాడుతూ 1975లో యుటియఫ్ అధికార వాణిగా ఐక్యఉపాధ్యాయ మాసపత్రికను ప్రారంభించి ఒక రచయితగా పాఠకులను చైతన్యపరిచే అనేక వ్యాసాలను రాసేవారని ప్రధాన సంపాదకునిగా ప్రభుత్వ విధానాలు ఎండగట్టడంలో ఉపాధ్యాయ సంఘాల విచ్ఛిన్నకర ధోరణులు ఎత్తిచూపడంలో నిరంతరం కృషి చేసేవారన్నారు. ఆర్థిక విషయాలలో నిక్కచ్చిగా వుంటూ సంఘం డబ్బు వృదాకాకుండా చూసేవారన్నారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.శ్రీదేవి, జిల్లా కార్యదర్శి చలపతి శర్మ, సీనియర్ నాయకులు ఎల్.గుణశేఖర్ రెడ్డి, పెన్షనర్స్ సంఘం కార్యదర్శి మాల్యాద్రి, యుటియఫ్ జిల్లా కమిటీ సభ్యులు టి.శ్రీనివాసరావు, మండల శాఖల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.తిరుమలరావు, ఎస్.ప్రకాశరావు, ఎన్.మధుసూదనరావు, మహిళా కమిటీ కన్వీనర్ జి.కల్యాణి, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చిత్తూరు జిల్లా

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి, ఉద్యమ నిర్మాత, అమరజీవి అప్పారి వెంకటస్వామికి 14వ వర్ధంతి సందర్భంగా పలమనేరులో యుటియఫ్ డివిజన్ శాఖ ఘనమైన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ వెంకటస్వామి 16 సం॥లు ఉపాధ్యాయ సర్వీస్‌ను వదులుకొని ఉపాధ్యాయుల సంక్షేమానికి, విద్యా రంగాభివృద్ధికి కృషి చేశారన్నారు. జీవితాంతం సంఘ ఆశయాలను తుచ తప్పక పాటించడమేకాక 1974 ఆగస్టున ప్రారంభమైన సంఘం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేశారన్నారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక స్థాపించి ఎమర్జెన్సీ కాలంలో ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలబడ్డారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకిచ్చే ఘనమైన నివాళన్నారు. ఈ కార్యక్రమంలో జివి రమణ, ప్రకాష్, సుధాకర్‌రెడ్డి, గురుమూర్తి, విజయ కుమార్, క్రిష్ణమూర్తి, ఆంజప్ప, పాపయ్య, నాగభూషణం, సిద్దయ్య, పి.సి.బాబు, డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కడప జిల్లా

యుటియఫ్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి అమరజీవి అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మిరాజ, రాష్ట్ర కౌన్సిలర్ పి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి సుబ్బరాజు, కె.గంగన్న, కార్యవర్గ సభ్యులు సి.రమణమూర్తి, విజయ భాస్కర్, టి.మురళీ, జిల్లా నాయకులు వై.శ్రీహరి, ఎస్.రఫీక్, ఎస్.శశిధర్, ఎస్.హిలాల్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి.లక్ష్మి రాజ మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి యుటియఫ్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శిగా 1974 నుండి 2000 సం॥ వరకు పనిచేశారన్నారు. తన జీవితం ఉద్యమాలకు, సంఘ నిర్మాణానికి అంకితం చేశారన్నారు. ఆయన ఉపన్యాసాలకు ఆకర్షితులై అనేకమంది యుటియఫ్ నాయకులుగా ఎదిగారన్నారు.

నేడు ప్రపంచీకరణ, సంస్కరణల ప్రభావం, కార్పోరేట్లకు కొమ్ము కాస్తున్న ప్రభుత్వాల విధానాలు ఉద్యమాలను నిర్వీర్యం చేస్తున్నాయి. ఆందోళనలు, పోరాటాల కోసం సెలవులు పెట్టటం పెద్ద త్యాగం క్రిందకు మారిపోయిందన్నారు. ఏవిఎస్ స్ఫూర్తిగా ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకుపోవాలి. ప్రజాతంత్ర ఉద్యమాలు, విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయుల హక్కుల కోసం, సమాజ మార్పు కోసం, ఉపాధ్యాయులు పునరంకితం కావటం ఏవిఎస్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు.

### కర్నూలు జిల్లా

మార్చి 21న కర్నూలులోని యుటియఫ్ జిల్లా కార్యాలయంనందు అమరజీవి అప్పారి వెంకటస్వామి వర్ధంతిసభ జరిగింది. ఈ సందర్భంగా ఏవిఎస్ చిత్రపటానికి జిల్లా కోశాధికారి జె.సుధాకర్ పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ అమరజీవి అప్పారి వెంకట స్వామి జీవితం నూతన తరాలకు ఆదర్శప్రాయమన్నారు. సంఘ నిర్మాణంలో ఆయన చేసిన త్యాగం, కార్యదక్షత, పోరాట పటిమను నిత్యం గుర్తు చేసుకొంటూ చైతన్యవంతమైనప్పుడే ఆయనకు ఘన నివాళి అర్పించినట్లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ఎం జయరాజు, యుఆర్ఏ రవికుమార్, బి.ప్రతాప్, ఏఎండి రఫిక్, ఎస్‌వి నారాయణస్వామి, కె.శ్రీనివాసులు, బి.ఆదినరసింహా, హేమంత్, మద్దిలేటి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే యుటియఫ్ లక్ష్యం

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడమే యుటియఫ్ లక్ష్యమని జిల్లా కార్యదర్శి జె.యల్లప్ప తెలిపారు. క్లస్టర్ స్కూళ్ళ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం సరికాదన్నారు. క్లస్టర్ స్కూల్స్ వల్ల బాలికలు విద్యకు దూరమయ్యే ప్రమాదం వుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి, ప్రస్తుతం ఉన్న పాఠశాలలను అభివృద్ధిచేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో యుటియఫ్ వ్యవస్థాపకుడు అప్పారి వెంకటస్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు ఎన్.నాగమణి మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి నాయకత్వంలో 1974 ఆగస్టు 10న యుటియఫ్ ఆవిర్భవించిందని నాటి నుండి 2000 సం॥ వరకు 25యేళ్ళపాటు ప్రధానకార్యదర్శిగా పత్రిక సంపాదకునిగా సేవలం దించి యుటియఫ్‌ను పెద్ద ఉపాధ్యాయ సంఘంగా విస్తరించడంలో అప్పారి వెంకటస్వామి పాత్ర చిరస్మరణీయం అన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ మల్లాది నాగరాజు మాట్లాడుతూ 16 సం॥ల సర్వీసును వాలంటరీగా వదిలిపెట్టి సంఘం అభివృద్ధికోసం కృషి చేశారన్నారు. నేడు ఆందోళన లు, పోరాటాల కోసం ఒకటి రెండ్రోజులు సెలవు పెట్టడమే ప్రస్తుతం పెద్ద త్యాగం క్రిందకు మారిపోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఆయన ఆదర్శాలను అందుకోవాలి. విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయు ల హక్కుల కోసం, సామాజిక మార్పుకోసం పునరంకితం కావడమే అప్పారి వెంకటస్వామికి మనమిచ్చే ఘనమైన నివాళి! ఈ సమావేశంలో బిజి మాదన్న, జ్ఞాన ప్రకాష్, శంకర్‌నాయక్, నాగరాజు, భాస్కర్, రాఘవేంద్ర, పెద్దారెడ్డి, రాజేష్, గోపాల్, విజయ్‌కుమార్, లవకుమార్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమబెంగాల్ ఉపాధ్యాయులకు సంఘీభావం

మార్చి 29న యుటియఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పశ్చిమ బెంగాల్‌లో దాడులకుగురైన ఉపాధ్యాయులకు సంఘీభావంగా కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుటగల గాంధీ విగ్రహం ముందు జిల్లా అధ్యక్షులు డి.రామశేషయ్య అధ్యక్షతన ఒక నిరసన కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు ప్రారంభించగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అన్ని వర్గాల ప్రజలతోపాటు ఉపాధ్యాయులపై పాశవిక దాడులు చేస్తున్నదని దీన్ని తీవ్రంగా ఖండిస్తూ, స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) పిలుపు మేరకు బెంగాల్ ఉపాధ్యాయులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. బెంగాల్ ప్రభుత్వం ఉపాధ్యాయులపై చేసే దాడులు వెంటనే ఆపాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.మాణిక్యంశెట్టి, వై.మనోహర్, జె.సుధాకర్, ఎస్ఎం జయరాజు, ఆర్.ఏ.రవికుమార్, హేమంత్, ప్రకాశరావు, వీరారెడ్డి, నారాయణస్వామి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## వినిమయ (విష) సంస్కృతి సామ్రాజ్యవాద ఫలితమే

**- తెలకపల్లి రవి**

ప్రపంచీకరణ పేరుతో మన దేశంలోకి వినిమయ విష సంస్కృతి ప్రవేశపెట్టబడిందని, ఇది అమెరికా సామ్రాజ్యవాద ఫలితమేనని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌నందు మార్చి 29న “ప్రపంచీకరణ – సంస్కృతి” అనే అంశంపై యుటియఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షులు డి.రామశేషయ్య అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు ప్రారంభించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలకపల్లి రవి మాట్లాడుతూ సంస్కృతి ఎప్పటికప్పుడు మారుతూ వుంటుందని, దీనికి పురోగామి లక్షణముంటుంది గనుకనే సంస్కరణ అనీ, తద్వారా దీనిని సంస్కృతి అని అంటారన్నారు. అయితే గత రెండున్నర దశాబ్దాలుగా దేశంలో మారుతున్న సంస్కృతి వినిమయమనే విష సంస్కృతి అనీ, దీనికి తిరోగామి లక్షణముందన్నారు. దీనిని అర్థం చేసుకొని దీనికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.మాణిక్యంశెట్టి, వై.మనోహర్, ఎన్.నాగమణి, ఎస్ఎం జయరాజు, రవికుమార్, ఐజయ్య, ఎల్లప్ప పాల్గొన్నారు.

### కడప జిల్లా

## ట్రిపుల్ ఐటీలపై ప్రభుత్వం చిన్నచూపు తగదు

**- ఎమ్మెల్సీ గేయానంద్**

**వేంపల్లె :** ‘ట్రిపుల్ ఐటీలో చదువుకునే విద్యార్థులంతా పేద పిల్లలు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ట్రిపుల్ ఐటీపై చిన్నచూపు చూడటం తగదని పట్టభద్రుల ఎమ్మెల్సీ డా॥ఎం.గేయానంద్ అన్నారు. ఆయన ఇడుపులపాయ ట్రిపుల్ ఐటిని సందర్శించి లెక్చరర్లు, మెంటార్లు, హౌస్‌కీపింగ్ సిబ్బందితో సమావేశం అయ్యారు. ఇక్కడ విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులకూ భద్రత లేదు. దీనివల్ల విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ట్రిపుల్ ఐటీలో పనిచేసే టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. హౌస్‌కీపింగ్ సిబ్బందికి మూడేళ్లుగా ఈపీఎఫ్ చెల్లించడం లేదు. ఇక్కడ ఆసుపత్రిలో వర్కర్లకు వైద్యం అందించడం లేదు. ఇంత అన్యాయం మరెక్కడైనా ఉంటుందా అని ప్రశ్నించారు. ఈ విషయాలన్నింటిపై మండలిలో చర్చించడంతో పాటు మంత్రి గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. దానికి స్పందించకపోతే ఉద్యోగులు చేపట్టే ఆందోళన కార్యక్రమాల్లో తాము పాల్గొంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్‌ను పదిరోజుల్లో చెల్లించకపోతే సమ్మెలోకి దిగుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తెలిపారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శులు మహేష్‌బాబు, శ్రీనివాసులు, ట్రిపుల్‌ఐటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఎస్ఎఫ్ఐ పులివెందుల కన్వీనరు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ నగరశాఖ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ పథక ఆవిర్భావ దినోత్సం

యుటియఫ్ కాకినాడ నగరశాఖ ఆధ్వర్యంలో స్థానిక యుటియఫ్ హోమ్‌లో కుటుంబ సంక్షేమ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరశాఖ అధ్యక్షులు ఆర్.సూర్య చక్రం అధ్యక్షత వహించగా జిల్లాకార్యదర్శి జోగా అప్పారావు, జిల్లా కుటుంబ సంక్షేమ పథకం ప్రధానకార్యదర్శి సిహెచ్.వి.రమణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. “ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని 1995 ఏప్రిల్ 1న యుటియఫ్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి అప్పారి వెంకటస్వామి ఆధ్వర్యంలో అప్పటి సీనియర్ నాయకులు గారా చిట్టిబాబు మరియు ఇతర నాయకులు ప్రారంభించిన కుటుంబ సంక్షేమ పథకం ద్వారా అకాల మరణం చెందిన ఉపాధ్యాయ కుటుంబాలకు తక్షణ ఆర్థికసాయం అందించడం జరుగుతుంది.

పథకం ప్రారంభించిన సమయంలో 45000 రూపాయలు ఆర్థిక సాయం అందించగా నేడు అది 1,50,000 రూపాయలు సహాయంగా అందించడం జరుగుతుంది” అని సంక్షేమ పథకం కార్యదర్శి కె.సువర్ణ రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో అందరు ఉపాధ్యాయులూ చేరాలని సీనియర్ నాయకులు బుర్రా సత్యన్నారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరశాఖ ప్రధానకార్యదర్శి జెవివి సుబ్బారావు, ట్రెజరర్ సిబిఎస్ ఇమ్మాన్యుల్, కార్యదర్శులు జి.గోవిందరావు, బి.రవిశ్రీనివాస, ఐ.శ్రీను మరియు సుమారు 100మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశాఖ జిల్లాలో నూతన పెన్షన్ విధానంపై అవగాహన సదస్సు

యుటియఫ్ ఆధ్వర్యంలో నూతన పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) అవగాహన సదస్సు మార్చి 24న పబ్లిక్ లైబ్రరీలో జరిగినది. ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాము, విజయనగరం జిల్లా ఎన్‌జిఓ నాయకులు ఎల్.యుగంధర్, యుటియఫ్ జిల్లా కార్యదర్శి జాకీర్ ఆలీ, ప్రధానవక్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లాలోని వివిధ మండలాలు నుంచి వచ్చిన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)లోని లోపాలను ఎత్తిచూపారు. కొత్త పెన్షన్ స్కీమ్‌లో మిస్సింగ్ క్రెడిట్స్, మొత్తం బ్యాలెన్స్‌ని ఆన్‌లైన్‌లో చూపించకపోవడం మొదలగు సమస్యలను ఏ రకముగా పరిష్కరించుకోవాలో స్పష్టంగా తెలియజేయడం జరిగింది. సిపిఎస్, వారికి గ్రాట్యుటీ సదుపాయం కల్పించాలని, 2003 డిఎస్‌సి వారికి పాత పెన్షన్ విధానం కల్పించాలి. కొత్త పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అనంతరం యుటియఫ్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్థంతి సభ కార్యక్రమం జరిగింది.

యుటియఫ్ జిల్లా అధ్యక్షులు కెకె జాజులు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్.రామకొండరావు, సహాధ్యక్షులు ఎస్ఎస్ నాగమణి ప్రధానకార్యదర్శి వైఎఆర్‌కె ప్రసాద్ కార్యదర్శులు ఎస్.నాగరాజు, జి.ఉషారాణి పాల్గొన్నారు.

# ప్రశ్నోత్తరాలు



నిర్వహణ : టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,
ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులు
mail : ikyopadhyaya@gmail.com

**ప్రశ్న : నేను పిఇటిగా పనిచేస్తున్నాను. నా పేరు మార్పు కోవాలను కొంటున్నాను. సాధ్యమేనా? వివరించగలరు.**
**- కె.కోటేశ్వరరావు,** కృష్ణా జిల్లా

**జవాబు :** మార్చుకోవచ్చును. జిఓ 102 జిఏడి, తేది.24.04. 1985 ప్రకారం రూ.5/-ల స్టాంపు పేపరు మీద అఫడవిట్ చేయించి, కార్యాలయాధిపతిని, తెలిసిన ఇద్దరితో సాక్షి సంతకాలు చేయించాలి. స్థానిక వార్తా పత్రికలలో మరియు గెజిట్‌లో ప్రచురణ చేయిం చాలి. తగిన ఆధారాలతో మార్పు చేయించుకోవచ్చు.

**ప్రశ్న : ఒక ఉపాధ్యాయుడు 3 నెలలపాటు సస్పెండ్ అయి ఇటీవల జిల్లా విద్యాధికారి అనుమతితో విధులలో చేరారు. సస్పెన్షన్ కాలమునకు ఏ విధమైన నిర్ణయం చేయలేదు. అతనికి ఇంక్రిమెంట్ మంజూరు చేయవచ్చునా?**
**- పి.భాగ్యలత,** అనంతపురం జిల్లా

**జవాబు :** సస్పెన్షన్ కాలాన్ని సెటిల్ చేయకుండా ఇంక్రిమెంట్ మంజూరు చేయుట కుదరదు.

**ప్రశ్న : నేను 24.03.2001న ఉద్యోగంలో చేరాను. 2014లో 20 రోజులు జీత నష్టపు సెలవు పెట్టాను. నా ఇంక్రిమెంట్ ఏప్రిల్‌కు వాయిదా వేశారు. సరియైనదేనా?**
**- కె.సాయికృష్ణ,** అమలాపురం

**జవాబు :** కాదు. ఇంక్రిమెంట్ తేది అయిన మార్చి ఒకటవ తేదీ నుండి 20 రోజులు వాయిదా వేసినా నెల మధ్యలోనే ఇంక్రిమెంట్ ఉంటుంది. కాబట్టి మార్చి 1 నుండే ఇంక్రిమెంట్ యివ్వాలి. ఏప్రిల్‌కు వాయిదా వేయడం సరియైనదికాదు. (జిఓ నం.133; తేది.13.05.1974)

**ప్రశ్న : నేను ఎస్‌జిటి కేడర్‌లో 24 సం॥ల స్కేలు పొందిన తదుపరి 31.01.2009న ఎస్‌ఏగా పదోన్నతి పొందాను. నాకు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 6 సం॥ల స్కేలు నిరాకరించారు. డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లు పాస్‌కానందున ఎస్‌జిటి కేడర్‌లో 24 సం॥లు రికవరి చేస్తామంటున్నారు. నేను రెండు విధాలుగా నష్టపోవాల్సిందేనా?**
**- కె.ప్రభుదాస్,** నల్లజర్ల, పశ్చిమగోదావరి జిల్లా

**జవాబు :** మీరు ఎస్‌జిటి కేడర్‌లో 24 సం॥ల స్కేలు పొందటం వలన ప్రమోషన్ సందర్భంలో ఒక ఇంక్రిమెంట్ మాత్రమే యిచ్చి వేతన స్థిరీకరణ చేసి వుంటారు. మీరు 24 సం॥ల ఇంక్రిమెంట్ రికవరీ కడితే పదోన్నతి సందర్భంలో రెండు ఇంక్రిమెంట్లు, ఎస్‌ఏ కేడర్‌లో 6 సం॥లు పొందవచ్చు. ఆ విధంగా ఒక ఇంక్రిమెంట్ రికవరీ కట్టి రెండు ఇంక్రి మెంట్లు అదనంగాపొందే అవకాశం వుంది.

**ప్రశ్న : ప్రమోషన్ రిలింక్విష్ ఇవ్వడం అంటే ఏమిటి? వ్యక్తిగత కారణములపై పదోన్నతి శాశ్వతంగా నిరాకరిస్తే జరిగే పర్య వసనాలు ఏమిటి?** **- పి.సత్యనారాయణ,** మండపేట

**జవాబు :** రిలింక్విష్ ఇవ్వడం అంటే పదోన్నతికి నిరాకరించడం అని అర్థం. పదోన్నతి శాశ్వతంగా వదులుకుంటే ప్రస్తుత కేడర్‌లో ఏ స్కేలు పొందుతున్నారో అదే స్కేలులో కొనసాగుతారు. తదుపరి ఎఎఎస్ స్కేలు ఇవ్వబడదు.

**ప్రశ్న : మా పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు డిసెంబర్ 9 నుండి 16వరకు సిఎల్ పెట్టారు. డిసెంబర్ 13,14 తేదీలు రెండవ శనివారం, ఆదివారం కూడా సిఎల్‌గా పరిగణిస్తారా?**
**- ఎస్.కె.జిలాని,** వలచర్ల, ప్రకాశం

**జవాబు :** 6 రోజులు మాత్రమే సిఎల్‌గా పరిగణిస్తారు.

**ప్రశ్న : నేను జూన్ 15 నుండి డిసెంబర్ 14వరకు ప్రసూతి సెలవులో వున్నాను. నా యొక్క 15+7+5 సెలవులను వాడుకోవచ్చునా?** **- ఎన్.రమాదేవి,** శ్రీకాకుళం

**జవాబు :** వాడుకోవచ్చును. శాశ్వత ఉద్యోగి దామాషాలోనే వాడు కోవాలనే ఉత్తర్వులు ఏమీ లేవు.

**ప్రశ్న : నేను 2003 డిఎస్‌సి ద్వారా ఎస్‌జిటిగా నియామకం పొంది 2012 డిఎస్‌సి ద్వారా స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాను. ఎస్‌జిటి సర్వీస్ సీనియార్టీకి ఉపయోపడుతుందా?**
**- పిల్లి శ్రీను**

**జవాబు :** పదోన్నతి సందర్భంలో మాత్రమే క్రింది కేడర్ సీనియార్టీ తీసుకోబడుతుంది. మీరు స్కూల్ అసిస్టెంట్‌గా నేరుగా నియామకం పొందినందున, సీనియార్టీ వరకు ఎస్‌జిటి సర్వీస్ ఉపయోగపడదు.

**ప్రశ్న : నేను పిఎఫ్ నుండి తిరిగి చెల్లించే విధంగా ఋణము తీసుకొనియున్నాను. వాయిదాలు పూర్తికాకముందే మరల తీసుకోవచ్చా?** **- బి.నాగేశ్వరరావు,** చిత్తూరు జిల్లా

**జవాబు :** తీసుకోవచ్చు. భవిష్యనిధి నిబంధన 14 ప్రకారం తిరిగి చెల్లించే ఋణం తీసుకున్న సందర్భంలో వాయిదాలు పూర్తికాకముందే, మరల ఋణం కొరకు దరఖాస్తు చేస్తే మిగిలిన ఉన్న బకాయి, కొత్త ఋణం మొత్తం కలిపి వాయిదాలు నిర్ణయిస్తారు.

**ప్రశ్న : నేను ఎస్‌ఏగా పదోన్నతిపొంది, ఎస్‌ఏ కేడర్‌లో 12 సం॥ల సర్వీస్‌పూర్తి చేసియున్నాను. మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో పనిచేస్తున్న నేను 12 సం॥ల స్కేలు పొందటానికి ఏ పరీక్ష పాస్‌కావాలి? 50 సం॥లు వయస్సు నిండినందున మినహాయింపు ఉన్నదా? అర్హత పరీక్ష పాస్ అయిన తేదీ నుండి 12 సం॥ల స్కేలు ఇవ్వవచ్చా?**
**- పి.ఎస్.గురుమూర్తి,** కర్నూలు జిల్లా

**జవాబు :** మున్సిపల్ ఉపాధ్యాయులు ఎస్‌ఏ కేడర్‌లో 12 సం॥ల స్కేల్ పొందాలంటే హెచ్ఎం అక్కౌంట్ టెస్ట్ పాస్ కావాలి. చివరి పరీక్ష వ్రాసిన మరుసటి రోజు నుండి 12 సం॥ల స్కేలు యివ్వాలి (జిఓ నం.270 జిఏడి; తేది.30.04.84) జిఓ 93 ఆర్థిక, తేది.03.04.2010 నందు ప్రమోషన్‌కి వర్తించే రాయితీలన్నీ ఎఎఎస్‌కు వర్తిస్తాయని యివ్వ బడింది. అయితే తదుపరి ఆర్థికశాఖ యిచ్చిన మెమో నం. 34408; తేది.04.02.2012లో రెండవ ప్రమోషన్ పోస్టు స్కేలు కొరకు వయస్సు మినహాయింపు వర్తించదని పేర్కొనబడింది.

**ప్రశ్న : ఏ,బి అనే ఉపాధ్యాయులు 2009లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌గా పదోన్నతి పొందినారు. నెల్లూరు జిల్లాలో 2009లో పదోన్నతి పొందిన వారికి తాత్కాలిక స్థానాలు కేటాయించి, తదుపరి బదిలీ కౌన్సిలింగ్ ద్వారా బదిలీ నిర్వహించారు. తదుపరి రేషనలైజేషన్‌లో తాత్కాలిక సర్వీసును కూడా లెక్కిస్తారా? - సిహెచ్.పెంచలయ్య,** నందవరం, నెల్లూరు జిల్లా

**జవాబు :** రేషనలైజేషన్ చేసే సందర్భంలో ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం పాఠశాల సర్వీస్ కాకుండా కేడర్ సర్వీసులో సీనియార్టీని బట్టి సీనియర్, జూనియర్ నిర్ణయిస్తారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు

**శ్రీకాకుళం జిల్లా**

మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా యుటియఫ్ మహిళా విభాగం, ఐద్వా, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, సిఐటియుల ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ సహాధ్యక్షురాలు వాగ్దేవి అధ్యక్షతన సదస్సు జరిగింది. ముఖ్య అతిథి డిఇఓ ఎస్. అరుణకుమారి మాట్లాడుతూ మహిళలు ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యను పట్టుదలతో పూర్తి చేస్తేనే సమాజంలో ఉన్నత స్థానాన్ని సాధించు కోగలుగుతారన్నారు. ఐద్వా నాయకురాలు శ్రీదేవి పాణిగ్రాహి ఉద్యమాల్లో తమ అనుభవాలను వివరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి అసంఘటిత రంగంలో మహిళల స్థితిగతులు మారాలన్నా, సమాన పనికి సమానవేతనం సాధించాలన్నా పోరాటాలు చెయ్యక తప్పదన్నారు. హిమప్రభ మాట్లాడుతూ పోరాటాలు చేసే మహిళలకు పురుషులు కూడా సహకరిస్తే అవి తప్పక విజయవంత మవుతాయన్నారు. యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి.రామలక్ష్మి మాట్లాడుతూ మహిళల్లో పోరాడే చైతన్యం పెరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని- మహిళలు అన్ని స్థాయిలలో వివక్షతకు, యిబ్బందులకు గురి అవుతున్నారన్నారు. యుటియఫ్ మహిళా కన్వీనరు బి.విజయకుమారి పోరాటాలు చేస్తూ, సంఘాల్లో పనిచేస్తున్న మహిళలను సాటి మహిళలే విమర్శించడంపై ఆవేదన వ్యక్తం చేసారు.

యుటియఫ్ జిల్లా సహాధ్యక్షురాలు వాగ్దేవి మహిళల భద్రతను ప్రభుత్వం ప్రత్యేక అంశంగా పరిగణించి, బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. "ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి" అనే జనవిజ్ఞాన వేదిక బుక్‌లెట్‌ని డిఇఓ ఆవిష్కరించారు. యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర, జనవిజ్ఞాన వేదిక నాయకులు కూర్మా రావు సందేశాలిచ్చారు. యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు కిషోర్‌కుమార్, మండల యుటియఫ్ మహిళా కమిటీ ప్రతినిధులు ధనలక్ష్మి, శైలజ, ఎర్రమ్మ, సుబ్బలక్ష్మి, భారతి, లక్ష్మి, భారతి, రమణమ్మ, వసుంధర, ఆదిలక్ష్మి వివిధ రంగాలకు చెందిన మహిళలూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**నర్సన్నపేట**



నర్సన్నపేట మండల మహిళా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 3న మహిళా దినోత్సవ సదస్సు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.ఉమాకుమారి అధ్యక్షతన జరిగింది. ప్రధానవక్తగా జిల్లా సహాధ్యక్షురాలు వాగ్దేవి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. దేశం ప్రగతి పథంలో ప్రయాణించాలంటే మహిళలు మరింత చైతన్యవంతం కావాలని, పోరాటాలు, ఉద్యమాలలో విధిగా పాల్గొనాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రాష్ట్ర మహిళా ఉద్యోగులకు 2 సం॥ల చైల్డ్‌కేర్ లీవ్ సాధనలో యుటియఫ్ పాత్ర గురించి జిల్లా యుటియఫ్ మహిళా కన్వీనర్ బి.విజయకుమారి వివరించారు. ఆర్థికంగా, సామాజికంగా మహిళలు మరింత రాణించాలని జిల్లా కార్యదర్శి ఆర్.ధమయంతి వివరించారు. మండలశాఖ అధ్యక్షులు జె.చిన్నారావు వందన సమర్పణ చేశారు. ఈ సదస్సులో నర్సన్నపేట, పోలాకి, జలుమూరు మండల మహిళా ఉపాధ్యాయులతోపాటు ఆయా మండల శాఖల అధ్యక్ష కార్యదర్శులతోపాటు టి.ఎర్రమ్మ, బి.లోలాక్షి, ఎం.రాజా రత్నం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల మహిళా కమిటీ ఎన్నిక చేయబడినది. మహిళా కమిటీ : కన్వీనర్ ఆర్.ధమయంతి, కో-కన్వీనర్ ఎం.రాజారత్నం, సభ్యులు టి.ఎర్రమ్మ, బి.లోలాక్షి, వై.సుభాషిణి.

**రాజాం :** యుటియఫ్ రాజాం మండలం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మార్చి 7న జిల్లా కౌన్సిలర్ వి.రాజేశ్వరి అధ్యక్షతన మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. మండల విద్యాశాఖాధి కారి ఆర్‌విజెఆర్ రాజు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మహిళలను గౌరవించడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు మాట్లాడుతూ మహిళలు నిర్ణయాలు తీసుకోవడంలో స్వేచ్ఛ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజాం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బొద్దాం, బాలికోన్నత పాఠశాల సారథి ప్రధానోపాధ్యాయులు కె.మంజులారాణి, దుర్గమ్మ, టి.పద్మావతి లను సన్మానించారు. సుమారు 70మంది మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బి.సునీత, ఎన్.అచ్చుతకుమారి, సునీతాజోషెఫ్, ఆర్.తేజోవతి, ఆర్.రూపవతి, రోజా, కమలకుమారి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు. మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.నీలయ్య, వి.శివరాంనాయుడు, కె.తిరుపతిరావు, ఎం.కృష్ణమూర్తి, పి.సురేష్ కుమార్ తదితర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

**వంగర :** మహిళా దినోత్సవ వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంగరలో మీగడ రమాదేవి అధ్యక్షతన జరిగాయి. మండల విద్యాశాఖాధికారి కె.పున్నయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యతోనే మహిళాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా దినోత్సవ వ్యాసరచన పోటీలో బహుమతి సాధించిన పి.శిరీష, ఉత్తమ మహిళ వి.ఉషారాణిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటరావు, పి.వాసు, పి.మురళి, కె.రమణలతో పాటు సుమారు 40మంది మహిళలు పాల్గొన్నారు.

**విజయనగరం జిల్లా**

విజయనగరం జిల్లాలో మార్చి 8న మహిళా టీచర్లతో, విద్యార్థి నులతో యుటియఫ్ ఆధ్వర్యంలో కొన్ని ప్రాంతాల్లో ఐద్వా, సిఐటియుల తో కలసి కొన్ని ప్రాంతాలలో మహిళా సదస్సులు జరిగాయి.

**బొబ్బిలి :** యుటియఫ్ బొబ్బిలి మండల సహాధ్యక్షులు ఇ.దేవి అధ్యక్షతన మహిళా టీచర్ల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యవక్తగా రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి పాల్గొని ప్రసంగించారు. ఐక్యరాజ్య సమితి ప్రతియేటా మహిళలు విధిగా సాధించుకోవలసిన అంశాల గురించి

ప్రకటిస్తుందని, ప్రధానంగా ఆందోళన కలిగించే అంశాలపై ఉద్యమిం చాల్సిన అవసరం ఉందన్నారు. లింగవివక్షత, వేధింపులు, అత్యా చారాలు వంటి వాటిపై సామాజిక ఉద్యమాలు అవసరం అన్నారు.

బొబ్బిలి మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ విద్య, సామాజిక అంశాలపట్ల యుటియఫ్ చేస్తున్న కృషిని కొనియాడారు. సమాజంలో వేళ్లూనుకొని ఉన్న సాంఘిక దురాచారాలను అందరం కలిసి ఎదుర్కో వాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్. మురళీమోహన్, ఎంఇఓ కెవిఎల్ ప్రసాద్, జిల్లా నాయకులు పి.మధు, వి.ప్రసన్న, ప్రధానోపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, కెజిబివి ఎస్ఓ స్వప్న, 5 మండలాల సహాధ్యక్షులు కె.జ్యోతి, కె.లక్ష్మి, పద్మావతి, విజయమ్మ, ఉషారాణిలతోపాటు మహిళా టీచర్లు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**పార్వతీపురం :** పార్వతీపురం సిఐటియు కార్యాలయంలో యుటియఫ్, సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో ఉమ్మడిగా సదస్సును నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రముఖ సాహితీవేత్త, రచయిత గంటేడ గౌరునాయుడు, యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి, వర్కింగ్ ఉమెన్ జిల్లా నాయకులు బి.లక్ష్మిలు పాల్గొని ప్రసంగించారు. 33% రిజర్వేషన్ అమలు, చట్టాలను సమర్ధవంతంగా అమలు చేయాలని, విద్యను దూరం చేసే క్లస్టర్ స్కూల్స్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్.మురళి, జిల్లా కార్యదర్శి టి. రమేష్, యుటియఫ్ మహిళా నాయకులు టి.జ్యోతి, పద్మావతి, జయ లక్ష్మిలతో పాటు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మక్కువ :** మండల యుటియఫ్ నాయకులు సుగుణ కుమారి అధ్యక్షతన జరిగిన సదస్సులో మహిళా సాధికారతకు, ఉన్నత స్థానానికై ఉద్యమిం చాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ సదస్సులో రాష్ట్ర సహాధ్యక్షులు కె. విజయగౌరి ఉద్యమాల ఆవశ్యకతను వివరించారు. అనంతరం తెలుగు టీచర్ రమణమ్మ, సోషల్ టీచర్ దేముడమ్మ మాట్లాడిన అంశాలపై ఆసక్తిగా చర్చ జరిగింది. సముదాయ చైర్మన్లు అన్నపూర్ణ, పద్మావతిలు, ఎంఇఓ మల్లేశ్వరరావు, ఏపిటిఎఫ్ నాయకులు చంద్రశేఖర్, యుటియఫ్ నాయకులు పి.మధుసూదనరావు, పోలినాయుడు, రామకృష్ణ, మురళీ, రాంబాబు, ప్రసాద్‌లతోపాటు 80మంది మహిళా టీచర్లు, 30మంది డిగ్రీ విద్యార్థినులు పాల్గొన్న సదస్సు ఆద్యంతం ఆసక్తికరంగా జరిగింది.

### మహిళా సదస్సుల సందర్భంగా ఆకట్టుకున్న ఎగ్జిబిషన్

మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించు కొని బొబ్బిలి, మక్కువ, పార్వతీపురంలలో మహిళలకు సంబంధించిన ఎగ్జిబిషన్ స్టాల్సును ఏర్పాటు చేశారు. యుటియఫ్ మండల నాయకత్వాలు 200పైగా అంశాలు ప్రదర్శించారు.

**ప్రదర్శనలో ఆకట్టుకున్న అంశాలు :**

1. 1857లో ప్రపంచవ్యాప్తంగా మహిళలు చేసిన వీరోచిత పోరాటాలు - ఫలితాలు - చట్టాలు
2. జాతీయ మహిళా నాయకుల జీవిత చిత్రాలు - కథనాలు
3. సమాజ పరిణామక్రమంలో స్త్రీల పాత్ర
4. ఉద్యోగాలు మాని ఉద్యమాలలోనికి వెళ్లిన మహిళా నాయకుల గాథలు
5. అక్షరాస్యత, విద్య, ఉపాధి, ఉద్యోగ స్థానాల గణాంకాలు
6. లింగ వివక్షత, జనాభా గణాంకాలు
7. స్ఫూర్తి ప్రదాతలు : కల్పనా చావ్లా, సావిత్రిబాయిపూలే, కెప్టెన్ లక్ష్మీసెహగల్, చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, సరోజినీ నాయుడు, మలాలా, సంతోషి వంటి వారి చిత్ర మాలికలు - జీవిత నేపథ్యాలు.

మహిళా టీచర్లు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. బొబ్బిలిలో మున్సిపల్ కమీషనర్ హెచ్.శంకరరావు, మక్కువలో విజయగౌరి, పార్వతీపురంలో ఎస్.మురళీమోహన్‌లు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. తిలకించిన వారంతా తెలియని ఎన్నో అంశాలు, విలువైన అంశాలను ఈ ఎగ్జిబిషన్ ద్వారా తెలుసుకున్నామని అనంతరం జరిగిన సదస్సులలో వారి అభిప్రాయాలను తెలియజేశారు.

**పూసపాటిరేగ :** పూసపాటిరేగ మండలంలో యుటియఫ్ ఆధ్వర్యంలో మహిళా టీచర్ల సదస్సు జరిగింది. ఈ సదస్సు సుబ్బలక్ష్మి అధ్యక్షత వహించగా జ్యోతిర్మయి నిర్వహించారు. సదస్సులో వక్తలుగా రాష్ట్ర కార్యదర్శి డి.రాము, జిల్లా సహాధ్యక్షులు జి.నిర్మల పాల్గొని మాట్లాడారు. లింగవివక్షత నిర్మూలన, సమాన అవకాశాలు, రిజర్వేషన్లు వంటివి పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎస్.వెంకటరావు, నీలకంటేశ్వరరావు, రమణమూర్తి, మహిళా టీచర్లు పాల్గొన్నారు.

**భోగాపురం :** భోగాపురం మండల కేంద్రంలో మహిళా టీచర్ల సదస్సు యుటియఫ్ ఆధ్వర్యంలో మహాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో జిల్లా సహాధ్యక్షులు జి.నిర్మల, జిల్లా కార్యదర్శి ఇ.రాములప్పుడు పాల్గొని మాట్లాడారు. బాలికా విద్య ప్రాముఖ్యతను, నేటి విద్యారంగ సంస్కరణలు గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా టీచర్లు, యుటియఫ్ మండల నాయకత్వం వెంకటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం :** యుటియఫ్, సిఐటియు, ఐద్వా మూడు సంఘాలు ఉమ్మడిగా మార్చి 8న మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో యుటియఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.నిర్మల, సిఐటియు నాయకులు ఎం.ఉమామహేశ్వరి, ఐద్వా నాయకులు రమణమ్మ, వర్కింగ్ ఉమెన్ నాయకులు సుధారాణిలు ప్రసంగించారు. ప్రధానంగా ఆధునిక సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారానికి ప్రభుత్వాలు సిద్ధంగా లేవని సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, ఉపాధులు సన్నగిల్లుతున్నాయని అన్నారు. సాధికారిత కోసం అందరం ఉమ్మడి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

### విశాఖపట్నం జిల్లా

యుటియఫ్ విశాఖపట్టణం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిఐటియు కార్యాలయ ంలో మహిళా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఎ.నిర్మలా అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎ.విజయకుమారి (ఆనందపురం), ఎం.పుష్ప (పెదగంట్యాడ) ముఖ్య వక్తలుగా వ్యవహరించారు. యుటియఫ్ తరపున రాష్ట్ర కార్యదర్శి డి.రాము, యుటియఫ్ విశాఖ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.జాజులు, వైఏఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశమునకు అధ్యక్షత వహించిన ఎ.నిర్మల మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఉద్యోగులుగా ఉన్న మహిళలకు అనేక సమస్యలు ఎదురౌతున్నాయని, వాటి పరిష్కారానికి మహిళలు ముందుకు వచ్చి ఐకమత్యంతో పోరాడాలని, మెరుగైన సమాజం కోసం మహిళ లందరు

పాటుపడాలని కోరారు. ఎ.విజయకుమారి మాట్లాడుతూ మహిళల పట్ల వివక్షత నిర్మూలించడానికి ఉన్న అన్ని చట్టాలను పటిష్టంగా అమలుపరచాలని కోరారు. ఎం.పుష్ప మాట్లాడుతూ వివక్షతకు గురైన, అత్యాచారానికి గురైన మహిళల పట్ల ప్రభుత్వం తీసుకొనే చర్యలు త్వరితగతిన ఉండాలని, అందుకు బాధ్యులైన నేరస్తులపై తక్షణమే చర్యలు తీసుకొన్నట్లయితే భవిష్యత్తులో అటువంటివి పునరావృతం కాకుండా ఉంటాయని తెలిపారు.

రాష్ట్ర కార్యదర్శి డి.రాము మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక పథకాల గురించి మహిళలకు తెలియపరచవలసిన అవసరాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతము సమాజంలోను, ఉద్యోగాలలోను 40%గా ఉన్న మహిళలు ఉద్యమించకపోతే సమాజం కోసం చేసే పోరాటాలు సఫలీకృతం కావని, అందువలన మహిళలు అన్ని ఉద్యమాలలో ముందుండాలని కోరారు. యుటియఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులకు, బాలికలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పాఠశాలల్లో కల్పించవలసిన కనీసబాధ్యత ప్రభుత్వానిదని తక్షణమే ప్రభుత్వం స్పందించి వాటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన చైల్డ్‌కేర్ లీవ్‌ను రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.స్వర్ణలత, ఆనందపురం, అన్నపూర్ణ నక్కపల్లి, కమలరత్నం, భీమిలి ప్రసంగించారు.

యుటియఫ్ మహిళా కమిటీ ఏర్పాటు చేయడమైనది. కన్వీనర్‌గా జి.ఉషారాణి, ఐవిఎస్ ఉమ, ఎస్.విజయలక్ష్మి, ఎ.విజయ కుమారి, కె.స్వర్ణలత, ఎస్.పద్మ, ఎ. నిర్మల, డివి నరసయ్యమ్మ, టి. సత్యవతి, ఎస్.పుణ్యవతిలను సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేయడమైనది.

### తూర్పుగోదావరి జిల్లా

తూర్పుగోదావరి జిల్లాలో యుటియఫ్ ఆధ్వర్యంలో మార్చి 6న వివిధ ప్రాంతాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సులు నిర్వహించారు.

**అమలాపురం :** మార్చి 6న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అమలాపురంనందు, మండల అసోసియేట్ అధ్యక్షురాలు పి.శిరోమణి, అంతర్జాతీయ మహిళాదినోత్సవ సదస్సుకు అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా యుటియఫ్ జిల్లా మహిళా కన్వీనర్ ఎం.విజయగౌరి విద్యారంగ పరిణామాలు, క్లస్టర్ స్కూళ్ళ స్వరూపం, మహిళా టీచర్లు తీసుకోవలసిన కర్తవ్యాలు గురించి ఉపన్యసించారు. ఐద్వా నుండి టి.రమణి ప్రసంగించారు. యుటియఫ్ సబ్ కమిటీ నాయకులు కె.రత్నకుమారి, పి.ఇందిర, ఆర్.శ్రీదేవి, ఎం.రంగమహాలక్ష్మి ప్రసంగించారు. అమలాపురం డివిజన్ స్థాయిలో మండల పట్టణ కేంద్రాల నుండి 85మంది మహిళా టీచర్లు హాజరయ్యారు. పాటలు, వక్తృత్వం, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

**కాకినాడ :** మార్చి 8న కాకినాడ వివిఎస్ఆర్ హొమ్‌నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ఐద్వా నాయకులు టి.సావిత్రి అధ్యక్షత వహించగా, ప్రధానవక్తలుగా జిల్లా కార్యదర్శి వి.సోనీ, జిల్లా మహిళా ఉపసంఘం నాయకులు ఎం.రూపవాణి, జిడికె కుమారి, కె.విజయకుమారి, టి.అన్నపూర్ణ, అంగన్వాడీ నాయకులు కె.బేబీరాణి, ఎస్.వీరలక్ష్మి ప్రసంగించారు. కాకినాడ డివిజన్ స్థాయిలోని మండల, పట్టణ కేంద్రాల నుండి 68మంది మహిళా టీచర్లు హాజరయ్యారు.

**రాజమండ్రి :** సీతానగర ఉన్నత పాఠశాలనందు మండల మహిళా కన్వీనర్ ఆర్‌పి దేవవాణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ప్రధానవక్తలుగా జిల్లా మహిళా కన్వీనర్ ఎం.విజయ గౌరి మరియు యుటియఫ్ నాయకులు ఎస్.కరుణ, టి.స్వర్ణలత, ఎం. శ్రీలక్ష్మి, టి.ఉషారాణి ప్రసంగించారు. రాజమండ్రి డివిజన్ స్థాయిలో మండల, పట్టణ కేంద్రాల నుండి 95మంది మహిళా టీచర్లు హాజరయ్యారు. డిబేటింగ్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

**రంపచోడవరం :** ఎంఆర్‌సి ఆవరణలో యుటియఫ్ వైస్ ప్రెసిడెంట్ ఇ.శ్రీమణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ప్రధానవక్తలుగా గిరిజన సంఘం ఉపాధ్యక్షురాలు పి. రమణమ్మ, ఐటిడిఏ నాయకురాలు పి.కమలారత్నం, ఎం.ఎల్.ఎ.వి. రాజేశ్వరిలు ప్రసంగించారు. కె.జ్యోతి, సిహెచ్.కళావతి, ఎస్.రత్నకుమారి డి.మంజుల, పి.ప్రేమకుమారి, ఆర్.వెంకటలక్ష్మిలు ప్రసంగించారు. దేవిపట్నం, రంపచోడవరం మండలాల నుండి 120మంది మహిళా టీచర్లు హాజరయ్యారు.

**కొత్తపేట :** బాలికల పాఠశాల కొత్తపేటనందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు నిర్వహించారు. మండల మహిళా కన్వీనర్ జిహెచ్ఎమ్‌పి ఇందిరాబాయ్ సభకు అధ్యక్షత వహించారు. ప్రధానవక్తగా జిల్లా మహిళా కన్వీనర్ ఎం.విజయగౌరి ప్రసంగించారు. యుటియఫ్ నాయకులు పి.వెంకటక్ష్మి, కె.అరుణశ్రీ, ఆర్.అనేమార్త, ఎం.రాధాకుమారి, ఎం.నాగేశ్వరి, డి.లలితాకుమారి, ఎన్.జీవనలత ప్రసంగించారు. బి. మాణిక్యం, డిజెపి కుమారి, కె.విజయలక్ష్మి, కె.మేరీగోల్డ్, సిహెచ్. జ్యోతిబాయ్, ఎస్.శకుంతల, 65మంది మహిళా టీచర్లు హాజరయ్యారు. డిబేటింగ్, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

**గోకవరం :** మానవ వనరుల కార్యాలయంలో జిల్లా కౌన్సిలర్ డి.శ్రీలక్ష్మి బాయ్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా జిల్లా కార్యదర్శి ఎం.విజయగౌరి ప్రసంగించారు. యుటియఫ్ నాయకులు వి.సుబ్రహ్మణ్యేశ్వరిదేవి, కె.వి.లీలావతి, ఎస్.సత్యవతి, ఎం.విజయలక్ష్మి, ఎన్.ఉషాదేవి, కె.రాజేశ్వరి ప్రసంగించారు. 62మంది మహిళా టీచర్లు హాజరయ్యారు.

**మామిడి కుదురు :** ఎంఆర్‌సి కార్యాలయంనందు మండల సహాధ్యక్షురాలు బి.సువర్ణ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ప్రధానవక్తగా జిల్లా మహిళా ఉపసంఘం నాయకురాలు కెఎన్‌బి లక్ష్మి ప్రసంగించారు. యుటియఫ్ నాయకులు ఏవి శ్యామలావతి, కెఎస్‌వి లక్ష్మి, అంగన్వాడీ నుండి టి.సూర్యాకాంతం, ఎన్.అన్నపూర్ణ ప్రసంగించారు. 48మంది మహిళా టీచర్లు హాజరయ్యారు.

**పి.గన్నవరం :** ఎంపిపి స్కూల్‌నందు కె.వాణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ప్రధానవక్తలుగా యుటియఫ్ నాయకులు కె.జ్యోతి, బి.చిట్టితల్లి, సిహెచ్‌వి రామలక్ష్మి ప్రసంగించారు. పి.అరుణ కుమారి, జి.జ్వాల, ఎస్.వరలక్ష్మి, కె.దుర్గాదేవి, సిహెచ్. పద్మావతి, సిహెచ్.వి.కె.దుర్గ, డి.రమాబాయ్, 30మంది మహిళా టీచర్లు హాజరు అయ్యారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

**అంబాజీపేట :** ఎమ్‌పిపి పాఠశాలనందు యుటియఫ్ జిల్లా కౌన్సిలర్ కెఎన్‌బి లక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు జరిగినది. ప్రధానవక్తలుగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎ.సుజాత, తెలుగు లెక్చరర్ వి.సుబ్బలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎం.విజయగౌరి ప్రసంగించారు. యుటియఫ్ నాయకులు ఎన్ఎన్‌జి భవాని, కె.శ్రీదేవి, కె.సుధ, వై.నాగమణి మరియు 55మంది మహిళా టీచర్లు పాల్గొన్నారు.

**తుని :** గుర్రాలతోట స్కూల్‌నందు మండల కార్యదర్శి బి.పద్మావతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ప్రధానవక్తలుగా జిల్లా ఉపసంఘం సభ్యురాలు జి.అమ్మతల్లి, జిహెచ్ఎం టి.పద్మజ, జిహెచ్ఎం గీతాదేవి ప్రసంగించారు. యుటియఫ్ నాయకురాలు కె. మహేశ్వరి, టి.లలితమ్మ, 52మంది మహిళా టీచర్లు పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లా

మహిళల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలకు మహిళలంతా సన్నద్ధం కావాలని పలు రంగాలకు చెందిన మహిళలు ఐద్వా, యుటియఫ్, సిఐటియు, శ్రామిక మహిళా నగర కమిటీల ఆధ్వర్యంలో యుటియఫ్ ఆఫీసు, కృష్ణ జిల్లా విజయవాడనందు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వమించడమైనది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పి.లీలా మాట్లాడుతూ "మహిళల రక్షణకు రాజ్యాంగబద్ధంగా వచ్చిన హక్కుల అమలుకు పరిరక్షణకు పోరాడాల్సిన పరిస్థితులు నేటి సమాజంలో ఉండటం సిగ్గుచేటు. సాంకేతికంగా, ఎంత అభివృద్ధి చెందినా, మహిళలు ఇంకా అణచివేతకు గురవుతున్నారు. నిర్భయ వంటి చట్టాలు సైతం పటిష్టంగా అమలుకాకపోవడంతో దేశవ్యాప్తంగా మహిళలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయి. పాలకులు మహిళల హక్కులను కాలరాసే తరుణంలో మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలి" అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు కె. భగీరధి, జిల్లా కార్యదర్శులు శాంతికుమారి, అనురాధ, మండల మహిళా ప్రతినిధులు ఉపాధ్యాయులు, జన విజ్ఞానవేదిక కన్వీనర్ సుమలత పాల్గొన్నారు.

**పెనమలూరు :** ఎంపియుపి స్కూల్ పెదపులిపాకనందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆ గ్రామంలో ఉన్న పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్స్, పంచాయితీ బిఆర్‌ఓ (మహిళ), హెల్త్ సూపర్ వైజర్, పాఠశాల ఆయా, మధ్యాహ్నభోజన ఏజెన్సీల వారితో సమావేశం ఏర్పాటుచేసి మహిళలు ఆయా రంగాలలో ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడమైనది. పనిచేస్తున్న చోట కొందరు వివక్షతకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్రకార్యదర్శి పి.లీల, భగీరధి, మాధవి, సరోజ, సునీత, లత పాల్గొన్నారు.

**పటమట :** మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, బాలికల మరుగుదొడ్ల నిర్మాణ, నిర్వహణ గురించి ఉపాధ్యాయులతో చర్చించడమైనది. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహిళలపై జరుగుతున్న దాడులు, వివక్షత గురించి ప్రస్తావించారు. యుటియఫ్‌గా మహిళా పోరాటాలు పిలుపుపై తప్పక స్పందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కె.సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పి.లీల, జిల్లా సహాధ్యక్షురాలు కె.భగీరధి, విజయవాడ సిటీ బాధ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా

**గుంటూరు :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా యుటియఫ్ మహిళా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 1న వర్క్‌షాప్ నిర్వహించబడింది. ఈ వర్క్‌షాప్‌లో జిల్లాలోని వివిధ మండల శాఖల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి ప్రసంగిస్తూ మహిళ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కంచబడాలంటే ఉపాధ్యాయ ఉద్యమంలో మహిళల పాత్ర పెరగాలన్నారు. జిల్లా కార్యదర్శి బి.ఆదిలక్ష్మి ప్రసంగిస్తూ మహిళా సాధికారత పెంపొందించడానికి ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. మరో జిల్లా కార్యదర్శి జి.శివపార్వతి ప్రసంగిస్తూ పాఠశాలల్లో మహిళ ఉపాధ్యాయులకు, బాలికలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఇంకా యుటియఫ్ మహిళా నాయకులు పి.కృష్ణ తులసి, కె.ఎస్.వరలక్ష్మీకుమారి, ఏ.నాగకుసుమ కుమారి, పి.పుష్పవతి, కె.గణేష్‌కుమారి, డి.సులోచన తదితరులు పాల్గొన్నారు.

**మంగళగిరి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న మంగళగిరిలోని పెన్షనర్స్ హోమ్‌లో యుటియఫ్ మంగళగిరి మహిళా కమిటీ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ సదస్సు జరిగింది. సదస్సుకు యుటియఫ్ మంగళగిరి మండలశాఖ అధ్యక్షురాలు ఏ. నాగకుసుమకుమారి అధ్యక్షత వహించారు. సదస్సులో ఐద్వా కార్యదర్శి సి.వనలక్ష్మి ప్రసంగిస్తూ లింగ వివక్షత ఏ స్థాయిలో ఉన్నా అంతమొం దించాలని, స్త్రీలను ప్రోత్సహిస్తే పురుషులతో సమాన విజయాలను సాధించగలరన్నారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి బి.ఆదిలక్ష్మి ప్రసంగిస్తూ మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. పాఠశాలల్లో బాలికలకు, టీచర్లకు మరుగుదొడ్లు ప్రత్యేక విశ్రాంతి గదులు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. సదస్సులో మండల విద్యాశాఖాధికారి పి.శ్రీనివాసరావు, యుటియఫ్ మహిళా నాయకులు బి.నిర్మలకుమారి, పి.పుష్పవతి, ఎం.ఉమశ్రీ తదితరులు పాల్గొని ప్రసంగించారు. 60మంది మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**తుళ్ళూరు**




యుటియఫ్ తుళ్ళూరు మండల శాఖ ఆధ్వర్యంలో మార్చి 9న తుళ్ళూరు మండల విద్యా వనరుల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు ఘనంగా జరిగింది. మండలంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలలోని ఉపాధ్యాయినులు పెద్దయెత్తున పాల్గొన్నారు. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఆర్.పుణ్యవతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు మాట్లాడుతూ కేవలం మహిళా దినోత్సవాలు మొక్కుబడిగా జరుపుకోవడం కాక

మహిళాభ్యుదయానికి సాధికారతకు సోపానంగా మార్చుకోవాలని అన్నారు. మహిళలపై జరిగే అకృత్యాలను అరికట్టానికి చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. అనంతరం పలు సాంస్కృతిక, క్రీడా పోటీలు నిర్వహించారు. దాతల సహాకరంతో విజేతలకు బహుమతులు సమావేశానికి వచ్చేసిన మహిళలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమ నిర్వహణకు స్థానిక యుటియఫ్ కార్యకర్తలు సహకరించారు.

## ప్రకాశం జిల్లా

**కారంచేడు :** రామానాయుడు స్టేడియంనందు యుటియఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. యుటియఫ్ మహిళా ఉపాధ్యక్షులు జానమ్మ అధ్యక్షత వహించారు. సభలో ఎంఇఓ కెజె జయరాజ్, జెడ్‌పిటిసి, ఎంపిపి మరియమ్మ, జెడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం సుబ్రహ్మణ్వేశ్వర రావు, జిల్లా జెవివి ప్రధానకార్యదర్శి కుర్రా రామారావు, యుటియఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రామారావు మాట్లాడుతూ సమాజంలో జరిగే అకృత్యాలపై మహిళా ఉపాధ్యాయుల స్పందన నామమాత్రంగా ఉందని ఉపాధ్యాయినిలు ఉన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థినులకు సమాజంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులు వివరించాలన్నారు. ఎంఇఓ చేతులమీదుగా ఆటల, పాటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

**ఇంకొల్లు :** ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండల యుటియఫ్‌శాఖ మహిళా విభాగం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహిం చింది. కార్యక్రమానికి సీనియర్ ఉపాధ్యాయిని జి.దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించగా మండల ఎంపిపి మెహర్‌తాజ్, మహిళా వైద్యులు జి. విజయలక్ష్మి, జి.శోభారాణి, ఎంఇఓ జి.హరిబాబు హాజరయ్యారు. ఆత్మీయ అతిథులుగా పి.హైమావతి, ఎం.వీరుళ్ళు, పి.కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు. సమాజంలో మహిళల పట్ల జరుగుచున్న అత్యాచారాలు పెరగడానికి కారణం చట్టాలు అమలుతీరు సరిగా లేకపోవడమేనని వక్తలు అన్నారు. అందువలన మహిళలలో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమం తర్వాత మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమాలను నిర్వహించుటలో యుటియఫ్ మహిళా సభ్యులు వి.ఉదయకుమారి, కెజెఆర్ కుమారి, కె.పుష్పావతి, జె.అనిత, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు యు.చెంచయ్య, మండలశాఖ బాధ్యులు జి.ప్రభాకర్, బి.హనుమంత రావు, టి.శ్రీనివాసరావు, పి.హరిబాబు, సిహెచ్.శివరామకృష్ణ, సిహెచ్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా

**కావలి :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 6న కావలి పెన్షనర్స్ భవనంనందు జరిగింది. యుటియఫ్ కావలి ప్రాంతీయ మండలాలు, జెవివి, ఐద్వా, సిఐటియుల ఆధ్వర్యంలో మహిళలకు ఆటలు, పాటల పోటీలు మరియు మహిళా సదస్సు నిర్వహించారు. ఆటల పోటీలను స్థానిక కౌన్సిలర్ పి.అనురాధ మరియు బోగోలు ఎంపిపి పి.సరోజనమ్మ ప్రారంభించగా కావలి ఎంపిపి పి.మహేశ్వరి సదస్సులో పాల్గొని మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.శ్రీదేవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహిళల సమస్యల చర్చావేదికగా మహిళా దినోత్సవాలు నిర్వహించుకోవడం అవసరమన్నారు. మత ఛాంధసవాద దేశాలలో మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉందని ప్రపంచవ్యాప్తంగా మహిళలు సంఘటితంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

యుటియఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అజయ్ సంపత్‌కుమారి మాట్లాడుతూ మహిళా కార్మికుల త్యాగఫలితంగా మనం కొన్ని హక్కులైనా పొందగలిగామని వారి పోరాట స్ఫూర్తితో మరింత మెరుగైన పరిస్థితుల కోసం పోరాడాలని చెప్పారు. సదస్సులో ముఖ్య వక్తగా పాల్గొన్న ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ నేటి తరం యువతుల ఆలోచనా ధోరణిలో వచ్చిన మార్పుకనుగుణంగా యువకులు కూడా మారాలని, స్త్రీ సమానత్వాన్ని అంగీకరించక తప్పదన్నారు. మహిళలు చేసే ఇంటిపనికి గుర్తింపులేదని అన్ని రంగాలలో మహిళలు వివక్షతకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వాలు అసంఘటిత రంగంలోని మహిళలకు రక్షణ, కనీస వేతనాలు, పెన్షన్ వంటి సౌకర్యాలు కల్పిం చాలన్నారు.

శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి రెహానా బేగం మాట్లాడుతూ గతంలో యిచ్చిన హామీ మేరకు అంగన్వాడీల జీతాలు పెంచకుండా ప్రభుత్వం వారిచే వెట్టిచాకిరీ చేయిస్తుందన్నారు. స్త్రీలకు రక్షణ కల్పించడం, నేరస్తులను శిక్షించి బాధితులకు న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. యుటియఫ్ జిల్లా సహాధ్యక్షురాలు వి.రమాదేవి మాట్లాడుతూ కుటుంబం, సమాజాభివృద్ధికి స్త్రీ, పురుషులిద్దరిదీ సమిష్టి బాధ్యత అన్నారు. స్త్రీల సమస్యల పరిష్కారానికి పురుషులు కూడా కృషి చేసిన సందర్భాలను ప్రస్తావించి ఇది మంచి పరిణామమన్నారు.

ఐద్వా జిల్లా కార్యదర్శి విజయమ్మ మాట్లాడుతూ నేరం చేసినవారు తప్పించుకోగలుగుతున్నందున నేరాలు మరింత పెరుగుతాయని చట్టాలను పటిష్టంగా అమలుచేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరిత గతిన బాధితులకు న్యాయం చేయాలన్నారు.

ఈ సదస్సులో యుటియఫ్ జిల్లా అధ్యక్షులు పి.జానకిరాం, జిల్లా కార్యదర్శి చలపతిశర్మ, మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాంతీయ మండలాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, గృహిణులు, మధ్యాహ్న భోజన కార్మికులు మొత్తం 170మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుటియఫ్ ప్రాంతీయ మహిళా కమిటీ ఎంపిక మరియు ఆటలు, పాటల పోటీలలో గెలుపొందినవారికి బహుమతి ప్రదానం చేశారు.

**గూడూరు :** యుటియఫ్ ప్రాంతీయ కార్యాలయంలో మార్చి 2న యుటియఫ్ గూడూరు (టౌన్) గూడూరు, చిల్లకూరు, సైదాపురం మరియు మనుబోలు మండల శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ముఖ్య వక్తగా విచ్చేసిన యుటియఫ్ మహిళా నాయకులు భారతి మాట్లాడుతూ పితృస్వామిక భావజాలంతో మహిళల్ని అణిచి వేయడం క్షీణ సంస్కృతికి నిదర్శనమన్నారు. మహిళలపై జరిగే దాడుల్ని ఎక్కడక్కడ ఖండించాలని, ఇండియా డాటర్ డాక్యుమెంటరీపై నిషేధం ఎత్తివేయాలని, మహిళా చట్టాలను కఠినంగా అమలు పర్చాలని డిమాండ్ చేశారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన టి.శశికళ మాట్లాడుతూ ఒకవైపు ఆదిశక్తి అని కీర్తిస్తూ మహిళలపై పైశాచిక దాడులు చేయడం

దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. యుటియఫ్ నాయకులు శ్రీహరి మాట్లాడుతూ భావజాల పోరాటం ద్వారానే మహిళల స్థితిగతుల్లో మార్పు వస్తుందన్నారు. యుటియఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నవకోటీశ్వర రావు మాట్లాడుతూ నిర్భయ చట్టం తెచ్చిన తర్వాత దాడులు పెరిగాయని మహిళల పరిస్థితులు దుర్భరంగా ఉన్నాయని వేధింపులకు గురౌవుతున్నారని, సాంస్కృతిక దాడులను ఖండించాలని, సామాజిక సమస్యలకు స్పందించడం ద్వారా మన సమస్యల సాధనలో ముందుం టామని యుటియఫ్ పోరాట కార్యక్రమాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపిఎన్‌జిఓ నాయకులు ఎన్.మస్తానయ్య, మహిళా నాయకులు బి.స్వర్ణలత, కె.సంపూర్ణమ్మ, బి.మెరీనా, బి.నారాయణమ్మలు సందేశమిచ్చారు. ప్రాంతీయ నాయకులు, 50మంది మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నాయుడుపేట :** నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాల ప్రాంతీయ మహిళా సదస్సు జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలనందు మార్చి 18న బికె విజయకుమారి అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు, ఆడపిల్లలు, ఉద్యోగినులు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నారని దీనికి కారణం మహిళల్లో చైతన్యం లేకపోవడం అని చెప్పారు. స్త్రీలు చదువుకోలేక పోవడం సభలు సమావేశాలకు దూరంగా వుండడం వల్లనే స్త్రీల పట్ల వివక్షత వున్నదని చెప్పారు. ఏవికె భారతి మాట్లాడుతూ మహిళల సమస్యలు పరిష్కారం కావాలంటే వారికి మహిళా వింగ్ వుంటే బాగుంటుందని యుటియఫ్ మహిళా కమిటీలను మండల, తాలూకా, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఏర్పాటు చేస్తున్నదని ఈ కమిటీల ద్వారా మన సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని అవసర మయినప్పుడు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యుటియఫ్ సీనియర్ కార్యకర్త ఆన్తోనమ్మ జెపిహెచ్‌ఎస్ పుదూరు ఉపాధ్యాయురాలు సుధాదేవిని సన్మానించారు. ఈ కార్యక్రమానికి 3 మండలాల మహిళా కమిటీ కన్వీనర్లు, కో-కన్వీనర్లు వై.స్వరూపకుమారి, కె.విజయకుమారి, ఎన్.స్నేహలత, కె.శారద, పి.శశికళ, ఎన్.హిమ బిందు, కె.నాగమణి, సిహెచ్.రేణుక, పి.కల్పన, వై.అనుష మరియు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయినులకు చైల్డ్‌కేర్ లీవ్ ఉత్తర్వు వెంటనే ఇవ్వాలి - యుటియఫ్ డిమాండ్

మార్చి 29న యుటియఫ్ జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సమావేశం యుటియఫ్ భవనం నెల్లూరునందు జరిగింది. ఈ కార్య వర్గానికి అధ్యక్షత వహించిన యుటియఫ్ అసోసియేట్ అధ్యక్షురాలు వి.రమాదేవి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో విప్లవాత్మకమైన మార్పు జరిగినప్పటికి మహిళలు ఇంకా రెండవ తరగతి పౌరులుగానే కొనసాగుతున్నారని అన్నారు. ప్రధానవక్త ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సమాజపరంగాను, ప్రభుత్వపరంగాను మహిళల పట్ల వివక్షత కొనసాగుతున్నాయన్నారు. బాలికల విద్యకు ప్రభుత్వ విధానాలు ప్రోత్సహకరంగా లేవన్నారు. పాఠశాలలో కనీస అవసరాలు ఆడ పిల్లల విద్యకై అదనపు బడ్జెట్ కేటాయించి వారి కనీస అవసరాలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.శ్రీదేవి మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో మహిళలు అత్యంత బాధ్యతా యుతమైన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నప్పటికి తగిన గుర్తింపు రాకపోవడం ఆందోళనకరమన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సంపత్‌కుమారి మాట్లాడుతూ చైతన్యపూరితమైన ఉద్యమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి సి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులకు, బాలికలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి కె.పరంధామయ్య మాట్లాడుతూ మహిళా హక్కుల రక్షణకై యుటియఫ్ ముందుండి పని చేసిందన్నారు. మండల, జిల్లా స్థాయిలలో మహిళా విభాగాలు ఏర్పాటు చేసి, మహిళా చైతన్య కార్యక్రమాలు చేపట్టనున్నారన్నారు.

మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగినులకు 2 సం॥ల చైల్డ్‌కేర్ సెలవుల ఉత్తర్వు వెంటనే యివ్వాలని, బాలికలకు పాఠశాలలో మూత్ర శాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సమావేశంలో తీర్మానించారు. యుటియఫ్ నెల్లూరు జిల్లా మహిళా విభాగం కన్వీనర్‌గా టి.స్వర్ణలత, కో-కన్వీనర్‌గా సుభాషిణి 20మంది సభ్యులతో కమిటీ ఏర్పడింది. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.నాగిరెడ్డి, కె.తులసీ రాంబాబు, ఎస్‌కె ఖాజావలి, సిహెచ్.రఘునాధ్ తదితరులు పాల్గొన్నారు.

**కడప జిల్లా**

యుటియఫ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.ఉషాతులసి అధ్యక్షతన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలయందు నిర్వహించబడింది. "మహిళల హక్కులు - చట్టాలు" అనే అంశము మీద సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లోక్ అదాలత్ జడ్జి మాలతి మరియు సివిల్ కోర్టు జడ్జి దీనా హాజరయినారు.

లోక్ అదాలత్ జడ్జి మాలతి మాట్లాడుతూ కుటుంబాలలో జరిగే గృహహింసను బహిర్గతం చేయాలి, గృహహింసా చట్టాలను అకారణం గా ఉపయోగించరాదన్నారు. గృహహింసకు సంబంధించి ఎవరికైనా సమస్యలు వస్తే టోల్‌ఫ్రీ 1098కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. గృహహింసకు గురవుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయినీలు ఉచితంగా న్యాయం పొందవచ్చన్నారు. మహిళా విభాగం కన్వీనర్ కె.గాయత్రి, యుటియఫ్ జిల్లా కార్యదర్శులు డి.రూతు ఆరోగ్యమేరి, వీణపల్లవి వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. న్యాయ సలహాదారు సుబ్రహ్మణ్యం పాల్గొని ప్రసంగించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు.

**రాజంపేట**




యుటియఫ్ రాజంపేట డివిజన్ శాఖ పరిధిలోని రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి, నందలూరు మండలాల ఉపాధ్యాయినిలతో రాజంపేటలోని ఉర్దు ఉన్నత పాఠశాలనందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ఇందులో ప్రధానోపాధ్యాయినులు భారతి, లక్ష్మిదేవి, క్రిష్ణవేణి, సుహాసిని, నిర్మల, దిల్షాద్ బేగం, పెనగలూరు ఎంఇఓ బి.రఘురాం, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు జి.నిర్మల ముఖ్య అతిథులుగా పాల్గొని

ప్రసంగించారు. విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రకౌన్సిలర్ ఎం.నాగేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయినులు విద్యారంగ ఉద్యమాలలో పాల్గొనాలని కోరారు. జిల్లాకార్యదర్శి బి.హరిప్రసాద్ మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, మహిళలు అన్నిరంగాలలో రాణించాలని కోరారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు మరియు ఎంఇఓగా పనిచేసిన జి.నిర్మలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కౌన్సిలర్ జి.ప్రేమ కుమార్, రాజంపేట, పెనగలూరు, ఓబులవారిపల్లె నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లా

మార్చి 8న కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ కార్పోరేషన్ ఉన్నత పాఠశాలలో జిల్లా సహాధ్యక్షులు ఎన్.నాగమణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలందరూ ఉత్సవాలు జరపడమేగాక, మహిళా దినోత్సవ నేపథ్యాన్ని స్మరించుకొని ఉద్యమానికి స్ఫూర్తి పొందాలన్నారు. ఈ సభ సందర్భంగా యుటియఫ్ మహిళా విభాగం జిల్లా కన్వీనింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా కన్వీనర్‌గా ఎన్.నాగమణి, కో- కన్వీనర్లుగా ఆర్.గ్రేసమ్మ, అమరలతలతోపాటు అన్ని తాలూకాల కన్వీనర్లు, కో-కన్వీనర్లు జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నియ్యారు.

ఈ సభలో జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్‌కుమార్‌తోపాటు, జిల్లా గౌరవాధ్యక్షులు బి.మాణిక్యంశెట్టి, జిల్లా కార్యదర్శులు ఎస్ఎం జయరాజు, యుఆర్ఏ రవికుమార్, బి.వై.సుబ్బరాయుడు, బి.ప్రతాప్, జి.సర్వేశ్వరరెడ్డి, మహిళా నాయకురాలు ఫ్లోరెన్స్, సుజన విజయకుమారి, శ్రీదేవి, అరుణకుమారి, నాయకులు హేమంత్, ఎస్వి నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు :** కడపజిల్లా ఎమ్మిగనూరులో యుటియఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.సోమప్ప, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యయురాలు జ్యోతి, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.నాగమణి, మహిళా ఉపాధ్యాయ నాయకులు ఉమ, ఎం.కె.విజయలక్ష్మి, ఎం.సుజాత, పర్వీన్‌బాను, జిల్లా కార్యదర్శి జె.ఎల్లప్ప, రాష్ట్ర కౌన్సిలర్ దావీదు, మండల నాయకులు కె.లవ, బి.రామాంజనేయులు, బి.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**నందవరం :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యుటియఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో మండంలోని హాలహర్వి ప్రాథమిక పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం యుటియఫ్ జిల్లా సహాధ్యక్షురాలు ఎన్.నాగమణి అధ్యక్షతన సదస్సు జరిగింది. నాగమణి మాట్లాడుతూ శ్రామిక మహిళ ఇంటాబయటా సమస్యలను ఎదుర్కొంటూ వుంటుందని, టీచర్లు, ఎల్ఐసి, బ్యాంకింగ్, కలెక్టరేట్ వంటి చోట్ల పనిచేసే మహిళలూ తమ తమ రంగాల్లో సమస్యను మోస్తూనే వుంటారని ఇలాంటి వాటిపై చర్చించి సంఘటితం కావటానికే మార్చి 8న మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. జిల్లా కార్యదర్శి జె.యల్లప్ప మాట్లాడుతూ ఏ దేశంలో అయితే మహిళలు సమాన అవకాశాలు, సాధికారత సాధించారో ఆ దేశాలు ప్రగతిప్రధాన నడుస్తున్నాయి. మహిళలు ఆర్థికంగా స్వతంత్రులైతే సమాజ గమనమే మారుతుందన్నారు. మహిళల పట్ల సమాజ దృక్పథం మారాలి. ఉన్న హక్కులను రక్షించుకుంటూ మెరుగైన సమాజం కోసం ఉద్యమించడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవం లక్ష్యం కావాలన్నారు. అనంతరం బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ సమావేశంలో ఉమాదేవి, శాంతకుమారి, వరలక్ష్మి, మీనాక్షి, గీతారావు, లలితాబాయి, సీతాలక్ష్మి, జ్యోతి తదితరులు మరియు రాష్ట్ర కౌన్సిలర్ మల్లారి నాగరాజు, జ్ఞానప్రకాష్, నాగేంద్రరెడ్డి, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు. కవితాబాయి, ప్రమీలలు పాల్గొన్నారు.

**బనగానపల్లె :** మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న కర్నూలు జిల్లా బనగానపల్లె బాలికోన్నత పాఠశాలయందు యుటియఫ్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. బనగానపల్లె మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి ప్రారంభ సందేశమిస్తూ మహిళలు అన్ని రంగాలలో చైతన్యవంతం కావాలని, ప్రతి మహిళ సమాజంలో ఉన్నతస్థాయికి ఎదిగి క్రీడలు, రాజకీయ, సామాజిక సేవ మరియు శాస్త్ర సాంకేతిక రంగాలలో ముందుండి అందరికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. యుటియఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎం.లక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళ విద్యావంతురాలై తన కుటుంబాన్ని తద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి అధ్యక్షతన, మండల విద్యాశాఖా ధికారి కెసి వీరారెడ్డి ముఖ్య అతిథులుగా బహుమతి ప్రధానం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలను గౌరవించవలసిన అవసరముందని, మహిళలు పురుషులతో సమానంగా రాణించినప్పుడే మహిళా దినోత్సవానికి సార్థకత ఉంటుందని అన్నారు. మ్యూజికల్ చైర్స్‌లో మొదటి బహుమతి పొందిన పద్మావతమ్మ, రెండోవ బహుమతి కస్బా పాఠశాల టీచర్ బి.లక్ష్మిదేవి, పాటలలో మొదటి బహుమతి హైస్కూల్ సుభద్రమ్మ, రెండవ బహుమతి ఎంపిపి స్కూల్, కొండపేటకు చెందిన ఏ.శ్రీదేవికి, షాట్‌పుట్‌లో సి.అరుణను మొదటి బహుమతి, రెండవ బహుమతి ఎంపియుపిఎస్, జిల్లెల టీచర్ శైలజ, క్విజ్ ప్రోగ్రామ్‌లో ఎం.విజయలకు బహుమతులందించారు. ఉపాధ్యక్షురాలు శైలజ మరియు పలువురు టీచర్లు ప్రసంగించారు.

## అనంతపురం జిల్లా

**బెళుగుప్ప :** అనంతపురం జిల్లా బెళుగుప్ప (మం)లో మండల వనరుల కేంద్రం (ఎంఆర్‌సి)నందు మార్చి 9న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. జి.శైలజ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మండల జెడ్‌పిటిసి, జెడ్‌పి వైస్‌చైర్మన్, సుభాషితమ్మ, మండల ఎంపిపి తిరుపతమ్మ, అతిథిగా బెళుగుప్ప కాంప్లెక్స్ చైర్మన్ అరుణ హాజరై యుటియఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమ మునకు కెజిపి ఉపాధ్యాయులు శ్రీనివాస, విద్యానికేతన్ హెచ్ఎం సుమా మండలంలోని దాదాపుగా 48మంది మహిళా ఉపాధ్యాయులు, ఎర్రగడి సర్పంచ్ అనిత, యుటియఫ్ రాష్ట్ర కౌన్సిలర్ యు.శ్రీనివాసులు, మండల యుటియఫ్ గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజు, ప్రధానకార్యదర్శి కె.నాగ రాజు, అధ్యక్షులు ఏ.శ్యాంసుదర్ రాజు, జిల్లా కౌన్సిలర్ ఎస్.మనోహర్, మండల వైస్ ప్రెసిడెంట్ పి.భారతి, కార్యదర్శులు యు.వీరయ్య, ఎం.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలలో జరిగిన నిరసనలు - ధర్నాలు

## శ్రీకాకుళం జిల్లా

### జిల్లా పరిషత్ సమస్యలపై చైర్‌పర్సన్ సమక్షంలో సమన్వయ సమావేశం

మార్చి 16న జిల్లా పరిషత్, రిమ్స్ కార్యాలయ సమస్యలపై శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయుటకు మార్చి 11న యుటియఫ్ జిల్లా నాయకత్వం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేయడమైనది. వెంటనే వారు స్పందించి మార్చి 12న జిల్లా పరిషత్ బృందం యుటియఫ్ నాయకత్వంతో వారి ఛాంబర్‌లో సమన్వయ సమావేశం నిర్వహించి ఉపాధ్యాయ సమస్యలైన పిఎఫ్ స్లిప్పులు, లెక్చరర్ల అప్‌గ్రేడేషన్, ఆన్‌లైన్ చేయుట, మిస్సింగ్ క్రెడిట్స్‌ను సవరించుట, ఆన్‌లైన్‌లో నమోదుకాని ఉపాధ్యా యుల నమోదుకు సంబంధించి సుదీర్ఘ చర్చలు జరిగాయి. వీటిపై చైర్‌పర్సన్ ధనలక్ష్మి మాట్లాడుతూ రెండునెలల్లో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 2011-12 సం॥ పిఎఫ్ స్లిప్పులను అప్‌డేట్‌చేసి ఉపాధ్యాయులకు 10 రోజులలో అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇందులో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర, గౌరవాధ్యక్షులు కుప్పి కామేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షులు ఎస్.కిషోర్‌కుమార్, వాగ్దేవి, ట్రెజరర్ సి. అప్పారావు, కె.వి.శ్రీరామమూర్తి, జెడ్పీ అధికారుల తరపున డెప్యూటీ సిఇఓ ఎస్.రవీంద్ర, సూపరిండెంట్ వి.మహాలక్ష్మి, ఆర్.తిరుపతి రావు పిఎఫ్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు వినతి :** మార్చి 16న గ్రీవెన్స్ రోజున యుటియఫ్ జిల్లా నాయకత్వం జిల్లా కలెక్టర్ పి.లక్ష్మి నరసింహంకి వినతిపత్రం అందజేసి జిల్లాలో ఉపాధ్యాయ సమస్యలను వివరించడమైనది. "మెడికల్ బిల్లుల ప్యాకేజీ రేట్లు అమలులో పారదర్శకత లేదు, నిబంధనల ప్రకారం బిల్లులు మంజూరు చేయకుండా నెలల తరబడి జాప్యం చేస్తున్నారు. తక్కువ మొత్తాలను మంజూరు చేస్తున్నారు. 2014 సార్వత్రిక ఎన్నిక విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఎరెండ్ లీవు మంజూరి కొరకు డ్యూటీ సర్టిఫికెట్‌ను వెబ్‌సైట్‌లో ఉంచాలని, సిఆర్‌పి ఎకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఆర్‌సి సిబ్బంది వేతనాలు సకాలంలో చెల్లించాలి. మధ్యాహ్న భోజన నిర్వహణ మరియు వంటపనివారి బకాయిలు చెల్లించాలి. తదితర సమస్యలపైన వివరించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులను వాటి పరిష్కారం కొరకు చర్యలు చేపట్టమని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రెడ్డి మోహనరావు, చౌదరి రవీంద్ర, ఎస్.కిషోర్‌కుమార్, కెవి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### మార్చి 16న రిమ్స్ కార్యాలయం వద్ద ధర్నా

మెడికల్ బిల్లుల పరిష్కారంలో రిమ్స్ అధికారుల మొండి వైఖరికి నిరసనగా శ్రీకాకుళం రిమ్స్ కార్యాలయం ముందు యుటియఫ్ ఆధ్వర్యంలో మార్చి 16న ధర్నా జరిగింది. ధర్నా చేయడం ఇష్టం లేని రిమ్స్ అధికారులు సమస్యల పరిష్కారం కొరకు ఆలోచించకుండా ధర్నా టెంట్‌ను తీయించి వేయడానికి కార్యాలయ సిబ్బందిని పంపించ డంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసుల జోక్యంతో ధర్నా సజావుగా జరిగింది. ధర్నాను రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ ప్రారంభించి మాట్లాడుతూ మెడికల్ బిల్లుల చెల్లింపుల జాప్యాన్ని తీవ్రంగా నిరశించారు. ప్యాకేజి రేట్ల మంజూరులో వ్యత్యాసాలు లేకుండా చూడాలని రిమ్స్ అధికారులను డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ "నిబంధనల ప్రకారం బిల్లు కార్యాలయానికి చేరిన 15 రోజులలో పరిష్కరించాల్సి ఉండగా నెలల తరబడి వేల బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. నిపుణులైన డాక్టర్లచే బిల్లులు పరిశీలన చేయించకుండా కార్యాలయ సిబ్బంధితో చేయిస్తున్నా రని దీనిని నివారించాలని" డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ప్యాకేజీ రేట్లు అమలులో పారదర్శకత పాటించడం లేదని, నిబంధనల ప్రకారం రేట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్‌కార్డులు అమలు చేస్తున్న ప్రభుత్వం ప్రీమియం లను వసూలు చేస్తూ, కార్డు ద్వారా వైద్య సౌకర్యం కల్పించలేదు. కావున నగదురహిత వైద్య సౌకరర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మెడికల్ బిల్లులు చెల్లింపులు సరిగాలేదు, కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా చేసే ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సహాధ్యక్షులు ఎస్.కిషోర్‌కుమార్, వాగ్దేవి, గౌరవాధ్యక్షులు కామేశ్వరరావు, ట్రెజరర్ పి.అప్పారావు, జిల్లా కార్యదర్శులు అరికి భాస్కరరావు, డి.ప్రకాశరావు, ఎస్.వెంకటరావు, కె.వి.శ్రీరామూర్తి, ఎల్. బాబురావు, రాజారావు, మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం రిమ్స్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్ టి.జయరాజ్, సూపరిండెంట్ బిఎల్ఎన్ ప్రసాద్, యుటియఫ్ నాయకత్వంలో చర్చలు జరిపారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ పి.లక్ష్మి నరసింహను కలిసి రిమ్స్ సమస్యలపై వివరించగా ఆయన వెంటనే స్పందించి రెవెన్యూ బృందంను కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీ ప్రసాద్ ఆధ్వర్యంలో 1400 బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించి కలెక్టర్‌కు నివేదించగా వాటి మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అదనపు సిబ్బందిని కేటాయించారు. తద్వారా ధర్నా విజయవంతమై తక్షణ ఫలితం రావడం జరిగింది.

## విజయనగరం జిల్లా

### త్రిపుర ఎంపి జితేన్ చౌదరిని కలిసిన గిరిజన సంక్షేమ టీచర్లు

విజయనగరం జిల్లా గిరిజన ప్రాంతాల పర్యటనకు వచ్చిన త్రిపుర ఎంపి జితేన్ చౌదరిని సాలూరు ప్రాంతంలో గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయులు, యుటియఫ్ నాయకత్వం కలిసింది. ఈ సందర్భంగా చౌదరి ఉపాధ్యాయులను మీరు పనిచేసే ప్రాంతాలలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? అక్షరాస్యత పరిస్థితి, కుటుంబ ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికీ బడులులేని గ్రామాలు, రోడ్లు, విద్యుత్, నీరులేని గ్రామాలు ఉన్నాయని, రాజ్యాంగబద్ధంగా గిరిజన ప్రాంతాలకు రావలసిన నిధులు రావడం లేదని, అవినీతి పెరిగిపోతుందని టీచర్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జితేన్ చౌదరి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం ఉద్యమాలు నిర్ణయిస్తామని, రాష్ట్రాలవారీగా గిరిజనప్రాంత సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తెస్తామని తెలిపారు. టీచర్లే చైతన్యం కోసం ప్రధాన భూమిక పోషించాలని అన్నారు. జితేన్ చౌదరిని కలిసినవారిలో రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయ గౌరి, కె.జానకీరావు, మంగులు, రాజు, పైడిరాజు, సన్యాసిరావు, అరవింద్, విజయ్, లచ్చయ్యలతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**యుటియఫ్ ప్రాతినిధ్యాలతో నెలవారీ పదోన్నతుల సాధన**

జిల్లాలో 6 మాసాలుగా నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియ యుటియఫ్ చేసిన అనేక రకాల ప్రాతినిధ్యాల ఫలితంగా 40మందికి ఎల్‌ఎఫ్‌ఎల్‌తో పాటు, అన్ని సబ్జెక్టుల పోస్టులకు పదోన్నతులు లభించాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, స్వాతీరాణికి, జిల్లా కలెక్టర్ ఎంఎం రాంనాయక్‌కి, డిఇఒ జి.కృష్ణారావులకు దశలవారీగా చేసిన ప్రాతినిధ్యాలు, జరిపిన చర్చలు ఫలితంగా మార్చి 19న పదోన్నతుల కౌన్సిలింగ్ చేపట్టడంతో పదోన్నతులు లభించాయి.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎ.శివవర్మ, జిల్లా సహాధ్యక్షులు వెంకటరావు, నాయకులు కె.శ్రీనివాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాషా పండితులకు జిఓ 567 ప్రకారం గ్రేడ్-1 పదోన్నతులను కూడా ప్రతినెల అమలు చేయాలని రిప్రజంటేషన్‌ను అధికారులకు యుటియఫ్ నాయకత్వం అందజేసింది.

**చిత్తూరు జిల్లా**

**అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌ని మార్చి 9న జిల్లా యుటియఫ్ నాయకులు కలిసి వినతపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే యివ్వాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకు సత్వరమే ప్రొసీడింగ్స్ యివ్వాలని, ఆర్ఎంఎస్ఏ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పారితోషికం వెంటనే యివ్వాలని, 2012లో భాషా పండితులుగా ఎంపికై, సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి వెంటనే భాషాపండితులుగా పోస్టింగ్ యివ్వాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు జి.శ్రీరామమూర్తి, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎన్.గుణశేఖర్‌రెడ్డి కోరారు. నాయకులు శేఖర్, అప్పలస్వామి నాయుడు, జి.శ్రీనివాసులు, సూర్యప్రకాష్, కనకాచారి, ఆర్.గోవిందస్వామి, ప్రభాకర్ తదితరులు విద్యాశాఖాధికారి వారిని కలిసిన వారిలో ఉన్నారు.

**గుంటూరు జిల్లా**

**విద్యారంగంలో వచ్చే పరిణామాలను సమిష్టిగా ఎదుర్కొందాం**

రాబోవు రోజుల్లో విద్యారంగంలో అనేక పరిణామాలు వచ్చే పరిస్థితులు ఉన్నాయని, వాటిని సమిష్టిగా ఎదుర్కొని ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. మార్చి 30న యుటియఫ్ గుంటూరు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కె.నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉన్నత విద్యారంగం, పేదవారికి అందని పరిస్థితి ఏర్పడిందని, పాఠశాలల్లో సంస్కరణ పేరుతో, ప్రభుత్వ పాఠశాలలు మూసివేసే ప్రక్రియను సమర్థవంతంగా ఎదుర్కోవాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, సంఘాల బాధ్యులకు ధన్యవాదములు తెలిపారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో యుటియఫ్ క్యాడర్ బాగాపని చేయడం జరిగిందని నైతికంగా యుటియఫ్ విజయం సాధించిందని తెలిపారు. నూతన ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 6 పిడిఎఫ్ ఎమ్మెల్సీలను కలిగి వున్న అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం యుటియఫ్ అని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అధికార దుర్వినియోగం, డబ్బుల పంపకం వల్ల మాత్రమే ఓటమి చెందం జరిగిందని తెలిపారు.

క్లస్టర్ స్కూల్స్ పేరుతో పాఠశాలలను మూసివేయడం సరైందికాదని తెలిపారు. వేసవిలో బదిలీల షెడ్యూల్ ప్రకటించాలని, 2013లో బదిలీ కాబడిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల మీద పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించుట జరిగింది. ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు, సహాధ్యక్షులు జి.విజయ సారధి, వినోద, కోశాధికారి ప్రేమ్‌కుమార్, కార్యదర్శులు ఎన్.కుమార్ రాజా, విజయభాస్కర్, ఎం.గౌస్, శివపూర్ణయ్య, కళాధర్, థామసయ్య, మోహనరావు, శ్రీనివాసరెడ్డి, అరుణ్‌కుమార్, డేవిడ్‌రాజు, సాయిప్రసాద్, పాల్‌రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆడిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో సహకరించిన అందరికి ధన్యవాదములు - యుటియఫ్**

ఎయిడెడ్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీతాలతో పాటు అన్ని రకాల అరియర్ బిల్లులు చెల్లింపులో సహకరించిన అధికారులకు, సిబ్బందికి, యుటియఫ్ జిల్లాశాఖ పక్షాన ధన్యవాదాలు తెలియపరుస్తున్నట్లుగా యుటియఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.నాగమల్లేశ్వరరావు, ఎం.హనుమంతరావు తెలిపారు. 2009 నుండి డిఏ అరియర్స్, ఇఎల్ అరియర్, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ అరియర్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌నకు సంబంధించి 8 కోట్లు చెల్లించుట జరిగిందని వారు తెలిపారు. గ్రాంట్ సకాలంలో విడుదలకు సహకరించిన యుటియఫ్ రాష్ట్ర కమిటీకి, ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణ రావు, బొడ్డు నాగేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారులకు, సిబ్బందికి, ట్రెజరీ అధికారి సురేంద్రబాబు, సబ్‌ట్రెజరీ అధికారులకు ధన్యవాదాలు తెలియపరిచారు.

**కర్నూలు జిల్లా**

**రాము సూర్యారావు విజయోత్సవం**

**గోదావరి జిల్లాల ఉపాధ్యాయులకు జేజేలు**

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యునిగా రాము సూర్యారావు ఎన్నికవటంతో కర్నూలు కలెక్టరేట్ ఎదుట మార్చి 26న విజయోత్సవం జరిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ అధికార పార్టీ అభ్యర్థితో పాటు ఇతరులు కూడా ఎన్నిరకాలుగా ప్రలోభాలు పెట్టినా ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ, అధ్యాపక ఓటర్లు కరెన్సీ కవర్లకు కక్కుర్తి పడకుండా, వెండి, బంగారు ఆభరణాలకు అర్రులు చాచకుండా, అధికార, రాజకీయ బెదిరింపులకు లొంగకుండా ఎంతో విజ్ఞతతో నిజాయితీపరుడు, నిస్వార్థుడు, మానవతా మూర్తియైన యుటియఫ్ బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థి రాము సూర్యారావు మాస్టారుకే ఓటువేసి గెలిపించి ఇతర ఉపాధ్యాయుందరిని ఆదర్శంగా నిలిచారని, అలాంటి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయులకు కర్నూలు జిల్లా ఉపాధ్యాయుందరి తరపున అభినందనలతో జేజేలు పలుకుతున్నామన్నారు. అనంతరం మిఠాయిలు పంచి ఆనందాన్ని అందరితో పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జయరాజు, రవికుమార్, ప్రతాప్, నారాయణస్వామి, హనుమంతు, రఫిక్, తిమ్మన్న, హేమంత్, వీరారెడ్డి, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

# క్లస్టర్ పాఠశాలల విధానం రద్దు చేయాలి

**శ్రీకాకుళం జిల్లా**



**కొత్తూరు :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న క్లస్టర్ పాఠశాల విధానాన్ని మానుకోవాలని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చౌదరి రవీంద్ర అన్నారు. స్థానికంగా ఆయన ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ విధానం వల్ల ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్ని ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని కోరారు. 2010లో ప్రవేశపెట్టిన సక్సెస్, మోడల్ పాఠశాలల్ని మెరుగుపరచకుండా క్లస్టర్ విధానం తీసుకురావడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మేధావులతో చర్చించాలని సూచించారు. సమావేశంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి దండు ప్రకాశరావు, జిల్లా నాయకులు మహేశ్వరరావు, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దార రాజు, బోడ శ్రీను, నాయకులు జె.సువర్ణ, రాజు, మాధవరావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం జిల్లా**

### క్లస్టర్ పాఠశాలల విధానంపై గ్రామాలలో సభలు



బలిజిపేట, రామభద్రపురం మండలాలల్లో క్లస్టర్ పాఠశాలల ఏర్పాటుపై ఆయా గ్రామాల ప్రజానీకం గ్రామ సభలను నిర్వహించారు. పెదపెంకి అనే గ్రామంలో వందలాదిగా ప్రజలు కదలివచ్చారు. ఆ గ్రామం యూత్ నాయకులు ఈర్ల సంజీవి నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి పాల్గొని క్లస్టర్ పాఠశాలల స్థితిగతులు – నష్టాలు – భవిష్యత్ పరిణామాలు – ప్రభుత్వ నిర్ణయాలను కూలంకషంగా వివరించారు. ఈ అంశంపై ప్రజలు అనేక సందేహాలను వెలిబుచ్చారు. గ్రామాలలో బడులు మూతపడితే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు జి.అప్పలనాయుడు, చిరంజీవులు, బాపూజీ గ్రంధాలయం అధ్యక్షులు రామారావు, యుటియఫ్ నాయకులు జి.వెంకటనాయుడు, వి.ప్రసన్న కుమార్, పి.వరప్రసాద్, టి.వి.నాయుడులు పాల్గొన్నారు. మరో 6 గ్రామాలలో ఈ సభలు జరిగాయి. అనంతరం బాపూజీ గ్రంధాలయానికి యుటియఫ్ బృందం 2వేల రూపాయాలు ఖరీదు చేసే పుస్తకాలను అందించారు.

### రౌండ్‌టేబుల్ సమావేశం

మార్చి 30న జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాలులో, విజయనగరం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు ఎస్.మురళీమోహన్ సమన్వయకర్తగా వ్యవహరించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో 30 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. వక్తలంతా మాట్లాడిన అంశాలన్నీ ఏకాభిప్రాయంతో తీర్మానం చేశారు.

ఈ విధానం వలన గ్రామీణ ప్రాంతాల పిల్లలు విద్యకు దూరం అవుతారని, బాలికావిద్య కుంటుపడుతుందని, డ్రాపవుట్స్ రేట్ పెరుగుతుందని, విద్య, ప్రైవేటీకరణ జరుగుతుందని, ఇన్ని నష్టాలు కలిగిన క్లస్టర్ పాఠశాలల ఏర్పాటును అందరం వ్యతిరేకిస్తున్నామని ముక్తకంఠంతో చెప్పారు. ప్రభుత్వాలు ఇప్పటికే రూపొందించిన ప్రణాళికలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెఏసిలో ప్రధాన డిమాండ్‌గా పెట్టాలని అభిప్రాయపడ్డారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏపిటిఎఫ్(1938), ఏపిటిఎఫ్ (257), జెఏసి జిల్లా చైర్మన్, ఎస్సి,ఎస్టి ఎంప్లాయిస్ యూనియన్, యుటియఫ్, ఎస్‌టియు, ఆపస్, హెడ్‌మాస్టార్ అసోసియేషన్, ఆర్‌యు పిపి, పిఇటిఏ, ఎస్ఎల్‌టిఏ, ఎస్‌సిఎస్‌టియుఎస్, ఏపిపిటిఏ, ఏపిఎంఎస్‌టిఎఫ్, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు, ఏఐఎఫ్‌టియు, యుఎం ఇయు, ఎస్‌టిఇయు, జెవివి, ఎన్‌జిఓ, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, ఎండిఎం, డివైఎఫ్ఐ మరో నాలుగు సంఘాలు పాల్గొన్నాయి. వివిధ సంఘాల నాయకులంతా ఈ సమావేశంలో పాల్గొనటం జిల్లాలో పారాటాలకు మంచి పరిణామం అని, ఇప్పటికే జిల్లాలో క్లస్టర్ పాఠశాలలపై చేపట్టిన ఆందోళనలు మంచి స్ఫూర్తిని కలిగించాయని ఈ వేదిక బలమైన ఐక్య ఉద్యమాలకు సంకేతాలని యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.శేషగిరి అన్నారు. యుటియఫ్ నాయకులు ఎ.శివవర్మ, కె.శ్రీనివాస్, జి.నిర్మల, పి.శ్రీనివాస్, రమేష్, తిరుపతి నాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు జిల్లా**

### విద్యావ్యాపారవేత్తల లాభాలకే క్లస్టర్ పాఠశాలల ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న క్లస్టర్ పాఠశాలల పై యుటియఫ్ నెల్లూరు జిల్లాశాఖ రౌండ్ టేబుల్ సమావేశాన్ని టౌన్ హాలు రీడింగ్ రూమ్ నెల్లూరునందు నిర్వహించింది. సమావేశము సమన్వయకర్తగా రాష్ట్ర కార్యదర్శి సి.చంద్రశేఖర్ వ్యవహరించారు. ప్రధానవక్తగా పాల్గొన్న ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ

పేదల చదువుపట్ల ప్రభుత్వానికి శ్రద్ధలేదని తెలియజేశారు. ప్రభుత్వ విద్యా రంగంలో క్లస్టర్ పాఠశాలలు పెట్టడం అనర్ధదాయకం. దీనిపై ఏ స్థాయిలలోను చర్చించడానికి ప్రభుత్వం సిద్ధపడటం లేదు. వ్యాపార వేత్తలకు ఉపయుక్తంగా ఉండేటట్లుగా క్లస్టర్ పాఠశాలల విధి విధానాలను రూపొందిస్తున్నారు. దీనిని ప్రజల సహకారంతో అడ్డు కొనవలసి ఉంది. దీనివలన ఎస్‌సి, ఎస్‌టి మరియు బాలికలు చదువుకు దూరమయ్యే పరిస్థితి వస్తుందని తెలిపారు.



ఏపిటిఎఫ్ (257) జిల్లా అధ్యక్షులు ఉదయ్ భాస్కర్ క్లస్టర్ పాఠశాలలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో మా సంఘం పాల్గొం టుందని తెలిపారు. బహుజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బి.ఆదినారాయణ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి పిల్లలకు అన్యాయం చేయడానికి ఈ ప్రభుత్వం క్లస్టర్ పాఠశాలలు తీసుకొని వస్తుందని అందువలన డ్రాప్‌అవుట్స్ పెరిగే అవకాశముందని తెలిపారు. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.పరంధామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం క్లస్టర్ పాఠశాలలను ఆపి కామన్ పాఠశాలలు పెట్టాలన్నారు. విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం 10%, రాష్ట్ర ప్రభుత్వం 30% బడ్జెట్ కేటాయించాలని తెలిపారు. పూర్వ ప్రాథమిక మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచాలని తెలిపారు. ఈ రౌండ్‌టేబుల్ జూనియర్ సమావేశంలో లెక్చరర్స్ సంఘ నాయకులు గౌస్‌భాషా, చెంచయ్య, సిఐటియు నాయకులు కె.అజయ్‌కుమార్, ఎల్‌ఐసి ఉద్యోగ సంఘాల నాయకులు నగేష్, జనవిజ్ఞానవేదిక నాయకులు సూర్యప్రకాశరావు, గిరిజన సంఘం నాయకులు ప్రభాకర్, ప్రధానోపాధ్యాయ సంఘ నాయకులు బుజ్జయ్య, యుటియఫ్ నాయకులు సిహెచ్.శ్రీహరి, మహిళ నాయకురాలు టి.స్వర్ణలత చర్చలో పాల్గొన్నారు.

## కావలిలో రౌండ్‌టేబుల్ సమావేశం

యుటియఫ్ కావలి ప్రాంతీయ మండల శాఖల ఆధ్వర్యంలో మార్చి 1న పెన్షనర్స్ భవనం, కావలినందు క్లస్టర్ స్కూళ్ళ ఏర్పాటు – పరిణామాలు అనే అంశంపై చర్చావేదిక నిర్వహించబడింది. ఈ చర్చా వేదికకు యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.జానకిరాం సమన్వయ కర్తగా వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి చలపతిశర్మ చర్చలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొన్ని సంవత్సరాలుగా విద్యారంగంలో ప్రయోగాలు చేసే దశలోనే ఉన్నదని అందులో భాగంగా అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని, ఇప్పుడు క్లస్టర్ పాఠశాలల పేరుతో గ్రామీణప్రాంతాల పేద విద్యార్థులకు చదువు దూరంచేసే పథకాన్ని ప్రవేశపెట్టబోతున్నదని దానిని విరమించుకోవాలని కోరారు. చర్చావేదికలో విద్యార్థి సంఘాల తరపున పాల్గొన్న వక్తలు అందరూ ముక్తకంఠంతో క్లస్టర్ పాఠశాలల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమించవలసి ఉంటుందని అన్నారు.



ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.శ్రీదేవి, కావలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి టి.సత్యనారాయణ, బోగోలు మండల విద్యాశాఖాధికారి జయంతిబాబు, లోక్‌సత్తా నాయకులు మాలకొండారెడ్డి, అశ్లీల ప్రతిఘటనావేదిక నాయకురాలు శారద, ఎన్‌జిఓ సంఘ నాయకులు నరసారెడ్డి, పెన్షనర్స్ సంఘ నాయకులు మాల్యాద్రి, జెవివి నాయకులు రమణయ్య, యుటియఫ్ జిల్లా కార్యదర్శి తులసీరాంబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, ఇతర ప్రజా సంఘాల నాయకులు, యుటియఫ్ మండల శాఖల బాధ్యులు ఎస్‌కె అబ్దుల్ ఆలీ అహ్మద్, వి.తిరుమలరావు, ఎస్‌వి దుర్గాప్రసాద్, శ్రీనివాసబాబు, వేణుగోపాల్, కిషోర్, ఆనంద్, రాజేంద్రబాబు, మధుసూదనరావు, ప్రకాశరావు, టి.శ్రీనివాసరావు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

**కర్నూలు జిల్లా**

## 'క్లస్టర్' పేరుతో పాఠశాలల మూసివేత కుట్రను తిప్పికొడదాం

క్లస్టర్ పాఠశాలల పేరుతో ఉన్న వీధి బడులనే మూసివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని, దీనిని మనం పోరాటాలతోనే తిప్పికొట్టాలని యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు పిలుపునిచ్చారు. మార్చి 29న కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌నందు జిల్లా అధ్యక్షులు డి.రామశేషయ్య అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి సెలవుల్లోనే బదిలీలు కౌన్సిలింగ్ నిర్వహించాలని అవసరమైతే వెంటనే ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను పునరుద్ధరించాలని 'క్లస్టర్' పేరుతో జరిగే కుట్రకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఉభయగోదావరి ఉపాధ్యాయ శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన రాము సూర్యారావును జిల్లా కార్యవర్గం అభినందించింది. అభ్యర్థిగా నిజాయితీపరుడైన రాము సూర్యారావును ఎంపికచేసిన యుటియఫ్ రాష్ట్ర కమిటీని, ఎన్నికల్లో కృషిచేసిన యుటియఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలతోపాటు విజ్ఞతతో ఓటువేసి ఆర్ఎస్ఆర్ మాస్టార్‌ను గెలిపించిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయులను అభినందిస్తూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

ఈ సమావేశంలో జిల్లా నాయకులు బి.మాణిక్యం శెట్టి, కె.సురేష్ కుమార్, వై.మనోహర్, ఎన్.నాగమణి, ఎస్.రంగమ్మ, జె.సుధాకర్, ఎస్ఎం జయరాజు, రవికుమార్, ప్రతాప్, లక్ష్మయ్య, సుబ్బరాయుడు, ఐజయ్య, ఎల్లప్ప, హనుమంతు, సర్వేశ్వరరెడ్డి, రఫిక్, బాబు, వెంకటేశ్వ రరెడ్డి, లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉత్తర్వులు

### అరియర్ బిల్లులు మంజూరు గడువు మార్చి 31 వరకు పొడిగింపు ఉత్తర్వులు

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**ABSTRACT**

A.P. State Reorganization Act, 2014 – Certain arrears and other claims pertaining to the period prior to bifurcation of the erstwhile State of Andhra Pradesh i.e., 02-06-2014 – Extension of time to present the bills - Orders – Issued.

**FINANCE (Budget.II)) DEPARTMENT**

**G.O.RT.No. 476** **Dated: 07 -03 -2015.**

**Read the following:**

1. A.P. Reorganization Act. 2014.
2. G.O.Rt. No. 243, Fin (TFR) Dept., Dt. 22.07.2014 of Govt. of Telangana.
3. G.O. Rt. 2597, Finance (Budget-II) Deptt, Dt. 21.10.2014.
4. G.O.Rt. No.8, Finance (Budget-II) Deptt, Dt. 02.01.2015.
5. G.O.Rt. No. 183, Fin.(Budget.II) Deptt,Dt.31.01.2015
6. Letter from AP NGO's Association Dt. 03.03.2015

*****

**O R D E R:**

In the G.O. 3rd read above, orders were issued for completion of the submission and passing of arrear bills pertaining to the period prior to bifurcation of erstwhile State of Andhra Pradesh by 31.12.2014 and further extended up to 28.02.2015 vide G.Os 4th and 5th read above.

2. In the reference 6th read above, the AP NGO's Association brought to the notice of the Government that, still there are cases for clearance and employees are facing difficulty due to expiry of time limit.
3. Government, after careful consideration of the matter, hereby extend the period of submission and passing of bills of arrears and other claims pertaining to the period prior to bifurcation of erstwhile State of Andhra Pradesh i.e. prior to 02.06.2014, up to 31st March, 2015.
4. All departments shall comply with the above orders to clear such claims.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**AJEYA KALLAM**

SPECIAL CHIEF SECRETARY TO GOVERNMENT

***

### మోడల్ పాఠశాలలకు గ్రాంట్ విడుదల ఉత్తర్వులు

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**ABSTRACT**

BE 2014-15 - School Education Department – Budget Release Order for Rs.70,17,00,000/- (Rupees Seventy Crore Seventeen Lakhs) towards payment of salaries to the staff of 163 Model Schools in the State under RMSA Phase - I recurring grant under RMSA - Administrative sanction – Accorded– Orders – Issued.

**SCHOOL EDUCATION (PROG.I) DEPARTMENT**

**G.O.MS.No. 21** **Dated: 23 -03-2015**

**Read the following:**

1. From the Commissioner & Director of School Education, A.P., Hyderabad Lr.Rc.No.898/B1/APState/Model Schools/RMSA/2014, dt. 13/2/2015.
2. G.O.Rt.No.602, Fin(EBS-IV-SE-HE) Deptt, Dt:18/3/2015.

**ORDER:**

The Commissioner & Director of School Education, A.P., Hyderabad vide ref 1st read above has requested the Government to issue Budget Release Order and administrative sanction for Rs.70,17,00,000/- (Rupees Seventy Crores Seventeen Lakhs) (Rs.5262.75 lakhs towards central share and Rs.1754.25 lakhs towards State Share) with permission to adjust the amount to Secondary Education Society (Regd.No.661/2009) A.P. Model Schools in the State Bank of India, SB Account No. 31566017534 to enable to pay the salaries to the staff of 163 Model Schools in the state under RMSA Phase I.

2. The Finance (ESE) Department vide ref 2nd read above have issued Budget Release Order for Rs.70,17,00,000/- (Rupees Seventy Crores Seventeen Lakhs) Plan as additional funds of Rs.5262.75 lakh as Central share and Rs.1754.25 lakhs towards State share in relaxation of Treasury Control and quarterly regulation orders pending provision of funds by obtaining supplementary Estimates at the appropriate time during 2014-15 to pay the salaries to the staff of 163 Model Schools in the State under RMSA phase I under the following Head of Account 2202-02-789-12-06-310/312, 2202-02-109- 12-06-310-312, 2202-02-796-12-06-310312.
3. In pursuance of the Budget Release Order issued by the Finance (EBS.IV.SE.HE) Department in the reference 2nd read above, Government hereby accord administrative sanction to the Commissioner & Director of School Education, A.P., Hyderabad for an amount of Rs.70,17,00,000/- (Rupees Seventy Crores Seventeen Lakhs only) Plan as additional funds of Rs.5262.75 lakh as Central share and Rs.1754.25 lakhs towards State share in relaxation of Treasury Control and quarterly regulation orders pending provision of funds by obtaining supplementary Estimates at the appropriate time during 2014-15 to pay the salaries to the staff of 163 Model Schools in the State under RMSA phase I under the following Head of Account 2202-02-789-12-06-310-312, 2202-02-109-12-06-310-312, 2202-02-796-12-06-310-312.
4. The Commissioner & Director of School Education, A.P., Hyderabad shall take necessary action accordingly.
5. This order issues with the concurrence of Finance (EBS.IV.SE.HE)Department with their G.O.Rt.No. 602 Finance (EBS.IV.SE.HE) Department, dt. 18/3/2015 & U.O.No.2434/49/EBS.IV.SE/2015, dt. 20/3/2015.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**R.P.SISODIA**

SECRETARY TO GOVERNMENT

***

### వెబ్ ఆధారిత నిధుల నిర్వహణకు సవరణ ఉత్తర్వు

**GOVERNMENT OF ANDHRA PRADESH[**
**ABSTRACT**

School Education – Implementation of Centrally sponsored Scheme "**Saakshar Bharat**" –Web Based Funds Flow Mechanism and Banking System – Authorization, specifying monetary limits for drawing funds and nominating Cheque

drawing officer – Amendment -Orders – Issued.

**SCHOOL EDUCATION (PROG.III) DEPARTMENT**

**G.O.RT.No. 75 Dated:24.03.2015.**

**Read the following:-**

1) G.O.Rt.No.150, Edn.(PE-Prog.I) Dept. dt.19.3.2010
2) From Director of Adult Education, Hyderabad, Lr.Rc.No.7912/C/SB/ DAE/2009, dt.5.5.2010.
3) G.O.Rt.No.554, Edn.(PE-Prog.I) Dept. dt.15.9.2010
4) Note submitted by the Director of Adult Education, A.P., Hyderabad.

***

**ORDER**

The following amendment is issued to the monitory limits mentioned under sub-para (II) of Para 5 of GO Rt.No.554 Education (PE Prog.I) Department, Dt.15.09.2010.

**AMENDMENT**

**FOR** **READ AS**

| Item | Existing | | Proposed | | |
|---|---|---|---|---|---|
| **Para 5:** | | | | | |
| Monetory limit under Sub para (II) | Upto Rs.1,00,000 | The DDAE and CEO ZP will sign the cheques jointly after approval of expenditure by the Chairman, ZLSS | Monetary Limit up to Rs. 1,00,000 | Sanction and payment of routine administrative matters i.e., release of Honorarium to Outsourcing employees and Coordinators, Water, Electricity, Telephone Bills, FTA / TA Bills of Coordinators, vehicle charges and other contingencies. | The Deputy Director is the sanctioning authority. Project officer, Adult Education and Deputy Director of Adult Education are joint signatories. In case, the post of Project Officer is Vacant, the Asst. Project Officer will be joint signatory. |
| | Above Rs.1,00,000 | The CEO ZP and District Collector will sign the cheques jointly after approval of expenditure by the Chairman, ZLSS | Above Rs. 1,00,000 | All the other payments | Deputy Director and CEO, ZP are joint signatories after approval of expenditure by the District Collector. |

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**R.P SISODIA**

SECRETARY TO GOVERNMENT

***

## జిల్లా కలెక్టర్లకు శాసనమండలి ఎన్నికల రోజు సెలవు ప్రకటించే అధికారం

## GOVERNMENT OF ANDHRA PRADESH

## ABSTRACT

Elections - Biennial Elections to A.P. Legislative Council from 2 Teachers' Constituencies in East Godavari, West Godavari, Krishna and Guntur districts – Declaration of local Holiday, if necessary, on the day before the day of poll, the day of poll and the day of counting of votes, if necessary – Authorization to the Collectors & District Magistrates – Orders – Issued.

**GENERAL ADMINISTRATION (ELE-B) DEPARTMENT**

**G.O.RT.No. 727 Dated:10.03.2015**

**Read the following:**

1. From the E.C.I., New Delhi, Press Note No.ECI/PN/16/2015, dated 11.02.2015.
2. From the E.C.I., New Delhi, Letter No.322/AP-TL-LC/2015-CC&BE, dated 24.02.2015.

***

**ORDER:**

In the reference 1st read above, the Election Commission of India has announced the schedule for Biennial Elections to A.P. Legislative Council from 2 Teachers' Constituencies in East Godavari, West Godavari, Krishna and Guntur Districts in the State of Andhra Pradesh. Further, vide its letter 2nd read above, the Commission has revised the date of poll and date of counting. As per the revised schedule the poll will be held on **22.03.2015 (Sunday)** and counting of the votes will be on **25.03.2015 (Wednesday).**

2. In this context, the Government hereby authorize the Collectors & District Magistrates of East Godavari, West Godavari, Krishna and Guntur Districts to declare a **local holiday**, if necessary, on the day of poll **25.03.2015 (Sunday)**, on the day before the day of poll **21.03.2015 (Saturday)** and the day fixed for counting **25.03.2015 (Wednesday)** for the Offices / Institutions where polling and counting centres are established for the ongoing biennial Elections to A.P. Legislative Council from East-West Godavari Teachers' and Krishna-Guntur Teachers' Constituencies. On local holidays the Treasuries, Sub-Treasuries and all other offices/institutions in the District will however function as usual.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF A.P.)**

**I.Y.R. KRISHNA RAO**

CHIEF SECRETARY TO GOVERNMENT

***

## ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలకు గ్రాంట్ విడుదల ఉత్తర్వులు

**Office of Commnr, of School Education,**
**Andhra Pradesh, Hyderabad.**
**(Account Branch)**

**Memo.No.45/ A-AIII/2014-15 Dt. 12.03-2015.**

**Sub:** School Education - Budget 2014-15 - Aided Institutions - Grant in Aid towards Salaries and Arrears to Aided Primary Schools - Permission accorded - Reg:

**Ref:** 1. RC.No.2178/Cl/2013 dated 29/01/2014 ofD.E.O, Prakasam District.
2. RC.No.2813/ A6/2013 dated:24/12/2014 D.E.O, Visakhapatnam.
3. Memo.No.3234/SE.PS/Al/2015 dated:l0/03/2015 of Government.

***

The attention of the District Educational Officers, Prakasam and Visakhapatnam is invited tc; the reference 3rct cited and informed that the Government have accorded permission to meet the expenditure towards- the payment of arrears for Rs.38,37, 481 (Rs.27,97,138+10,40,348) in respect of the following Schools from the funds already released for 2014-15 under the Head of Account "2202-01-102-04-310/311" towards arrears of salaries, D.A, pay fixation, PRC etc, as per the requirements of D.E.Os.

1.SBNRM Aided Schools Komorole Mandal, Prakasam Dist., Rs .27,97,138.

2. RCM Ad. Ele. School the Madugula Visakhapatnam Dist. Rs. 10,40,343.

Total = 38,37,481.

The District Educational Officers are requested to take action accordingly in the rnatter and report compliance.

**Chief Accounts Officer**

***

## ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలల ఎరియర్ గ్రాంట్ విడుదల ఉత్తర్వులు

## GOVERNMENT OF ANDHRA PRADESH

## EDUCATION(SE.PS) DEPARTMENT

**Memo. No.3234 /SE. PS /Al/ 2015 Dated:l0.03.2015**

**Sub :** School Education - Budget 2014-15 - Aided Institutions Grant in Aid towards Salaries - Payment of Arrears to Staff of Aided Primary Schools - Permission-Accorded-OrdersIssued.

**Ref:** From the C&DSE,AP, Hyd in Lr.Re.No. 45-A/AIII/2014-15, Dated 23.02.2015.

***

In the circumstances reported by the Commissioner of School Education, A.P,Hyderabad, permission is hereby accorded to meet the expenditure towards the payment of arrears for Rs 38,37,481/- (Rs.27,97,138+10,40,343) from the available budget under Head of Account "2202-01-102-04-310/311' for arrear of salaries, D.A., Pay fixation, PRC etc., in respect of the staff of Aided Primary Schools Prakasam District and Visakhapatnam District.

2. This Memo.issues with the concurrence of the Finance Deptt., vide their U.O.No.2752/56/EBS.IV.SE/15,dated 10.03.2015.

**R.P.SISODIA**
SECRETARY TO GOVERNMENT

***

## మార్చి 16 నుండి ఒంటిపూట బడుల ఉత్తర్వు

**PROCEEDINGS OF THE COMMISSIONER OF SCHOOL EDUCATION:: ANDHRA PRADESH :: HYD-04**

**Rc.No.02/Acad & Insp / 2015 Dt.13.03.2015**

**Sub :** School Education - School Academic Calendar 2013-14 Half Day Schools During summer from 16.03.2015 - Instructions - Issued Regarding.

**Read :** School Academic Calendar 2014-15

***

All the Regional Joint Directors of School Education and the District Educational Officers in the State are instructed to run the schools for half -a- Day from 8.00 AM to 12.30 PM due to summer from 16.03.2015 onwards, and further instructed to run the schools which are constituted as SSC Examination centre from 1.00 PM to 5 PM.

Therefore, the Regional Joint Directors of School Education and the District Educational Officers are requested to take necessary action in the matter accordingly.

**Sd/- K.Sandhya Rani**
Commissioner of School Education

***

## స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్) పదోన్నతులు నిర్వహించ వలసిందిగా కమీషనర్ ఉత్తర్వులు

**PROCEEDINGS OF THE COMMISSIONER OF SCHOOL EDUCATION:: ANDHRA PRADESH :: HYD-04**

**Rc.No.181/Estt.2-1/ 2015 Dt.16.03.2015**

**Sub :** Andhra Pradesh School Educational Sub-ordinate Service Rules of the posts of teachers in Government, Mandal Praja Parishad and Zilla Praja Parishad Schools in Andhra Pradesh - Adhoc Rules - Instructions - Issued - Regarding.

**Ref:**
1. Repn.No.253-B/RUPPAP/14, Dt.09.02.2015 of Rastriya Upadhyaya Panditha Parishad, AP Hyd.
2. G.O.Ms.No.11, Edn. Dt.23.01.2009.
3. G.O.Ms.No.12, Edn.,Dt.23.01.2009 read with G.O.Ms.No. 4 Edn., Dt.09.01.2012.
4. G.O.Ms.No.15, Edn. (SE.Ser.II) Deptt,Dt.07.02.2015.
5. G.O.Ms.No.16, Edn. (SE.Ser.II) Deptt,Dt.07.02.2015.

***

All the District Educational Officers and Regional Joint Directors of School Education in the State are informed that, the Rastriya Upadhyaya Panditha Parishad, AP Hyderabad have requested to issue orders for according promotions every month as stipulated in the rules to the Language Pandits and School Assistants.

All the District Educational Officers and Regional Joint Directors of School Education in the State are further informed that, the Government after bifurcation of this State have imposed a general ban on all promotions at all levels in G.O.Rt.No.2147/GAD, Dt.16.05.2014. Later the Government have relaxed ban in respect of District Level Posts and Zonal posts in G.O.Rt.No.2676 GAD, Dt.23.07.2014 and G.O.Rt.No. 2759 GAD, Dt.01.08.2014 respectively.

As per the request of the Teachers Association proposals were sent to Government for amending the service rules, with regard to the proposals to the posts of School Assistant Language etc. The said matter was under examination of the Government. The Rastriya Upadhyaya Panditha Pairshad have requested to stop the promotions to the School Assistant (Languages) and Language Pandits till the amend ments are received from the Government, accordingly, instructions have been issued to all the concerned by this office in Proc.Rc.No.374/Est.IV-1/2014 with instructions to accord promotions as ordered by the Government to all the posts except the promotions related to Languages and Language Pandits.

Government have issued necessary amendments G.O.Ms. No. 15 & 16 Edn. (Ser.II), Dept., Dt.07.02.2015 to the adhoc Service Rules of the teachers working in Government / Zilla Parishads with regard to the promotions to the posts of School Assistants (Languages) etc.

In the circumstances and keeping in view of the request of the Rastriya Upadhayay Panditha Parishad, all the District Educational Officers and Regional Joint Directors of School Education in the State are instructed to take necessary action with regard to promotions to all the posts as per G.O.Ms.No. 67 Edn., Dt.20.11.2010.

This has the approval of Commissioner of School Education, Andhra Pradesh, Hyderabad.

**V.S.BHARGAVA**
For Commissioner of School Education

***

## 2013-14లో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతుల వివరాలు పంపవలసిందిగా కమీషనర్ ఉత్తర్వులు

**PROCEEDINGS OF THE COMMISSIONER OF SCHOOL EDUCATION:: ANDHRA PRADESH :: HYD**

**Present : K.Sandhya Rani, IPoS**

**Rc.No.999/RMSA-AP/ 2015 Dt.09.03.2015**

**Sub :** RMSA - Implementation and expenditure particulars of conducting of training programme on Martial Arts - Called for - Regarding.

**Read :** This Office Procs Rc.No.999/RMSA/2013, Dt.12.02.2014.

***

The attention of all the District Educational Officers & Ex-Officio District Project co-ordinators of RMSA in the State is invited to the reference read above and they are requested to intimate the expenditure incurred on this component during the year 2013-14 school wise along with the information in the prescribed proforma enclosed herewith so as to enable this office to furnish the information to Government in the matter.

Treat this as MOST IMMEDIATE and the information should reach the under signed by 2.00 PM on 10.03.2015 without fail.

**Ecnl :** As above

**DIRECTOR, RMSA**

***

## పాఠశాలల పనివేళల మార్పుకు సవరణ ఉత్తర్వులు

**PROCEEDINGS OF THE DIRECTOR**
**STATE COUNCIL OF EDUCATIONAL RESEARCH AND TRAINING, A.P., HYDERABAD**

**Present: Smt. M.S.S. Lakshmi Watts, M.Sc., M.Ed.**

**Rc. No. 443/B/C&T/SCERT/2014 Dated: 5 -3 -2015**

**Sub:-** SCERT, AP, Hyderabad – Right to Education Act-2009 – Implementation of School timings as per RTE Guidelines – Modified School timings – Time Table – Reg.

**Ref:** 1. CSE RC. No. 141/B1/SCERT/2014,, dated 11-8-2014.
2. Note from C.M. Office C.M.P. No. 70/JS/2015, dt. 14-2-2015.
3. Proceedings of the Commissioner of School Education Rc. No. 36/A&1/2014, dt. 7-2-2015.

***

All the Regional Joint Directors of School Education and District Educational Officers in the State are informed that implement modified school timings under all managements. In this connection all schools should follow the modified school timings and time schedule as mentioned in the Annexures. All the Regional Joint Directors of School Education and District Educational Officers in the State instructed to inform all the managements to follow the new school timings and time schedule without any deviation. There is no change in Subject wise periods allotment (48 periods for primary, 54 periods for Upper Primary and High Schools) as mentioned in Academic calendar.

**Encl:** Annexure1: Primary school timetable
Annexure2: Upper Primary school timetable
Annexure3: High School timetable

Sd/-
**DIRECTOR**
S.C.E.R.T., A.P. , Hyderabad

***

**Annexure – 1**
**(As per the Proceedings of the Commissioner of School Education, Rc. No. 36/A&1/2014, dt. 7-2-2015.)**
**Time Schedule for Primary Schools :**
**9.00 A.M. to 3.45 P.M. First Bell : 9.00 A.M.**

| | |
|---|---|
| Second Bell | : 9.05 A.M. |
| School Assembly | : 9.05 A.M. to 9.15 A.M. : 10 minutes |
| First Period | : 9.15 A.M. to 10.00 A.M. : 45 minutes |
| Second Period | : 10.00 A.M. to 10.40 A.M. : 40 minutes |
| Interval | : 10.40 A.M. to 10.50 A.M. : 10 minutes |
| Third Period | : 10.50 A.M. to 11.30 A.M. : 40 minutes |
| Fourth Period | : 11.30 A.M. to 12.10 A.M. : 40 minutes |
| Lunch Break | : 12.10 A.M. to 1.00 P.M. : 50 minutes |
| Fifth Period | : 1.00 P.M. to 1.40 P.M. : 40 minutes |
| Sixth Period | : 1.40 P.M. to 2.20 P.M. : 40 minutes |
| Interval | : 2.20 P.M. to 2.30 P.M. : 10 minutes |
| Seventh Period | : 2.30 P.M. to 3.10 P.M. : 40 minutes |
| Eighth Period | : 3.10 P.M. to 3.45 P.M. : 35 minutes |

**Annexure – 2**
**(As per the Proceedings of the Commissioner of School Education, Rc. No. 36/A&1/2014, dt. 7-2-2015.)**
**Time Schedule for Upper Primary Schools :**
**9.00 A.M. to 4.10 P.M.**

| | |
|---|---|
| First Bell | : 9.00 A.M. |
| Second Bell | : 9.05 A.M. |
| School Assembly | : 9.05 A.M. to 9.15 A.M. : 10 minutes |
| First Period | : 9.15 A.M. to 10.00 A.M. : 45 minutes |
| Second Period | : 10.00 A.M. to 10.40 A.M. : 40 minutes |
| Interval | : 10.40 A.M. to 10.50 A.M. : 10 minutes |
| Third Period | : 10.50 A.M. to 11.30 A.M. : 40 minutes |
| Fourth Period | : 11.30 A.M. to 12.10 A.M. : 40 minutes |
| Lunch Break | : 12.10 A.M. to 1.00 P.M. : 50 minutes |
| Fifth Period | : 1.00 P.M. to 1.40 P.M. : 40 minutes |
| Sixth Period | : 1.40 P.M. to 2.20 P.M. : 40 minutes |
| Interval | : 2.20 P.M. to 2.30 P.M. : 10 minutes |
| Seventh Period | : 2.30 P.M. to 3.10 P.M. : 40 minutes |
| Eighth Period | : 3.10 P.M. to 3.45 P.M. : 35 minutes |
| Ninth Period | : 3.45 P.M. to 4.10 P.M. : 25 minutes |

**Annexure – 3**
**(As per the Proceedings of the Commissioner of School Education, Rc. No. 36/A&1/2014, dt. 7-2-2015.)**
**Time Schedule for High Schools : 9.30 A.M. to 4.45 P.M.**

| | |
|---|---|
| First Bell | : 9.30 A.M. |
| Second Bell | : 9.35 A.M. |
| School Assembly | : 9.35 A.M. to 9.45 A.M. : 10 minutes |
| First Period | : 9.45 A.M. to 10.30 A.M. : 45 minutes |
| Second Period | : 10.30 A.M. to 11.10 A.M. : 40 minutes |
| Third Period | : 11.10 A.M. to 11.50 A.M. : 40 minutes |
| Interval | : 11.50 A.M. to 12.00 A.M. : 10 minutes |
| Fourth Period | : 12.00 A.M. to 12.35 A.M. : 35 minutes |
| Fifth Period | : 12.35 A.M. to 1.10 P.M. : 35 minutes |
| Lunch Break | : 1.10 P.M. to 2.00 P.M. : 50 minutes |
| Sixth Period | : 2.00 P.M. to 2.40 P.M. : 40 minutes |
| Seventh Period | : 2.40 P.M. to 3.20 P.M. : 40 minutes |
| Interval | : 3.20 P.M. to 3.30 P.M. : 10 minutes |
| Eighth Period | : 3.30 P.M. to 4.10 P.M. : 40 minutes |
| Ninth Period | : 4.10 P.M. to 4.45 P.M. : 35 minutes |

***

## కడప మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా
### నిబంధనల మేరకు ప్రకటించవలసిందిగా సిడిఎంఏ ఉత్తర్వులు

**GOVERNMENT OF ANDHRA PRADESH**
**MUNICIPAL ADMINISTRATION DEPARTMENT**

| From | To |
|---|---|
| **Dr. G. Vani Mohan** | **The Commissioner** |
| **Commissioner & Director of** | **Municipal Corporation** |
| **Municipal Administration** | **Kadapa.** |
| **A.P., Hyderabad** | |

**Lr.Rc.No.1257/2015/J3 Dt.19.02.2015**

**Sir,**

**Sub :** Estt - Education - Kadapa Municipal Corporation - Tentative seniority of Secondary Grade Teacher (Telugu) Communicated on 26.11.2014 - Objections received from various teachers unions - Clarification - Issued.

**Ref :** Lr. Rc.No.2751/2008/KMC/C2, Dt.29.01.2015 of the Commissioner, Municipal Corporation, Kadapa.

****

With reference to your letter cited, you are hereby directed to finalize and issue the tentative seniority list prepared in acordance with the existing rules / procedure in respect of the Secondary Grade Teachers in the absence of the service rules to the Municipal teachers, and report compliance immediately for avoiding further complications in the matter.

Yours faithfully
**Sd/- D. Vizai Bhaskar**
For Commissioner & Director

***